ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 261 పేజీలు: 12 వెల: 6.50

## సెర్బియా పార్లమెంటుపై ఉగ్రదాడి

## వైట్‌హౌస్ భద్రత గేటును ఢీకొట్టిన కారు

9లో

# అమరావతిలో ప్రపంచస్థాయి లైబ్రరీ




బుధవారం దుబాయ్‌లోని ప్రముఖ రియాల్టి సంస్థ శోభా గ్రూప్ ఫౌండర్ చైర్మన్ పిఎన్సీ మీనన్‌తో సిఎం సమావేశ దృశ్యం

### రూ. 100 కోట్లతో నిర్మాణానికి ముందుకొచ్చిన దుబాయ్ సంస్థ శోభా గ్రూప్

### టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్లు నిర్మించాలని సంస్థ చైర్మన్ రవి మీనన్‌ను కోరిన సిఎం చంద్రబాబు

### గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రం చిరునామా

### దుబాయ్‌లోని పారిశ్రామికవేత్తలతో సిఎం చర్చలు

**విజయవాడ అక్టోబరు 22, ప్రభాతవార్తప్రతినిధి:** దుబాయ్‌లోని ప్రముఖసంస్థ శోభా రియాల్టి అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రూ.100 కోట్ల విరాళంతో వరల్డ్ క్లాస్ లైబ్రరీని నిర్మించనుంది. ఎపిలో పెట్టుబడి అవకాశాలు వివరించేందుకు దుబాయ్ పర్యటనకు వెళ్లిన సిఎం చంద్రబాబుతో ఆ దేశంలోని శోభా రియాల్టి చైర్మన్ రవి మీనన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లైబ్రరీ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించారు. శోభా రియాల్టి సంస్థ అమరావతిలో ప్రపంచ స్థాయి స్టేట్ లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు రావటంపై సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించటంపై ధన్యవాదాలు తెలియచేశారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని సిఎం ఆయనకు వివరించారు. రాజధాని నిర్మాణంలో శోభా రియాల్టీ సంస్థకూడా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఎపికి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయిలో నగరాలు నిర్మితం అవుతున్నాయని వాటితో సమానంగా మౌలిక సదుపాయాలతో అమరావతిని నిర్మిస్తున్నట్టు సిఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శోభా గ్రూప్ ప్రతినిధులకు చంద్రబాబు వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు అవుతోందని చంద్రబాబు చెప్పారు. ఇక తిరుపతి, విశాఖ వంటి నగరాల్లో రానున్న రోజుల్లో అనేక మార్పులు రానున్నాయని... మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

**పోర్టులున్నాయి... కారిడార్లు వస్తున్నాయి..**

రాష్ట్రంలో రియాల్టి రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లోకూడా బిజినెస్ ఐటీ పార్కులు, మాల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లతో పాటు ఉన్నతశ్రేణి వర్గాలకు హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితం అవుతున్న పారిశ్రామిక కారిడార్లు, పోర్టులకు >>2



నెల్లూరు జిల్లా జలదంకిలో పొంగిపొర్లుతున్న వాగులు

# మరో 3 రోజులు భారీ వర్షాలు

### విపత్తు నివారణ సంస్థ అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత

### వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం

### పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

### పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణసంస్థ అధికారులతో హోంమంత్రి అనిత బుధవారం సమీక్ష >>2

**తిరుపతి జిల్లాలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం** 2లో

# ఉపాధి హామీ పథకానికి మొదటి విడతగా రూ. 665 కోట్లు

### నిధులు విడుదల చేసిన కేంద్రం

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.665 కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.166 కోట్లు జత చేసింది. మొత్తంగా రూ.831 కోట్ల నిధులతో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేసే వెసులుబాటు కలుగుతుంది. రాష్ట్రంలో పంచాయతీ భవనాల నిర్మాణం, రికార్డులు కంప్యూటరీకరణ, సిబ్బంది, ప్రజా ప్రతినిధులకి శిక్షణ, ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జిఎస్ఎ) ద్వారా రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు జత చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి, గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియచేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి లలన్ సింగ్ ప్రత్యేక కృతజ్ఞతలు. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ అందించేందుకు తగిన ఆదేశాలు ఇస్తున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలి

### పిఠాపురానికి చెందిన శ్రీదుర్గ ప్రసూతి మరణంపై తక్షణం నివేదిక ఇవ్వండి

### కాకినాడ కలెక్టర్, పడా ప్రాజెక్టు డైరెక్టర్‌తో డి సిఎం పవన్



**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్న తరుణంలో ప్రసూతి సమయంలో అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఇందుకు సంబంధించిన సేవలపై అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం రాజధానిలోని క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇటీవల పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకి చెందిన దొండపాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం అపస్మారక స్థితికి చేరుకోవడం, కాకినాడ ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన ఘటనపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి సమయంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. గర్భిణులకు వైద్యం >>2



బుధవారం ఇరుముడిని శిరసున ఉంచి శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించిన రాష్ట్రపతి ముర్ము

## రాష్ట్రపతి అయ్యప్ప దర్శనం

**తిరువనంతపురం, అక్టోబరు 22:** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం పంబనుంచి ఇరుముడితో ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. అధి >>2

# హైస్కూలు నుంచే ఎఐ



స్పోర్ట్స్ హబ్‌ల గురించి నారా లోకేష్‌కు వివరిస్తున్న ఎఐవైఎఫ్ పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు

### స్కూళ్లలో ఎఐ, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌ల ఏర్పాటు

### బ్రిస్‌బేన్ విద్యారంగ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ భారత్‌లో ముందువరుసలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారాలోకేష్ అన్నారు. విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో హైస్కూలు స్థాయి నుంచే ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని, ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను ఎపిలోని యువత అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఎపిలో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గవర్నెన్స్‌లో ఎఐ వినియోగం ద్వారా అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఎఐ ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం ఆంధ్రప్రదేశ్‌గ్రిఫిత్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. 'పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేసేలా గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయండి. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధృవీకరణ, గ్లోబల్ అకడమిక్ ప్రమాణాల కోసం ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు, ఎపిఎస్ఎస్‌డిసి (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్)తో భాగస్వామ్యం వహించండి. పునరుత్పాదక శక్తి, వాతావరణ స్థితిస్థాపకత, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ రంగాల్లో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభించండి. గ్రిఫిత్ యూనవర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ విద్యాసంస్థల మధ్య డ్యూయల్‌డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయండి. ఈ ఏడాది >>2

## అద్దేపల్లి, జగన్మోహన్ ఎక్సైజు పోలీసు కస్టడీకి

### -నకిలీ మద్యం కేసు

**విజయవాడ, అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్‌గా మారిన నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దన్, జగన్ మోహన్‌ను ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి ఇస్తూ ఎన్టీఆర్ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 24 నుంచి అక్టోబరు 30 వరకు ఏడు రోజులపాటు నిందితులను పోలీస్ కస్టడీకి ఇస్తూ జిల్లా కోర్టు ఆదేశించింది.

ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌ను ఈనెల 24న అదుపులోకి తీసుకుని 30న తిరిగి జైలు అధికారులకు అప్పగించనున్నారు. కాగా, ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో అద్దేపల్లి జనార్దన్ ఉన్నాడు. అలాగే విజయవాడ జైల్లో ఉన్న ఏ2 జగన్ మోహన్‌ను కూడా పోలీసులు విచారించనున్నారు. అతడినీ ఈనెల 24 నుంచి 30 వరకు ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు.

# అరమార్కు సడలింపు!

### ఇంటర్ ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షలకు సర్దుబాటు

**విజయవాడ, అక్టోబరు 22, ప్రభాతవార్తప్రతినిధి :** ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షల్లో అర మార్కు సడలింపు ఇచ్చింది. 2 సంవత్సరాల్లో కలిపి రాత పరీక్షలో అర మార్కు తక్కువ వచ్చినా, విద్యార్థులను ఉత్తీర్ణులుగానే పరిగణించనున్నట్లు ప్రకటించింది. ఈ అర మార్కును సెకండ్ ఇయర్‌లో నిర్వహించే ప్రాక్టికల్స్‌లో సర్దుబాటు చేశారు. ఇంటర్మీడియట్‌లో ఈ విద్యా సంవత్సరం ఎన్‌సిఇఆర్టీ సిలబస్‌ను అమలు చేయడంతో పాటు పరీక్షల్లోనూ అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను బోర్డు విడుదల చేసింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టులకు సంబంధించి ఫస్ట్ ఇయర్‌లో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఎగ్జామ్స్‌లో పాస్ అవ్వాలంటే 35 మార్కుల లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఫస్ట్ ఇయర్‌లో 29 మార్కులకు తగ్గించారు. సెకండ్ ఇయర్‌లో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారు. 2 సంవత్సరాలు కలిపి 35 మార్కుల కింద 59.50 మార్కులు సాధించాల్సి ఉండగా, 59 మార్కులకే ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఆ అర మార్కును సర్దుబాటు చేసి, సెకండ్ ఇయర్‌లో ప్రాక్టికల్స్ 30 మార్కులకు, ఉత్తీర్ణత సాధించేందుకు 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు. ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్టుల్లో 30 మార్కులు వచ్చినా ఉత్తీర్ణులే. అయితే, మొత్తం మీద 35 రావాల్సి ఉంటుంది. ఏదైనా ఒక సబ్జెక్టులో అత్యధిక మార్కులు వచ్చి, మిగతా వాటిలో 30 చొప్పున మార్కులు వచ్చినా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 23 నుంచి ఫస్ట్‌ఇయర్, ఫిబ్రవరి 24నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇది తాత్కాలిక షెడ్యూల్‌మాత్రమే అని పరిస్థితినిబట్టి ఇందులో మార్పుచేసేఅవకాశం ఉంటుందని పేర్కొంది.

## టీచర్లకూ 'టెట్'

### రెండు రోజుల్లో నోటిఫికేషన్

**విజయవాడ,అక్టోబరు 22,పభాతవార్త ప్రతినిధి:** సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు ప్రస్తుతం పని చేస్తున్న టీచర్లకూ అవకాశం కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2011కు ముందు టెట్ లేకుండా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన టీచర్లకూ టెట్ రాసుకునే అవకాశం కల్పిస్తున్నారు. రెండు రోజుల్లో టెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి రెండేళ్లలో ఉత్తీర్ణులు కావాలని స్పష్టం చేసింది. ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయే వారికి అవసరంలేదని, అయితే వారుపదోన్నతి పొందాలంటే టెట్ పాసవ్వాలని సూచించింది. సుప్రీం కోర్టు తీర్పుపై ఇపపటికే కొన్ని సంఘాలు రివ్యూ పిటీషన్లు వేశాయి. ఈ తీర్పుకోసం వేచి ఉండే వారికే వెసులుబాటు కల్పిస్తారు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ షెడ్యూలును విడుదల చేయనుంది. ఈసారి అర్హత తగ్గింపు >>2

# రూ.10,319 కోట్లతో అమృత్ 2.0 పనులు

### సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఆమోదం

### రామ్ మోడల్‌లో 281 పనుల పూర్తికి అనుమతి

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ స్థానికసంస్థల్లో తాగునీటిసరఫరా, మురుగు నీటి శుద్ధి, ఇతరత్రా 281 ప్రాజెక్టుల పనులు అమృత్ 2.0లోచేపట్టేందుకు రూ.10,319 కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వం ఆమోదించింది. కన్సెషనల్ హ్యాబ్రిడ్ యాన్యుటీ మోడల్ (చామ్)లో పనులు పూర్తి చేసేందుకు అనుమతించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్సీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు సరిగా కేటాయించని కారణంగా నిలిచిపోయిన అమృత్ 2.0 పనులు ఇప్పుడు ఛామ్ మోడల్‌లో పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అంచనా వ్యయంలో 60% మొత్తాన్ని గుత్తేదారు సంస్థలు సమకూర్చనున్నాయి. వీటిని వడ్డీతో పదేళ్లలో 40 వాయిదాల కింద రాష్ట్రప్రభుత్వం తిరిగి చెల్లించనుంది. మిగతా 40% నిధులు పట్టణ స్థానిక సంస్థల వాటాతో పాటు 15,16వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి ఖర్చు చేయనున్నారు.

ప్రతి బిల్లులో నుంచి 7.5% మొత్తాలు తగ్గించి గుత్తేదారులకు చెల్లించేవిధానానికి చామ్ మోడల్‌లో మినహాయించారు. ఈ మొత్తాలు పనులు పూర్తయ్యాక తిరిగి గుత్తేదారులకు చెల్లిస్తుంటారు. జాతీయ రహదారుల అథారిటీ పనుల్లో ఇలాంటి మినహాయింపు ఇచ్చినందున...అదే మోడల్‌ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయంలో 60% మొత్తాలు గుత్తేదారులే పెట్టుబడిగా పెడుతున్నందున బిల్లుల్లో ప్రతిసారీ 7.5% కోత పెట్టాలన్న నిర్ణయం పైనా గుత్తేదారు సంస్థలు అభ్యంతరం తెలిపాయి. 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల >>2




బుధవారం దుబాయ్‌లోని షరాఫ్ గ్రూప్ సంస్థతో సింఎం చంద్రబాబు భేటీ దృశ్యం

# షరాఫ్ గ్రూప్‌తో సిఎం చంద్రబాబు చర్చలు

**విజయవాడ అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలపై షరాఫ్‌తో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మౌలిక వసతులు, మానవ వనరుల లభ్యత, అలాగే ఇతర అనుకూలతల గురించి వివరించారు. బుధవారం యుఎఇలో తొలిరోజు పర్యటనలో భాగంగా షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్‌తో సమావేశమైన సిఎం.. ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటు గురించి ప్రధానంగా చర్చించారు. షరాఫ్ గ్రూప్ ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఏపి చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్క్‌లు, గిడ్డంగులు స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి ఆసక్తి చూపిన షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, గిడ్డంగి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరిచింది. ఇందుకోసం రైల్వే, పోర్ట్ అనుసంధానం కలిగిన ప్రాంతాన్ని గుర్తించాలని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**అవసరమైతే పాలసీల్లో మార్పులు చేస్తాం..**

మా రాష్ట్రంలో పోర్టులు, నేషనల్ హైవేలు విస్తారంగా ఉన్నాయి. కార్గో రవాణాకు రాష్ట్రం అనుకూలం. మేం ఇప్పుడు కొత్త పాలసీలు తెచ్చాం. రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే పాలసీల్లో మార్పులు తేవడానికి సిద్ధం. లాజిస్టిక్స్‌పై 14 శాతం ఖర్చుపెడుతున్నాం. దీన్ని 8 నుంచి 9 శాతానికి తగ్గించాలని చూస్తున్నాం. ఇందుకోసం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, రహదారి ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. లాజిస్టిక్ వ్యయం తగ్గించడానికి సహకరించండి. రాయలసీమలో ఆటోమొబైల్ పరిశ్రమలువస్తున్నాయి. నవంబరు 14,15 తేదీల్లో విశాఖలోజరిగే పెట్టుబడిదారుల సదస్సుకు హాజరుకండి అని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి అన్నారు. దీనికి స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగాఉన్నామని, ఎపికి తప్పనిసరిగా వస్తామని చెప్పారు.

# ప్రపంచస్థాయి లైబ్రరీ

>> అనుసంధానంగా ఇండస్ట్రియల్ టౌన్ షిప్, హౌసింగ్ ప్రాజెక్టులకు అవకాశం ఉందని శోభా రియాల్టీ ఛైర్మన్ రవి పిఎన్సీ మీనన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా శోభా గ్రూప్ సంస్థ చేస్తున్న ఛారిటీని సిఎం అభినందించారు. తమ ఆదాయంలో 50 శాతాన్ని ఛారిటీగా ఖర్చు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ తాము ఎపిలో పి4 విధానాన్ని అవలంభిస్తూ అమలు చేస్తున్న జీరో పావర్టీ మిషన్ అంశాలను వివరించారు. తమ సంస్థ దుబాయ్‌తో పాటు ఓమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని శోభా గ్రూప్ ఛైర్మన్ రవి మీనన్ ముఖ్యమంత్రికి వివరించారు. భారత్‌లోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో శోభా రియాల్టీ ప్రాజెక్టులు చేస్తోందని.. ప్రత్యేకించి బెంగుళూరు, గుర్గావ్, చెన్నై, కేరళలోని హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టామని సిఎంకు తెలిపారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నామని...ఆ సదస్సుకు రావాలని సిఎం చంద్రబాబు ఆహ్వానించారు.

# ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలి

>> నుంచి ప్రసవం వరకూ, అనంతర వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా అందాలని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర సిబ్బంది వ్యవహారంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పిఠాపురం ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గంలో వైద్యం అందించే విధానం అందరికీ ఒక మోడల్‌గా నిలవాలని.. ఆ దిశగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లాలో మెటర్నల్ డెత్ ఆడిట్ నిర్వహణ గురించి ఆరా తీశారు. ప్రసూతి మరణాలు సీరియస్‌గా తీసుకోవలసిన అంశమనీ, ఇలాంటి మరణాలు సంభవించినప్పుడు తక్షణమే నిపుణులైన వైద్యుల బృందంతో సమగ్రంగా విచారణ చేసి కారణాలను నమోదు చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శ్రీదుర్గ ప్రసూతి మరణంపై, పుట్టిన బిడ్డ ఆరోగ్య స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ఆసుపత్రులపై వైద్యులు, ఇతర సిబ్బంది తమ విశ్వాసాల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించి ప్రభుత్వ ఆసుపత్రులను వ్యక్తిగత విశ్వాసాల ప్రచారానికి వేదికలుగా చేయకూడదన్నారు.

# అమృత్ 2.0 పనులు

>> ప్రకారం టెండర్లు పిలిచేందుకు పురపాలక శాఖ ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.ఏపీ పట్టణాభివృద్ధి చరిత్రలో అతి పెద్ద పెట్టుబడి ప్రాజెక్టుగా రికార్డ్,పట్టణాల్లో మెరుగైన త్రాగునీరు,డ్రైనేజీ సుపాయంరూ.10,319.93 కోట్లతో 281 పనులకు పరిపాలనా ఆమోదం తెలుపుతూ మున్సిపల్ శాఖ ఆమోదం ఎపియుఎఫ్ఐడిసి,పబ్లిక్‌హెల్త్,గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్‌లకు భాధ్యతలుమొత్తం ప్రాజెక్ట్ ఖర్చులో కేంద్రం నుంచి రూ.4,470 కోట్లు,రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2,490 కోట్లు,ఫైనాన్స్ కమీషనర్ నిధులు రూ.925 కోట్లు,పట్టణాల వాటా రూ.590 కోట్లుమొత్తం ప్రాజెక్ట కాంప్లెక్స్ రూ.6,477 కోట్లు,పదేళ్ళ నిర్వహణ ఖర్చు రూ.1499 కోట్లు,వడ్డీ ఖర్చు రూ.2,344 కోట్లు కేటాయించారు.



బుధవారం అమిత్‌షా పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుజరాత్ మంత్రి హర్ష్ సంఘ్వి

# ఎన్ఐఎ కస్టడీకి ఉగ్రవాది అబూబకర్ భార్య సైరా బాను

## కడప సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తరలింపు

**రాజంపేట,అక్టోబర్ 22 ప్రభాతవార్త:** దేశంలోనే సంచలనం సృష్టించిన తమిళనాడు బాంబు పేలుళ్ల లో కేసులో ఎన్ఐఎ బృందం అదుపులోకి తీసుకున్న ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధికి భార్య సైరా బానును పిటి వారినితో బుధవారం విజయవాడకు తరలించారు. కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదుగా ఉన్న సైరాబానును వారం రోజులుపాటు విచారణకోసం ఎన్ఐఎ అధికారులు తీసుకెళ్లారు. జూలై 1న రాయచోటిలో నివాసం ఉంటున్న ఉగ్రవాదులు అబూబకర్, మహమ్మద్ లను తమిళనాడు ఐబి అధికారులు అరెస్ట్ చేసి చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విచారణలో పలు విషయాలు వెల్లడి కావడంతో ఎన్ఐఎ అధికారులు పిటి వారెంట్‌తో కడప సెంట్రల్ జైలు నుంచి విజయవాడకు తరలించారు. సైరా భానును విచారిస్తే ఇంకా ఎలాంటి సంచలన విషయాలు బయటపెడతాయో చూడాల్సి ఉంది.

# పాఠశాల బాలికపై వృద్ధుని అత్యాచారం

## నిందితునిపై కేసు నమోదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22( ప్రభాతవార్త ):** తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గురుకుల (బాలికలు) పాఠశాలలో ఎనిమిదవతరగతి చదువుతున్న విద్యార్థినికి తాతవరసయ్యే 62 ఏళ్ల వ్యక్తి మాయ మాటలు చెప్పి పాఠశాల నుండి బయటకు తీసుకెళ్లారు. ఆ వ్యక్తి పట్టణ శివారులో అత్యాచారం చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలపై పెద్దాపురం డిఎస్పి డి. శ్రీహరి రాజు సంఘటనా స్థలానికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేస్తామని, అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి తాటిక నారాయణరావుపై కిడ్నాప్, లైంగికం, అత్యాచారం, సెక్షన్ 5,6 వంటి పలు సెక్షన్లతో కేసు నమోదు చేశామని డిఎస్పీ తెలిపారు. ఇది హేయమైన నేరం. అవమానవీయ కోణంలో దర్యాప్తు చేయాలి. కాబట్టి ప్రతి ఒక్కరు సహకరించాలి. సోషల్ మీడియాలో పార్టీల పేరుతో ప్రసారం చేయరాదు. బాధితురాలు ఫోటోలు ప్రసారం చేయవద్దని ఆయనపేర్కొన్నారు. ఈ కేసును త్వరితగతిన విచారణ చేసి ప్రత్యేక జ్యుడీషియల్‌కు నివేదిస్తామన్నారు. ఈ సంఘటనపై గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళన చేశారు. ఎవరి అనుమతితో నాలుగుసార్లు పాపను బయటకు పంపించారని, ఆ విషయాలను వెల్లడించాలని ప్రిన్సిపాల్ని నిలదీశారు. రాష్ట్రంలో ఆడపిల్లలకి రక్షణ ఉందా? లేదా? అని మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మిశివ కుమారి పాత్రికేయ సమావేశంలో హోమంత్రి అనితను ప్రశ్నించారు. హోం మంత్రి అనిత మహిళ, తుని ఎమ్మెల్యే మహిళ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మహిళా వరుసగా ఉన్న మూడు నియోజకవర్గాలలో మహిళా శాసనసభ్యులు ఉన్నప్పటికీ మైనర్ బాలికపై అత్యాచారం జరగటం రాష్ట్రానికి సిగ్గుచేటు అన్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ప్రశ్నించిన అనిత గొంతు అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవడం శోషనీయమన్నారు. మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె వెల్లడించారు.

# ఎన్టీఆర్ సేవా ట్రస్టు నెట్వర్క్ ఆసుపత్రులకు రూ. 250 కోట్లు విడుదల

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ(నెట్వర్క్) ఆసుపత్రుల బకాయిల్లో రూ.250 కోట్లను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. నిధుల చెల్లింపులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తో చర్చించారు. అనంతరం చర్యల్లో భాగంగా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. అలాగే త్వరలో మరో రూ.250 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను సౌరభ్ గౌర్ కోరారు. ఈ మేరకు బుధవారం తనని కలిసిన పలువురికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

# కాకినాడలో భారీ వర్షం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22(ప్రభాతవార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కాకినాడ జిల్లాలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ ప్రధానమార్గంలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం సాయంత్రంనుండిఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. తీర ప్రాంతంలో సముద్రపు అలలు ఎగసిపడి కెరటాల ఉధృతికి కోతకు గుర వుతుంది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడడంతో రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# టిడిపిలో వేధింపులపై సీనియర్ నాయకుడు ఆందోళన

## ఎన్టీఆర్ విగ్రహానికి తల బాదుకుంటూ కన్నీరు

**లేపాక్షి, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీలో ఓ నాయకుడు తనను వేధింపులకు గురిచేస్తున్నాడని నిరసిస్తూ లేపాక్షి మండలం సిరివరంకు చెందిన సీనియర్ నాయకులు ఆవులరెడ్డి వినూత్న రీతిలో తన ఆవేదనను వెలిబుచ్చాడు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్ష మండల కేంద్రమైన లేపాక్షిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు మంగళవారం రాత్రి చేరుకుని కొన్ని నిమిషాల పాటు అందరూ చూస్తుండగా తాను ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకుంటూ ఎన్టీఆర్ విగ్రహానికి తలబాదుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయ వర్గాల్లో సంచలనం కలిగించిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. సిరివరం చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్న ఆవులరెడ్డి తనకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశాడు. తనకు అన్యాయం చేసింది కేవలం టిడిపికి చెందిన గ్రీన్ పార్క్ నాగరాజు అని గట్టిగా కేకలు వేశారు. తనను బలవంతంగా తాగునీటి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేయించారని, వారిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తానని ఎన్టీఆర్ పాదాల ముందు మోకరిల్లి పలుమార్లు తల బాదుకున్న సంఘటన అందరినీ కలచి వేసింది. వివరాల్లోకి వెళితే గత ఎమ్మెల్యే ఎన్నికల్లో సిరివరం పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ తగ్గింది అన్న కారణంగా సీనియర్ నేతలపై వేటు వేసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా గత వారంలో లేపాక్షి మండల మాజీ జెడ్‌పిటిసి హిందూపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సిరివరం కిష్టప్పను ఎమ్మెల్యే కార్యాలయానికి పిలిపించి ప్రస్తుతం నిర్వహిస్తున్న డీలర్ షిప్‌కు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిరివరం కిష్టప్ప గత 35 సంవత్సరాలుగా తాను డీలర్ షిప్ నిర్వహిస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిర్వహిస్తున్నట్టు ఘాటుగా సమాధానమిచ్చినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. తాను డీలర్ షిప్‌కు ఎట్టి పరిస్థితులలోనూ రాజీనామా చేయనని ఖరాకండిగా ఎమ్మెల్యే కార్యాలయంలో తెగేసి చెప్పినట్టు సమాచారం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కూడా తనకు ఎలాంటి సమస్య ఎదురు కాలేదని వారితో పేర్కొన్నట్టు తెలిసింది.

ఆ తరువాత ఆవులరెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయానికి పిలిపించి సిరివరం చెరువు సంఘం అధ్యక్షుని పదవికి బలవంతంగా రాజీనామా చేయించినట్లు అందుకు సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత గ్రీన్ పార్క్ నాగరాజు తనను డిమాండ్ చేసినట్లు ఆవులరెడ్డి లేపాక్షిలో ఎన్టీఆర్ విగ్రహం ముందు ఆరోపించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తాను సిరివరంలో నిరంతరం కష్టపడి పని చేశానని అయినా నాకు తీరని అన్యాయం జరిగిందని ఆవులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ కోసం తాను నిరంతరం కష్టపడ్డానని ఆయన అన్నారు.

# టీచర్లకూ 'టెట్'

>> లేదు: ఎస్సీ,ఎస్టీ,బీసీ,విభిన్న ప్రతిభావంతులకు డిగ్రీలో 40% మార్కులున్నా బిఇడిలో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ సడలింపుతో బిఇడి పూర్తి చేసిన అభ్యర్థులు ఆతర్వాత టెట్ రాయాలంటే 45%అర్హత మార్కులు అవసరమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ నిబంధనను సడలిస్తూ 40% ఉన్నా టెట్‌రాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈసారి 45% అర్హతమార్కులనే అనుసరించాలని పాఠశాలవిద్యాశాఖ నిర్ణయించింది. రెండు రోజుల్లో ఇవ్వనున్న టెట్‌లో 2011కు ముందు, ఆతర్వాత విద్యార్హతలను నిర్ణయించింది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు విద్యార్హతల్లో కనీస మార్కులు ఉండాలనే దానిపై ఇంత వరకు స్పష్టత రాలేదు.2011కు ముందు అభ్యర్థులు టెట్ రాసేందుకు ఎస్జీటీలకు ఇంటర్మీడియట్‌లో ఒసిలకు 45% బీసీ,ఎస్సీ,ఎస్టీ,దివ్యాంగులు,మాజీ సైనికోద్యోగులకు 45% మార్కులు ఉండాలి. పేపర్-2 రాసేవారికి సైతం నిర్ణీత అర్హతలో ఓసీలకు 50%,ఇతరులకు 45% మార్కులు ఉండాలి.

## వారం - వర్జ్యం

**23-10-2025, గురువారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**కార్తీకమాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, శుక్లపక్షం**
విదియ రా.10.47
విశాఖ తె.4.41
వర్జ్యం : ఉ.9.21-11.09
దు.ఉ.9.56-10.43, 2) మ.2.36-3.23
శుభసమయం: ఉ.8.00-8.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:**వృత్తి, వ్యాపారాలలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృషభం:** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:**నూతన పెట్టుబడులు కొద్దికాలం వాయిదా వేయడం మంచిది.

**కర్కాటకం :**ముఖ్యవ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**సింహం:**దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కన్య :** జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహన సౌఖ్యం.

**తుల :** దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మకరం:** ఎల్లవేళలా సలహాలను తీసుకోనే వారి వద్ద కాకుండా మరొక నిపుణుని సలహాలు తీసుకొంటారు..

**కుంభం:** వివాదాలకు దూరంగా ఉండండి. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం:** శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆ కీచకుడి భరతం పట్టండి

## కాకినాడ ఎస్పీని కోరిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురుకుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాలనుంచి తోటల్లోకి తీసుకెళ్లి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం సోషల్ మీడియాలో దుమారం రేగింది. దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్‌కమిటీకి ఆదేశాలు జారీచేశారు. ఘటనపై పూర్తినివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖకు లేఖల ద్వారా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను

# తిరుపతి జిల్లాలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం

**తిరుపతి, అక్టోబరు 22ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాయలసీమ జిల్లాల్లో ప్రధానంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలవ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం తరువాత అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ రెండు జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీచేసింది. ప్రభుత్వ అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. రెండుజిల్లాల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకు తిరుపతి జిల్లాలో తిరుమల,తిరుపతి, చంద్రగిరి, రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు ,తడ మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. సరాసరి జిల్లావ్యాప్తంగా 8.3సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, చంద్రగిరి, నాయుడుపేట, పుత్తూరు,ఏర్పేడు మార్గాల్లో ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఇళ్లలోకి భారీగావరదనీరుచేరింది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట తరువాత సూర్యుడు కనిపించాడు. దీంతో వరుణదేవుడు శాంతించినా చలిగాలులు వీస్తున్నాయి. తిరుపతి జిల్లా, చిత్తూరుజిల్లాలో 24గంటలూ అప్రమత్తంగాఉండాలని ఆదేశాలతో కంట్రోల్‌రూమ్స్ కొనసాగిస్తున్నారు. ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లాఎస్పీ తుషార్‌డూడే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేలా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. తిరుపతినగరంలోని అనేక ప్రాంతాలు, ప్రధాన మార్గాలు భారీ వర్షాలకు జలమయంగా మారాయి.

# మరో 3 రోజులు భారీ వర్షాలు

>> సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు,ఇక శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరేంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేసింది. గురువారం(ఈ నెల23వ తేదినుంచి) నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది.

**అధికారుల అలర్ట్**

దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా మారుతుంది కాబట్టి, మత్స్యకారులు వచ్చే శనివారం వరకు వేటకు వెళ్లవద్దు అని అధికారులు హెచ్చరించారు. ప్రభావిత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రజలు సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించవచ్చు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ఎపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బంది పడుతున్నది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైనవి. కౌండిన్య నదిలో జల ప్రవాహం ఎక్కువగా ఉన్నది కావున ప్రజలు నీటి ప్రవాహం వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎడతెరపి లేని వర్షాల వలన మనుషులే కాక జంతువులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. బుధవారం ఉదయం పలమనేరు మున్సిపల్ కమిషనర్ లోతట్టు ప్రాంతాలైన పలమనేరు పెద్ద చెరువు ఎద్దుల చెరువు ముంపు ప్రాంతాలను పరిశీలించి ఆయా ఏరియా వార్డు సెక్రటేరియలకు సహాయక చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు. ఏపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం తీవ్ర ఇబ్బంది పడుతున్నది.రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులను రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. దక్షిణకోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ చేపలవేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడెక్కడ వాగులు పొంగుతాయో అక్కడి ప్రజలను హెచ్చరించాలని ఆదేశాలు జారీ చేశారు. చెట్లు విరిగిపడే చోట ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అధికారులంతా సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

**రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు, పిడుగుపాటు ఇద్దరు మహిళలు మృతి**

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం తమిళనాడు తీరం నుంచి వాయవ్య దిశగా కదిలి అదే ప్రాంతంలో కొనసాగుతోంది. వాయువ్య దిశగా రాబోయే 12 గంటల్లో నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తదుపరి 12 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్ర కోస్తా తీరాల మీదుగా కదిలే అవకాశం ఉంది. దక్షిణ కోస్తాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.రాష్ట్రంలో తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో రాయలసీమ లోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు కోస్తాలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# హైస్కూలు నుంచే ఎఐ

>> నవంబర్ 14,15 తేదీల్లో ఎపిలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ 2025, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ సమావేశాలకు హాజరుకండి. గ్రిఫిత్ విశ్వవిద్యాలయ ఆవిష్కరణ, స్టార్టప్ మద్దతునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలసి పనిచేయాలి" అని మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు.

**ఎపిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు డిజైన్లు ఇవ్వండి: పాపులస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ భేటీ**

పాపులస్ ఆసియా పసిఫిక్ బిజినెస్ డెవలప్‌మెంట్, బిడ్స్ అండ్ కమ్యూనికేషన్ హెడ్ ఎలిజిబెట్ డిసిల్వాలతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బ్రిస్బేన్‌లో భేటీ అయ్యారు. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన స్టేడియాలకు వినూత్నమైన డిజైన్ రూపకల్పన, నిర్మాణంలో పాపులస్ ఆర్కిటెక్ట్స్ సంస్థ పేరొందింది. క్రీడాసౌకర్యాలు, మైదానాలు, ఈవెంట్ స్థలాలడిజైనింగ్, నిర్మాణంలో 40సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన పాపులస 60 బిలియన్ల విలువైన 3,500కు పైగా విలువైన ప్రాజెక్టులను చేపట్టింది. భారత్‌లో ప్రధాన మౌలికసదుపాయాల ప్రాజెక్టులపై ఎల్ అండ్ టీతో కలసి పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు మద్దతుఇచ్చే క్రీడా సదుపాయాలను అభివృద్ధిచేస్తోంది.

# రాష్ట్రపతి అయ్యప్ప దర్శనం

>>.కారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలధరించి ఇరుముడితో 18 మెట్లుఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముర్ము ఓ రికార్డు నెలకొల్పారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా నిలిచారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో రెండు గంటల పాటూ బస చేయనున్నారు. అక్కడే రాష్ట్రపతికి ప్రత్యేకంగా ఆహారంవండి వడ్డించారు. మధ్యాహ్నం 3:10 గం.కు ముర్ము శబరి మల నుంచి బయల్దేరి వెళ్లారు.

23-10Pg3exHMNWJQECRT 3_23-10Pg3exHMNWJQECRT.qxd 10/22/2025 11:51 PM Page 1



# తిరుమల సమాచారం

## వైష్ణవ భక్తాగ్రేసరులకు అప్పపడి



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** అనాది కాలంగా కొనసాగుతున్న వైష్ణవ సాంప్రదాయాల్లో అప్పపడి నివేదన విశిష్టమైన ప్రసాదం. శ్రీవారికి భక్తులపట్ల అపారకరుణకు ప్రతిఫలంగా స్వయంగా భక్తులకు ప్రసాదాన్ని పంపించే ఆచారం అప్పపడి. వైష్ణవభక్తాగ్రేసరుల తిరునక్షత్రోత్స వాల పవిత్ర దినాల్లో భాగంగా అప్పపడి ఊరేగింపు తిరుమల నుండి తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంకు తీసుకెళ్ళారు. రేపు శాత్తుమొర నిర్వహిస్తారు.

## శ్రీవారి ఆశీస్సులతో సకలశుభాలు

### - హైకోర్టు జడ్జి మానవేంద్రరాయ్



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసం ఆరంభంలో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్ విశ్వాసం వెలిబుచ్చారు. సకలశుభాలు కలగాలని ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్న న్యాయమూర్తి తోలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆశీస్సు లందుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో మాజీ డిజిపి ఠాకూర్



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం మాజీ డిజిపి ఆర్‌పి ఠాకూర్ దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆయన ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఠాకూర్ వెంట తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఒ సురేంద్ర ఉన్నారు.

## అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నాం



**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అందరికీ మంచి జరుగుతుందని ,ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని వేడుకున్నట్లు మాజీ మంత్రి సినీనటి ఆర్‌కె రోజా, సినీనటి రవళితెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఇద్దరూ ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# షిప్ బిల్డింగ్ నుంచి డేటా సెంటర్ల దాకా..

### - ఎపిలో భారీ అవకాశాలు - యుఎఇలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పడండి

### - దుబాయ్‌లోని భారత్ ఎంబసి ప్రతినిధులతో సిఎం చంద్రబాబు చర్చలు

**విజయవాడ,అక్టోబర్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్, యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంలో పలు అంశాలను వారితో ప్రస్తావించారు.. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిధ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్ లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా దుబాయ్ సహా వివిధ దేశాల కంపెనీలకు వివరించాలని ఎంబసీ ప్రతినిధులకు సీఎం సూచించారు. యూఏఈ ఏపీ పారిశ్రామిక బంధం ధృఢంగా ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ దేశాలకు చెందిన వివిధ సంస్థలు ముందుకు వచ్చిన నేపథ్యంలో ఏపీలో ఉన్న అవకాశాలను ఆయా దేశాల్లోని కంపెనీలకు వివరించాలని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను ఆ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం తెలిపారు.

ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్ ను పెద్ద ఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ పార్కు లోనూ యూఏఈ నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అమర్నాథ్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దుబాయ్‌లోని అంతర్జాతీయ స్థాయి సంస్థలకు అవసరమైన టెక్నాలజీ నిపుణులను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యూఏఈలో తెలుగువాళ్లు ఉన్నారని...వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. దుబాయ్ లో తన పర్యటన చివరి రోజున తెలుగు డయాస్పోరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు.



దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో చంద్రబాబు నాయుడు

అంతకు ముందు హైదరాబాద్ నుంచి దుబాయ్ కు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక తెలుగు ప్రజలు విమానాశ్రయానికి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు. దుబాయిలో ఉన్న తెలుగు వారు.. ప్రత్యేకించి మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలియచేశారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని సీఎం అప్యాయంగా పలకరించారు.

## గరుడవారధిపై నుండి దూకి తమిళనాడు వాసి ఆత్మహత్య

**తిరుపతి,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** జీవితంపై విరక్తిచెంది తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతిలో గరుడవారధిపైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. 30అడుగుల పై నుండి దూకడంతో తలపగిలి సంఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన బుధవారం ఉదయం తిరుపతి ఆర్టీసి బస్టాండ్-కపిలతీర్థం గరుడవారధిమార్గంలో మున్సిపల్‌పార్కు వద్ద జరిగింది. తమిళనాడు మధురై సత్యమూర్తినగర్‌కు చెందిన పాండియ రాజన్(31)కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం మంగళవారం సాయంత్రం తిరుపతికి దిగారు. తిరుపతిలో తిరుగాడుతూ రాత్రి కుటుంబ సభ్యులను రైల్లో మధురైకి పంపాడు. తాను బస్సులో వస్తానని నమ్మించాడు. బుధవారం ఉదయం అతను గరుడవారధిపై మున్సిపల్ పార్కువద్ద రాకపోకలు లేని సమయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వయసుమీరిపోతున్నా వివాహం కాకపోవడం, మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు అలిపిరి పోలీసులకు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని వద్ద చిరునామాతో అలిపిరి సిఐ రామకిశోర్, ఎస్ఐ లోకేశ్‌కుమార్ అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దేవుని దర్శనానికి వచ్చి ఆ తరువాత అఘాయిత్యం చేసుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. ఇంటికి చేరగానే ఈ విషాదవార్తతో కుటుంబసభ్యులు తిరుపతికి వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. అలిపిరి ఎస్ఐ లోకేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

# తిరుమలను ముంచెత్తిన వాన

### -7 సెంటీమీటర్లు వర్షపాతం నమోదు - జలాశయాల్లోకి మోస్తరుగా చేరిన వరద నీరు

**తిరుమల,అక్టోబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమలకొండ జలమయంగా మారింది. మంగళ,బుధవారాల్లో రెండురోజులు సుమారు ఏడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధాన తాగునీటి జలాశయాలు గోగర్భమ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాల డ్యామ్‌లకు మోస్తరుగా వరద నీరు చేరింది. ప్రస్తుతం ఉన్న జలాశయాల్లో నీటినిల్వలతో 2026 మార్చినెలాఖరు వరకు తాగునీటి సమస్య తీరిందని టిటిడి వర్గాలు తెలిపాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత నాలుగురోజులుగా విడవకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ జలాశయాలకు వరదనీరు చేరడంతో నిల్వలు పెరిగాయి.తిరుమలలో తాగునీటి జలాశయమైన గోగర్భండ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు కాగా 80శాతం నీటిమట్టం చేరింది.పాపవినాశనం 697.14 అడుగులు కాగా 63శాతం నీరుచేరింది. ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం ఉండగా వరదనీటితో 60శాతం మట్టం చేరింది.ఇక తిరుమలలో రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833 లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్లు నీటిసామర్థ్యం కాగా 50శాతంమాత్రమే నీరు చేరింది. ఇదివరకు అడపాదడపా వర్షాలు వచ్చినా జలాశయాలకు పెద్దగా నీరుచేరలేదు. గత రెండు రోజు లుగా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు వరదనీరు చేరడంతో తాగునీటి సమస్యకు ఇబ్బందులు తొలగినట్లేనని టిటిడి నీటివిభాగం తెలిపింది. ఈ వరదనీరు కొండల్లోంచి తిరుపతి మాల్వాడిగుండం, కపిలతీర్థం జలాశయాల్లోకి ప్రవహిస్తోంది. తిరుమలకు ఇప్పుడున్న పరిస్థితుల్లో రోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. నీటి వినియోగంకూడా పెరిగింది. ప్రతిరోజూ కొండపై 43లక్షల గ్యాలన్ల నీరు వినియోగిస్తున్నారు. ఇందులో 18లక్షల గ్యాలన్ల నీరు తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్, ఆకాశగంగ, పాపవినాశనమ్, కుమారధార, పసుపుధార తీర్థాల డ్యామ్‌ల నుండి వాడుకుంటున్నారు. ఇప్పుడు తాజా పరిస్థితు లతో జలాశయాల్లో నీరు 180 రోజులు వరకు అవసరాలకు సరిపోతుందనే అంచనా. బంగాళాఖాతంలో అల్పపీడనంతో తిరుమలలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం వరకు విడవకుండా కురిసిన జోరువానలకు జలమయంగా మారింది. ఆలయం ముందుభాగం, పరిసరాలు, మాఢవీధుల్లో వరదనీరు ప్రవహించింది. వర్షాలతో వాతావరణం పూర్తిగా మారడంతో విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయి.



వరదనీటిలో తిరుమల ఆలయం పరిసరాలు

## ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం ఎపి రైతులకు కొత్త అవకాశాలకు నాంది

### - రాష్ట్ర ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఎగుమతులకు మంత్రి లోకేష్ ప్రాధాన్యం : మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు

**విజయవాడ అక్టోబర్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆక్వా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ గారు చేస్తున్న కృషి అభినందనీయం అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందని ఆయన అన్నారు. అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేష్ దూరదృష్టి ప్రశంసనీయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా ఆలోచించిన మంత్రి లోకేష్ నిబద్ధతను ఆయన అభినందించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఏపీ సీ ఫుడ్ బ్రాండ్‌కి అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న మంత్రి లోకేష్ సంకల్పం రాష్ట్రానికి గౌరవం తెస్తుందని అన్నారు. రాష్ట్రానికి 1,000 కిలోమీటర్ల విస్తీర్ణం గల సముద్రతీరం ఆక్వా పరిశ్రమకు బలమైన ఆధారమని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మంత్రి లోకేష్ చూపుతున్న ప్రగతిశీల ఆలోచనలను ప్రశంసిస్తూ, వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. రైతులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీ అందించే చర్యలు ప్రశంసనీయం అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల వర్షం కురుస్తోందని, ఆక్వా రంగం అభివృద్ధి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు

## రైల్వే ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

### జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాత వార్తప్రతినిధి:** విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన రైల్వే, జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ కోరారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్థితిగతులపై సమీక్షించారు. భూ సేకరణలో పురోగతిపై చర్చించారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీ ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారుల గ్రీన్ ఫీల్డ్ అలైన్ మెంట్, అవుటర్ రింగ్ రోడ్డుపై దిశానిర్దేశం చేశారు.

## లక్ష్మీనాయుడు కుటుంబానికి భరోసా ఇచ్చిన ప్రభుత్వం

### - మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు

### - హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త-వైద్యం :** గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ హత్య చాలా దారుణమైనదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నెల్లూరులోని రోడ్లు భవనాలు అతిధి గృహంలో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసే కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహస్విశ్రీ, తన్విశ్రీలకు 5 లక్షల రూపాయలు వంతున తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి మూడు లక్షలు, తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు 5 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విషయం తెలిసిన వెంటనే లక్ష్మీ నాయుడు హత్య ఉదంతంపై తక్షణమే స్పందించి హోం శాఖ మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ్యులు శ్రీనివాసరావులతో కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే చర్యలలో నిన్న ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబ సభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతే కాక పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బతగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదే విధంగా గాయాలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవ నాయుడు కు మూడు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## వసతి గృహాలలో పిల్లల సంరక్షణపై కలెక్టర్ హెచ్చరిక

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22( ప్రభాతవార్త ):** జిల్లా వసతి గృహాలలో ఉండే పిల్లల విషయంలో అన్ని వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదని గురువారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వసతి గృహాల నుండి పిల్లలను పంపేముందు, పిల్లల సంరక్షణలో భద్రతను గరిష్ఠంగా నిబంధిస్తూ, బంధువుల వివరాలు, తగిన ఆధారాలు ముందుగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే వారితో పంపవలసినదని స్పష్టం చేశారు. ఇటీవల నగరంలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో, హాస్టల్ వార్డెన్‌కు షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘటనపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్తో సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతోందని వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో, వసతి గృహాల్లో నిర్లక్ష్యం గమనించబడక పోయినప్పటికీ, ఆడపిల్లలు, వసతి గృహాల్లో ఉండే పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఈ హెచ్చరికల ద్వారా,

వసతి గృహాల వార్డెన్లు పూర్తి అప్రమత్తత, జాగ్రత్త మరియు బాధ్యతా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యే విధంగా, పిల్లల భద్రతను మరింత బలపరచడం అని తెలిపారు.

## బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయండి :ఎఐవైఎఫ్




బాలల సంఘం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

**విజయవాడ,అక్టోబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నవంబర్ 14న బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనం ను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్ర బాబు కోరారు. బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనం జయప్రదం చేయాలని విజయవాడ హనుమాన్ పేట దాసరి భవన్ లో వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ రోజుకు పెరుగుతుందని బాలలు విద్యకు దూరమై బాలకార్మికులుగా మిగిలిపోతున్నారని చట్టాలు ఉన్నా పేరుకే తప్ప బాలకార్మికుల నియంత్రణ జరగలేదని బాల్య వివాహాలు జరుగుతున్న నియంత్రణ కొరవైందని అన్నారు. నేటి సమాజంలో బాలలు గంజాయి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును దూరం చేసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సీమలో రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం: డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్త

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 22, ప్రభాత వార్త:** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో అమృత్ స్టేషన్ పథకంలో చేపట్టిన స్టేషన్ల పునర్నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్ లు అన్నారు. సీనియర్ డి సి ఎం మనోజ్, డి సి ఎం శ్రీకాంత్ రెడ్డి, ఏ ఎస్ సి అనిల్ కుమార్ సింగ్ లతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.400 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన తిరుపతి రైల్వే స్టేషన్, రూ.50 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన రేణిగుంట స్టేషన్లతో పాటు, యాద్గీర్,రాయచూరు, ఆదోని,అనంతపురం,చిత్తూరులతో పాటు డివిజన్ పరిధిలో మొత్తం 17 రైల్వేస్టేషన్లలో జరుగుతున్న పునర్నిర్మాణపు పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు.

## వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించండి

### - వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీడిసిఎల్ చైర్మెన్ శివశంకర్

**తిరుపతిరూరల్, అక్టోబర్22 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర విద్యుత్ సేవలు అందించుటకు విద్యుత్ శాఖ ఉద్యోగులు కృషి చేయాలని ఎపి ఎస్పీడిసిఎల్ సంస్థ చైర్మెన్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. బుధవారం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లతో సిఎండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## రాజమండ్రి గణేష్ చౌక్ బాలికల వసతి గృహం విద్యార్థినిపై అత్యాచారం

### నిందితుడుపై పోక్సో కేసు నమోదు - బిసి బాలికల హాస్టల్ వార్డెన్‌ను నిలదీసిన వైసిపి మహిళా నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, మేడపాటి షర్మిలారెడ్డి బృందం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22( ప్రభాతవార్త):** రాజమండ్రి లోని బాలికల వసతి గృహంలోని ఒక విద్యార్థినిని మూడు రోజుల క్రితం ఒక యువకుడు బయటకు తీసుకువెళ్ళి అత్యాచారం చేసిన సంఘటన నేపథ్యంలో బుధవారం జక్కంపూడి విజయలక్ష్మి రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గాండ్ల తెలకుల కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ సంకిస భవానీ ప్రియ, బీసీ నాయకురాలు బర్ల సీతారత్నం తదితరులు వసతి గృహాన్ని సందర్శించి వార్డెన్ ను గట్టిగా నిలదీశారు. అపరిచితుల వెంట హాస్టల్ విద్యార్థినిని ఎలా బయటకు పంపించారని వారు వార్డన్ను నిలదీశారు. రిజిస్టర్లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం పట్ల వైసీపీ మహిళా నాయకులు వార్డన్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు సాయంత్రం ఆ విద్యార్థిని తన అన్నయ్య వచ్చాడని, సబ్బులు తెచ్చుకోవాలని చెప్పి బయటకు వెళ్ళిందని వార్డెన్ చెప్పారు. కుటుంబ సభ్యులు కాని వారితో ఎలా పంపిస్తారని జక్కంపూడి విజయలక్ష్మిబృందం గట్టిగా ప్రశ్నించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తరుచుగా మహిళల జోలికి ఎవరు వచ్చినా వారికి అదే ఆఖరు రోజని చెబుతారని, కాని కూటమి పాలనలో మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే నిందితులపై సరైన చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు.

> విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించే వాడు మూర్ఖుడు.
>
> -లావోసు

# పేదరికం తగ్గుముఖం!

దేశంలో పేదరికం తగ్గిందని ఎంతోకాలంగా విడుదలవుతున్న సర్వే సంస్థల నివేదికలు, నీతి ఆయోగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ సంస్థ కూడా అదే చెబుతోంది. ఈ సంస్థ ఏటా తన సర్వే నివేదికలు అందిస్తూనే ఉంది. కేవలం 15 సంవత్సరాల వ్యవధిలోనే ప్రపంచ విలువను తగ్గించుకున్న 25 దేశాలలో భారత దేశం కూడా ఒకటి. మన దేశంలో 2021 నుంచి 2025 మధ్య 415 మిలియన్ల మంది ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కిన వైనాన్ని యునైటెడ్ నేషన్స్ నివేదిక గతంలోనే వెల్లడించింది. ఇది నిజంగా అద్భుతమైన విజయం గానే భావించాలి. 2023 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2016-2021 మధ్య దేశ జనాభాలో 10శాతం మంది పేదరికం నుంచి తప్పించుకోగలిగారని వివరించిం ది. ఇలాంటి సానుకూల మార్పులకు దోహదపడే జీవన ప్రమాణాల సూచికలలో గణనీయ ప్రగతి కనపడింది. 2005-2006లో సుమారు 645 మిలియన్ల మంది పేదరికంలో మగ్గుతుండగా ,ఆ సంఖ్య 2015-2016 నాటికి 370 మిలియన్లకు తగ్గింది. 2019-2021 లో దాదాపు 230 మిలియన్లకు తగ్గింది. అంటే దేశంలో ప్రగతిశీల ఆలోచనలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి ఆర్థిక స్థితిగతులను పెంచేలా అమలు చేస్తున్న వివిధ పథకాల ఫలితంగానే పరిగణనలోకి తీసుకోవాల్సిందే! ఏటా అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినంగా అక్టోబరు 17న జరుపుకుంటాము. అనుకున్న లక్ష్యాలు సాధించగలిగామో లేదో తెలుసుకునే ప్రక్రియలో ద గ్లోబల్ ఇండెక్స్ సంస్థఈ ఏడాది అక్టోబరు 18నాటికి పేదరిక స్థాయిని అంచనా వేసి, ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులపై ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలని ఐక్యరాజ్య సమితి సంకల్పిస్తే భారత్ పేదరిక నిర్మూలన నినాదాన్ని అందిపుచ్చుకుంది. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలి.ఆనాటికి ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ నివేదిక చెబుతోంది. 101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్ల లోపు వారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. పేదరికాన్ని సామాజిక, ఆర్థిక సమస్యగా గుర్తించిన దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. అదే బాటలో భారత్ కూడా నడుస్తోంది. ఇది ఈ నాటి సమస్య కాదు. ఐతే స్వాతంత్రం వచ్చిన తరువాత నుంచి ప్రభుత్వాలు సమాజంలో వెనుకబాటు తనాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని బీదల పాట్లు ఎలా ఉంటాయో అధ్యయనం చేసి మరీ పథకాలను అందుబాటులోకి తెచ్చారు. కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికంగా పేర్కొంటాము. ఎన్ని ఆటంకాలు ఎదురైనా శాస్త్రీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం పాటుపడుతున్నాయని చెప్పాలి. ఇప్పుడొస్తున్న ఫలితాలనుబట్టి పేదరిక నిర్మూలన,సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి. పేదల అభ్యున్నతికి ఉపాధి కల్పనతొలిమెట్టు. ఆపై ఆర్థిక స్వావలంబన కోసం విద్య, వైద్యం,రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలుఅందుబాటులో ఉండాలి. ఒకప్పుడు సంపన్నులు, పేదలు అనే వర్గాల గురించి విస్తృత చర్చ జరిగింది.కానీ ఎంత చేసినా, ఏమి చేసినా మరో వర్గం దారిద్ర్యం అంచున ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. వాళ్లే నిరుపేదలు. ఇప్పుడా పరిస్థితులు మారాయి. 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2025 నాటికి అది 10శాతానికి తగ్గింది. 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవసరానికి అనుగుణంగా ఉండాలనేది భావన. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్న నేపథ్యంలో దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో పాటు పెద్దల అభ్యున్నతికి చేసిన ఆలోచనలకు కూడా సత్ఫలితాలను ఇచ్చింది. శ్రామికులకు ఉపాధి కల్పించే వ్యవసాయ స్థితిగతులను మెరుగుపరిస్తే వారికి జీవనోపాధి కలిగి ఆర్థికంగా ఎదుగుతారు. భారతీయ శ్రామికుల్లో తొంభై శాతా నికిపైగా అసంఘటిత రంగాల్లోనే పని. ఆయా రంగాల్లో వేతన భత్యాల విషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి వాటిని మెరుగుపరచి నప్పుడే పేదరికాన్ని పారద్రోలేందుకు ఆస్కారముంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా పేదరికం తగ్గుముఖం పట్టిందని గ్లోబల్ ఇండెక్స్ సర్వే ఘంటాపథంగా చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 11.77 శాతం నుంచి 6.06కి తగ్గగా తెలంగాణలో 13.180 శాతం నుంచి 5.85 శాతానికి తగ్గింది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ,ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత్‌లో కొన్నిరాష్ట్రాలు ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో కూడా గణనీయంగా పేదరికం తగ్గినట్లు ఈ సర్వే వివరిస్తోంది. ఐరాస లక్ష్యం నెరవేరాలంటే మరో అయిదేళ్లు చిత్తశుద్ధితో ఆయా రాష్ట్రాలు బడుగుల అభ్యున్నతిలో భాగంగా నిరుపేదల లక్ష్యంగా పనిచేయాలి.

> మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.


గురునానక్

> మనిషి వంటిపై దుస్తులు వేసుకున్నా ముఖం మీద చిరునవ్వు లేనిచో ముస్తాబు పూర్తికానట్లే.


మహాత్మా గాంధీ

# మార్కెట్ యార్డులు రైతులకిచ్చే భరోసా ఎంత?

**పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటివలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికి, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్టపోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశానికి వెన్నెముక అయిన రైతు అన్నదాతగా వ్యవసాయ రంగంలో ఎదురు అవుతున్న అనేక అవరోధాల మధ్య దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రజల జీవనానికి అవసరమైన నిత్యవసర ఆహార ఉత్పత్తులను, వ్యాపార వాణిజ్య పంటలను రైతులు సమృద్ధిగా పండిస్తూ వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా అమ్మకాలు జరిపి వినియోగదారులకు అందించేందుకు నిర్విరామ కృషి చేస్తున్నప్పటికీ, వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్ణయించే ధరలు రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే స్థాయిలో లేకపోతున్నాయా అనే వాదనలు రైతాంగం నుండి వినిపిస్తుంటాయి. పెట్టుబడి పెట్టి పండించిన పంటలను రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరలు లాభసాటిగా ఉన్నా లేకున్నా అమ్మకాలు జరిపి రావాల్సిన పరిస్థితిలో రైతాంగం ఉందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ఒకవేళ లాభసాటిగా లేని ధరకు అమ్మడానికి ఇష్టం లేకపోయినా మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటదిగుబడిని తిరిగి మళ్లీ వెనక్కి తీసుకుపోవడం భారంతో కూడిన పని. మద్దతు ధర పలికే వరకు నిలువ ఉంచాలన్నా కోల్డ్ స్టోరేజీల్లో రోజు వారీ కిరాయి కట్టవలసిందే.సొంత రవాణా ఖర్చు భరించాల్సిందే, ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది మధ్య దళారీలు రైతులకు ఎక్కువ ధర ఆశ చూపి కొనుగోలు చేసుకునే క్రమంలో రైతులు మధ్య దళారుల చేతుల్లో మోసపోతున్న సంఘటనలు అడపాదడపా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సాధారణంగా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, గోధుమ, పప్పు దినుసులు తదితర ఆహార పంటలతో పాటు పత్తి, పసుపు, మిరప లాంటి వాణిజ్య పంటలను అమ్మకానికి కొనుగోలుకు వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నాయి. వ్యవసాయ మార్కెట్లో ఆయా పంటలకు నిర్దిష్టమైన ధరను ప్రభుత్వం మార్కెట్ కమిటీ నిర్ణయం మేరకు రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డులు కొనుగోలు చేసి తిరిగి కావలసిన వారికి విక్రయాలు చేయడానికి ఒక నిర్దిష్టమైన చట్టబద్ధత కలిగినటువంటి వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నప్పటికీ రైతుల విషయంలో మార్కెట్ యార్డులు అనుకున్న స్థాయిలో రైతులకు లాభాలు చేకూర్చే విధంగా గిట్టుబాటు ధరలు ఉండటం లేవనే భావన రైతాంగంలో లేకపోలేదు. రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు తూకం వేసే విధానంలో గతంలో అనేక లోటుపాట్లు తెరపైకి వచ్చినా ప్రస్తుతం ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంతో తూకం నిర్వహిస్తున్నా, తరచుగా మిషన్లలో సాంకేతిక లోపాలు ఏర్పడడం, కొన్ని సార్లు తూకంలో హెచ్చుతగ్గులు గోచరిస్తుండటంతో రైతులలో



గందరగోళ పరిస్థితులు నెలకుంటున్నాయా అనే సంశయం కలుగక మానదు. ఇలాంటి సందర్భాల్లో రైతులు పండించిన పంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్దిష్టమైన వేదికగా ఉంటూనే రైతుల నుండి పంటలు కొనుగోలు చేసే క్రమంలో అయినా, వినియోగదా రులకు విక్రయించే రీతిలో గానీ విశ్వసనీయతతో పురోగతి సాధించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు క్షేత్రస్థాయి లో మరింత కార్యచరణను చేపట్టాల్సిన అవసరం ఉంటుం దేమో. వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పండించిన పంటను ఆన్‌లైన్‌లో అమ్ముకోవడానికి ఇ మార్కెట్ విధానం తీసుకు వచ్చినప్పటికీ, తరచుగా టెక్నికల్ విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. ఈ సందర్భంగా రైతులు అనేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దళారీల చేతుల్లో రైతులు మోసపోకుండా వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకు రావడానికి ప్రవేశపెట్టిన నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ విధానం రైతులకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాటి పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకునే రీతిలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు కలగకుండా మార్కెట్ కమిటీలు వీలైనంత తగా చూడగలిగితే రైతుకు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర మార్కెట్లో ఉన్నప్పుడు ధరను ముందుగా రైతులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.కాబట్టి పండించిన పంటను గిట్టుబాటు ధర ఉన్నప్పుడు సరైన సమయంలో మార్కెట్ యార్డ్‌లకు రైతులు తీసుకుని రావడానికి మరింత ఆసక్తి చూపుతారు. వ్యవసాయ మార్కెట్ చట్టాల ప్రకారం కాంట్రాక్టు పెట్టుబడి వ్యాపారులు కొంతమంది నేరుగా రైతులను కలుసుకుని పంట చేతికి వచ్చే వరకు ఖర్చును భరిస్తామని, పండించిన పంటను తామే కొని విక్రయిస్తామనే రీతిలో ఒప్పందాలు జరుపుకుంటున్నప్పటికీ, తరచుగా ఇలాంటి ఒప్పందాలతో పెట్టుబడి దారులకు రైతులకు మధ్య అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టు తీసుకున్న సమయానికి పంట చేతికి వచ్చి సరైన దిగుబడి వచ్చిందంటే సమస్య లేదు. కానీ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటి వలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయమార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్‌యార్డు లు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికి, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్ట పోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. ●

# అమ్మాయిల చదువుకు ఆటంకాలు తొలగించాలి

డి. అశోక్

లింగ సమానత్వం దిశగా ప్రపంచం పురోగమిస్తోందని, విద్యా రంగంలో అద్భుతమైన మార్పులు వస్తున్నాయని భావిస్తున్న తరుణంలో, యునెస్కో విడుదల చేసిన తాజా నివేదిక మనల్ని ఆత్మపరిశీలన చేసుకొనేలా చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నేటికీ 13.3కోట్ల మంది బాలికలు పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్న వాస్తవం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. మూడు దశాబ్దాల క్రితం బీజింగ్ డిక్లరేషన్ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, ప్రాంతీయ అసమానతలు, నాణ్యమైన విద్యలో లోపాలు, నాయకత్వ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం కొరవడటం వంటి సవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, ఈ బాలికలు తమ భవిష్యత్తును నిర్మించుకొనే అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా, సమాజాలు కూడా విద్య ద్వారా అందే సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతాయి. 1995 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక, మాధ్యమిక విద్యలో బాలికల నమోదు నిష్పత్తి బాలురతో సమానంగా పెరిగింది. కానీ ఈ ప్రగతి అన్నిచోట్లా ఒకేలా లేదు. సబ్‌సహారా ఆఫ్రికా వంటి ప్రాంతాలు వెనుకబడి ఉండగా, లాటిన్ అమెరికాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా సెకండరీ విద్య వైపు మొగ్గుచూపుతున్నారు. పేదరికం, గ్రామీణ ప్రాంతాల్లో నివసించడం వంటి అంశాలు ఈ అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గినియా, మాలి వంటి దేశాల్లో అతి తక్కువ సంఖ్యలో యువతులు పాఠశాలలకు వెళ్లగలుగుతున్నారంట పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ప్రపంచ చిత్రానికి భారతదేశం అతీతమేమీ కాదు. 'బేటీ బచావో, బేటీ పడావో' వంటి పథకాలతో కేంద్ర ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సవాళ్లు అనేకం. ముఖ్యంగా ప్రాథమిక విద్య తర్వాత, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయికి వచ్చేసరికి బాలికల డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి సామాజిక,ఆర్థిక కారణాలు అనేకం. బాల్యవివాహాలు, ఇంటి పనుల్లో సహాయం చేయాలనే ఒత్తిడి, పాఠశాలలు దూరంగా ఉండటం, సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, భద్రతాపరమైన ఆందోళనలు ప్రధాన ఆటంకాలుగా నిలుస్తున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు బాలికల చదువుకు అడ్డుకట్టవేస్తున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విషయానికొస్తే, ప్రభుత్వాలు బాలికా విద్య కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'అమ్మఒడి', 'జగనన్న విద్యా దీవెన' వంటి పథకాలు విద్యార్థుల నమోదు నిష్పత్తిని పెంచడంలో దోహదపడ్డాయి. తెలంగాణలో గురుకుల పాఠశాలల వ్యవస్థ ద్వారా గ్రామీణ, పేద బాలికలకు నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం జరుగుతోంది. అయినప్పటికీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య విద్యా నాణ్యతలో వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు డిజిటల్ విద్యకు దూరమవుతున్నారు. పాఠ్య పుస్తకాల్లో లింగ వివక్ష చూపే అంశాలు, మహిళలను కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం చేసేధోరణులు ఇంకా కొనసాగుతుండటం విచారకరం. యునెస్కో నివేదిక నొక్కి చెప్పిన మరో కీలక అంశం విద్యా రంగంలో నాయకత్వ లోపం.ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్యా సంస్థల అధిపతుల్లో కేవలం 30మాత్రమే మహిళలున్నారు. ఈ పరిస్థితి మన దేశంలో, మన రాష్ట్రాల్లో కూడా భిన్నంగాలేదు. వ్యవస్థాగతమైన అడ్డంకులు మహిళలను నాయకత్వ స్థానాలకు చేరకుండా అడ్డుకుంటున్నాయి. విద్య ద్వారా సాధించాలనుకుంటున్న సంపూర్ణ సమానత్వానికి ఇది గొడ్డలిపెట్టు. బాలికా విద్యను కేవలం అక్షరాస్యత శాతాన్ని పెంచే అంకెగా కాకుండా, సామాజిక పరివర్తనకు సాధనంగా చూడాలి. ప్రభుత్వాలు కేవలం నమోదుపైనే కాకుండా, విద్య నాణ్యత, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు (ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు), భద్రతపై దృష్టి సారించాలి. బాల్య వివాహాలకువ్యతిరేకంగా చట్టాలను కఠినంగా అమలు చేయడంతోపాటు, ఆడపిల్ల చదువు కుటుంబానికి భారమనే భావనను తొలగించడానికి విస్తృత ప్రచారం కల్పించాలి. పాఠ్య పుస్తకాల్లో లింగ సమానత్వాన్ని పెంపొందించే అంశాలను చేర్చాలి. మహిళా శాస్త్రవేత్తలు, నాయకులు, క్రీడాకారుల విజయగాథలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి.విద్యా రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి ప్రత్యేక శిక్షణ,ప్రోత్సాహకాలు అందించాలి. చదువుతోపాటు బాలికలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తే, వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలరనే భరోసా తల్లిదండ్రులకు కలుగుతుంది. విద్యావంతురాలైన మహిళ తన కుటుంబాన్నే కాకుండా,దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలదు. బీజింగ్ డిక్లరేషన్ ఆశయాలను సాకారం చేయాలంటే,గణాంకాలను చూసి సంతృప్తి చెందకుండా, క్షేత్రస్థాయిలోని సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వాలు,సమాజం కలిసికట్టుగా పనిచేయాలి. ●

# ప్రజావాక్కు



## అధ్వానంగా ప్రధాన రహదారులు

రాష్ట్రంలోనిమహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి వయా ఇల్లందుద్వారా కొత్తగూడెం జిల్లా కేంద్రానికి వెళ్లే జాతీయ రహదారి గుంతల మాయమై అధ్వానంగా తయారైంది. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు వివిధ ప్రదేశాలకు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా కరీంనగర్ నిజామాబాద్ హుజురాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, గోదావరిఖని,హనుమకొండ, వరంగల్,నర్సంపేట నుండి భద్రాచలం, విజయవాడకు వెళ్లేవాహనాలు వయా మహబూబాద్, ఇల్లందు ద్వారా వెళుతుంటాయి. గోదావరిలో పుణ్యాసనము ఆచరించి పాపికొండలు పర్ణశాల లాంటి ప్రదేశాలకు భక్తులు ఎక్కువగా వెళుతుంటారు. సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి అనేక ప్రాంతాల్లో గోతులమయమై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పాలకులు స్పందించకపోవడం శోచనీయం.

- కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## స్టాఫ్‌ను నియమించాలి

ఆర్మీ స్కూల్‌గా పిలవబడేతెలంగాణ రాష్ట్రంలోని 2 సైనిక్ స్కూల్‌లో ఆర్మీ స్టాఫ్ చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్ వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్‌లో ఒక్కరే ఆర్మీ స్టాఫ్ ఉంది. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ షెడ్యూల్ క్యాస్ట్ సైనిక్ స్కూల్‌లో అతి తక్కువ ఆర్మీ స్టాఫ్ వుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లో పేద విద్యార్థులు చదువుతున్నారు. కనుక ప్రభుత్వం ఈ స్కూల్‌లో స్టాఫ్‌ను నియమించాలి.

- రాపాక రవీందర్, జనగాం

## ప్రపంచ శాంతికి పాటుపడాలి

క్వాడ్ ఇటీవల ఒకస్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నట్లు తోస్తుంది.అది చైనాకివ్యతిరేకంగా అనిమాత్రమే చెప్పవచ్చు.దానివైఖరి మూలంగానే ఇండోపసిఫిక్ అని అమెరికా తన వాణిజ్య సంబంధాలను మార్చుకుంది. ఇకపోతే కోవిడ్ దరిమిలా చైనా తన ఉత్పత్తి వ్యవస్థలు అతలాకుతల మయ్యాయి. తద్వారా తన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టంవాటిల్లింది. కానీ తిరిగి పుంజుకొని పాకిస్థాన్ వంటి దేశాల సహాయంతో అది తన ఆధిపత్యం చూపించాలి అనుకుంటుంది.

- భారత అవినాష్, జనగామ

## ముందస్తు చర్యలు అవసరం

ఇటీవల దేశవ్యాప్తంగా ప్రయాణికుల బస్సుల్లో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ఘోర సంఘటనలు మానవ ప్రాణాల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. బస్సు ప్రయాణం రోడ్లలో సురక్షితమైన మార్గంగా పరిగణించబడినా, ప్రస్తుత పరిస్థితులు జీవన భద్రతకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి.ప్రస్తుతం నివేదికల ప్రకారం, ఎక్కువగా పాత, సరిగా రక్షణా ప్రమాణాలు పాటించని బస్సులు ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. డ్రైవర్ల శిక్షణలో కొరత, సాధారణ రక్షణ సాధనాలలో లోపాలు, మురికి, నిబంధనల ఉల్లంఘనలు భద్రతకు ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం,రవాణావిభాగం తక్షణచర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల కోసం అవగాహన కార్యక్రమాలు, అత్యవసర మార్గాల సూచనలు,డ్రైవర్ శిక్షణమరింత బలోపేతంచేయడం అవసరం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## షరా మామూలే

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరు మోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ల అమలుకు నోచుకోలేదని సూపర్‌సిక్స్ సూపర్‌ఫ్లాప్ అనిఅనుకుంటున్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడా కన్పించడంలేదు.

-ఎస్.శర్మ, హైదరాబాద్

## సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ,తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు.వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెడన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆందోళనలతో అట్టుడుకుతున్న అమెరికా!

ఐ.ప్రసాదరావు

ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలకు మన ఇరుగు పొరుగు దేశాల్లో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో సంభవించిన పరిణామాలు, అలాగే ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న పరిణామాలు కనువిప్పు కలగాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు స్వతహాగా స్వదేశంలోనే అమెరికా వాసులకు ఆగ్రహజ్వాలలు రగులుస్తున్నాయి. గత కొన్ని నెలలుగా అక్కడ అక్కడ స్వల్పంగా ప్రారంభమైన నిరసనలు అక్టోబర్ 19వ తేదీన అమెరికాలో దాదాపు 2500 ప్రాంతాల్లో 'నో కింగ్స్' పేరుతో నిరసనలు దేశవ్యాప్తంగా మిన్నంటాయి. లక్షలాది ప్రజలు, సంస్థలు, డెమోక్రట్స్ తో సహా రోడ్లు ఎక్కి ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల ప్లేకార్డ్లు, స్లోగన్స్ తో హోరెత్తించారు. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్, ఫిలిడెల్ఫియా, అట్లాంటా, హ్యూస్టన్, చికాగో వంటి నగరాలతో పాటు యాభై రాష్ట్రాల్లో అమెరికాలో ,'రాజులు లేరు, చక్రవర్తులు (రారాజులు)లేరు' అంటూ నినదించారు.అమెరికా రాజ్యాంగం ప్రకారం పాలన అందించాలి అని, నిరంకుశ పాలన సహించం అని నిరసనకారులు నినదించారు. యూరప్ దేశాల్లో కూడా అమెరికా రాయబార కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తంచేశారు. ఇంత ఉధృతంగా రెండవసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ట్రంప్‌కు స్వదేశంలోనే తిరుగుబాటు తేవడానికి ప్రధాన కారణం ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పేరుతో రకరకాల ఉత్తర్వులు జారీ చేసి పాలనను అస్తవ్యస్తం చేయడమే. గత మూడు వారాలుగా అమెరికాలో 'షట్ డౌన్' ప్రారంభమై అనేకమంది ఉద్యోగాలు కోల్పోవడం, ద్రవ్యోల్బణం పెరుగుదల, వలసలపై తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రఖ్యాత యూనివర్సిటకు నిధులు నిలుపుదల చేయడం, విద్యాశాఖపై తీసుకున్న నిర్ణయాలు, అనేక రంగాల్లో, శాఖల్లో ఉద్యోగాల కోత వంటి అనేక నిర్ణయాలు ప్రజలను ఆగ్రహావేశాలకు గురిచేస్తున్నాయి. ఈ నిరసనలు జెన్ జెడ్ తరహాలో ఉధృతం అవుతుండటం పట్ల ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో జరుగుతున్న పరిణామాలు పట్ల ఆసక్తి పెరుగుతుంది. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (యమ్ .ఏ.జి.ఏ)'అనే నినాదంతో గద్దెఎక్కిన ట్రంప్, మొదట్లో చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అధిక సుంకాలు విధించి, తదుపరి పునః సమీక్ష చేసుకోవడం, ఇక మనదేశంపై కూడా దాదాపు యాభై శాతం సుంకాలు విధిస్తూ, విరోధం తెచ్చుకోవడం, మన భారతీయ విద్యార్థులపై ఆంక్షలు విధించడం, వీసాలు జారీ కఠినతరం చేయడం వల్ల కూడా మనదేశానికి దూరం జరగడంతో, స్వతహాగా మనతో పాటు అమెరికాలో కూడా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఒకడుగు ముందుకేసి భారత్, పాక్ మధ్య యుద్ధం నేనే అపానని ట్రంప్ చెప్పడం, దీనిని భారత్ ఖండించడంతో, ట్రంప్ తన వ్యక్తిగత స్టేచర్ కోల్పోవడం జరిగింది. తిరిగి



మరల నేడు భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనదు అని ట్రంప్ చెప్పడం, ఈ విషయాన్ని మరల మన అధికారులు ఖండించడంతో మరింత పలచన అవ్వడం జరుగుతుంది. ఒక పక్క తాను తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధం అని ఫెడరల్ కోర్టు పేర్కొనటం, మరోపక్క నోబెల్ బహుమతి కోసం ఆరాటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొన్ని రాష్ట్రాల్లో 'నేషనల్ గార్డ్' పోలీసులను పంపుతూ ఆయా రాష్ట్రాల ప్రజల, మేయర్ల ఆగ్రహానికి గురి అవుతున్న పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో జనవరి నెలలో రెండవ సారి అమెరికా అధ్యక్షుడుగా బాధ్యత స్వీకరించిన ట్రంప్ అంతర్జాతీయంగా వివిధదేశాలతో సత్ సంబంధాలు కోల్పోవడం జరుగుతుంది. మరోపక్క తాను తీసుకుంటున్న నిర్ణయాలు వల్ల స్వదేశంలోనే నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇంత స్వల్ప కాలంలోనే భారీగా అసంతృప్తి మూటగట్టుకోవడంతో,భవిష్యత్తులో అమెరికాపరిస్థితి ఏమిటి అనే భావనకు అందరూ వస్తున్నారు. ముఖ్యంగా ఒకపక్క భారత్ మాకు మిత్రుడు అంటూనే, మరోపక్క ఇటీవల కాలంలో పాకిస్థాన్‌తో సన్నిహితంగా మెలగటంతో మనకు మరింత దూరంగా జరుగుతున్నాడు. ఈ విధంగా స్వదేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ ట్రంప్ తన నిర్ణయాలు వల్ల వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు. తన ఎన్నికల ప్రచారంలో కుడి భుజంగా పనిచేసిన 'ఎలన్ మస్క్' ను సైతం తన నిర్ణయాలతో దూరం చేసుకోవడం జరిగింది.ఇదే సమయంలో తనకు అత్యంత ప్రియ మిత్రుడు అని చెప్పుకునే మన ప్రధాని మోడీని సైతం దూరం చేసుకోవడం గమనార్హం. ఈవిధంగా అతి తక్కువ సమయంలో దాదాపు అందరికీ దూరం జరగడం ఆందోళనకరం. ఇక అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు బేఖాతరు చేయడం, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు నిధులు నిలుపుదల చేయడం, పర్యావరణ పరిరక్షణ చట్టాల నుండి, ఒప్పందాలు నుంచి బయటకు రావడం, ఒబామా హెల్త్ కేర్‌ను ఉపసంహరించడం వంటి నిర్ణయాలు ట్రంప్ ఇమేజ్‌ను పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. ఈ విధంగా ట్రంప్ నిర్ణయాలు మంచి కన్నా చెడ్డ ఎక్కువ కలుగుతుంది. ఒకవైపు చైనా అధ్యక్షుడుతో త్వరలో చర్చిస్తాను అని తెలపడం, వెంటనే చర్చలు లేవు అదనపు సుంకాలు 155శాతం విధిస్తామని అంటాడు. నిలకడ లేని స్థితిలో ఉండటం గమనార్హం. ఇకనైనా తన నిర్ణయాలు పునః సమీక్షచేసుకోవడం, ఆచితూచి అడుగులు వేయడం ద్వారానే తన ప్రతిష్టను, అమెరికా ప్రతిష్టను కాపాడుకోవడం జరుగుతుంది. లేని ఎడల అతి త్వరలోనే స్వదేశంలో, అంతర్జాతీయ స్థాయిలో పలుచనయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ట్రంప్ తెంపరితనం ఇకనైనా తగ్గించుకోవడం ఉత్తమం. ప్రపంచంలోనే అతిపెద్ద పురాతన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికా, ప్రస్తుతం తన డాలర్ ప్రాబల్యం ఎలా కోల్పోతుందో, అలాగే భవిష్యత్తులో తన ప్రజాస్వామ్య వైభవాన్ని ఇటువంటి వైఖరీలతో కోల్పోతుంది. ఇక మనదేశం కూడా విదేశాంగ విధానం, దౌత్య విధానం మెరుగు పరుచుకోవాలి. పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలతో అప్రమత్తంగాఉండాలి.అలీన విధానంతో ముందుకు సాగాలి. మనదేశంలో కూడా ప్రజాస్వామ్య గొంతుకులను అణిచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అన్నిటికీ ఒకేవిధానానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. భిన్నత్వంలో ఏకత్వం గల మనదేశంలో రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామ్య సామ్యవాద లౌకికభావనతో పాలన అందించాలి. అప్పుడు మాత్రమే శాంతి, అభివృద్ధి సాకారం అవు తుందని అని పాలకులు గ్రహించాలి. అధికారం ఉందని, అహంకారంతో పోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ●

Main tab page 111_Main tab page 111.qxd 10/22/2025 11:33 PM Page 1



## మానవతా వాదిగా నిలిచిన వ్యక్తి ఎస్ఆర్ శంకరన్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారందరికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ స్ఫూర్తిగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. శంకరన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రకాశం భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఐఏఎస్ అధికారిగా నియమితులైన ఉత్తమ అడ్మిన్నిస్టేటర్‌గా బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మానవతా వాదిగా నిలిచారని కొనియాడారు. ఐఏఎస్ పదవికే వన్నె తెచ్చిన శంకరన్, ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారందరికి మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకొని పనితీరును మెరుగుపరుచుకొని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి.ఓబులేసు, సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ భాషా, విపత్తుల నిర్వహణ శాఖ డీపీఎం మాధురి, కలెక్టర్ పరిపాలన అధికారి రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 24 నుండి రాష్ట్ర స్థాయి క్వాలిఫైయింగ్ పోటీలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఈ నెల 24 నుండి 27వ తేదీ వరకు అండర్ 13 బాల బాలికల రాష్ట్ర స్థాయి క్వాలిఫైయింగ్ పోటీలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతాయని అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి విజయ్ కృష్ణ మరియు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రఘుబాబు తెలిపారు. అలాగే మెయిన్ డ్రా పోటీలు 25 నుండి జరుగుతాయని ఆసక్తిగల బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ వివరాలతో లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ,9398260109 నెంబర్ కు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## చౌక దుకాణాలను, సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కలెక్టర్ వినోద్ కుమార్

**చీరాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**





చౌక ధరల దుకాణమును బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం చీరాల మండలం తోటవారిపాలెం గ్రామ సచివాలయంను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తనిఖీ చేశారు. జిల్లాలో అధిక వర్షాల నేపథ్యంలో చీరాల మండలంలో సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న గ్రామాల వివరాలను, వర్షాల కారణంగా ఆ గ్రామాలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో తగు వివరాలను చీరాల రెవెన్యూ డివిజన్ అధికారిణి ఆయన ఆరా తీశారు. జిల్లాలో అధిక వర్షపాతం నమోదవుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డీఓకు సూచించారు. తోటవారిపాలెంలో సకలార్ధ సహకార పరపతి సంఘం గోడౌన్లో నిర్వహిస్తున్న చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వీఆర్వోకు సూచించారు. గోడౌన్ యొక్క పరిస్థితి బాగోలేదని, పై కప్పు రంధ్రాలతో కూడి ఉందని, బియ్యపు గోతాలు తడిచే పరిస్థితి ఉన్నందున అక్కడ గుంతలు పడి ఉన్నందున తక్షణమే ఆ ప్రాంతంను ఖాళీ చేసి వేరొక చోటికి తరలించాలని, అందుకు దుకాణ డీలర్‌కు నోటీసులు అందజేయాలని జిల్లా కలెక్టర్ చీరాల తహసీల్దార్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, చీరాల తహసీల్దార్ గోపికృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కొత్తపట్నం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**



భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండటంతో పాటు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ ప్రకాశం జిల్లా కు తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లాలోని తీర ప్రాంత మండలాలైన సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వం యంత్రాంగం చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు మత్స్యకారులను అప్రమత్తం చేయడం జరిగింది. తొలుత జిల్లా కలెక్టర్, సింగరాయకొండ తహసిల్దార్ కార్యాలయంను సందర్శించి భారీ వర్షాల నేపథ్యంలో చేపడుతున్న ముందస్తు జాగ్రత్తలు, చర్యలు పై సమీక్షించి మండల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం సింగరాయకొండ మండలం, ఊళ్ళపాలెం పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడటం జరిగింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని జిల్లా కలెక్టర్, మత్స్యకారులకు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఊళ్ళపాలెం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ను సందర్శించి అత్యవసర వైద్య సేవలకు సంబంధించి మందులు ఉన్నాయా లేవా అని పరిశీలించి, అవసరమైన అత్యవసర మందులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం పరిసరాలు శుభ్రంగా లేకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సాయంత్రం నాటికి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడం జరిగింది. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అవసరమైతే పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేయుటకు ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు.




## పేదింటి పెళ్లికి శివం ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**చీమకుర్తి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

పేద కుటుంబానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం శివం ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. చీమకుర్తి మండల పరిధిలోని ఆర్ ఎల్ పురం పంచాయితీలో రామతీర్థం క్యాంప్ కాలనీలో నివసిస్తున్న కోట బుజ్జి, ఏసమ్మ దంపతుల కుమార్తెకు వివాహం నిర్ణయించారు. రోజువారి కూలి పనులు చేసుకునే బుజ్జి తమ కుమార్తె పెళ్లికి ఖర్చుల నిమిత్తం సాయం అందించమని శివం ఫౌండేషన్ ను సహాయం కోరాడు.... శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి పెళ్లి ఖర్చుల నిమిత్తం 20వేల రూపాయల ఆర్థిక సహాయం నూతన దుస్తులు అందించి ఆ పేద కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఆర్ ఎల్ పురం గ్రామ తెలుగు టిడిపి అధ్యక్షులు పమిడి శ్రీనివాసరావు, నాగరాజు, తిరుమల, సుధీర్, పవన్ వెంకటేష్, కాశయ్య, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



# తరుముకొస్తున్న వాయుగుండం

- అల్లకల్లోలంగా సముద్ర తీర ప్రాంతాలు
- రైతులకు వణుకు పుట్టిస్తున్న వరుణుడు
- అప్పుడే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఒంగోలు నగరమంతా జలమయం





**ఒంగోలు, ప్రభాతవార్త**

బంగాళఖాతంలో అల్పపీడనం వల్ల గత ఐదు రోజులుగా జిల్లాలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తీర ప్రాంత మత్స్యకారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు నగర వీధులన్ని జలమయంతో వాహనచోదకులను, పాదచారులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ప్రధాన వీధులు, కాలువలు చెరువును తలపించాయి. సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, జరుగుమల్లి, సంతనూతలపాడు, చీమకుర్తి, గిద్దలూరు, మార్కాపురం తదితర ప్రాంతాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా గత నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అద్దంకి బస్టాండ్, నుంచి ఆర్టీసీ డిపో వరకు మోకాలిలోతు నీళ్లు పారుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. స్థానిక చర్చి సెంటర్, భాగ్యనగర్, దారావారితోట, రైల్వేస్టేషన్ రోడ్డు, పీవీఆర్ బాలుర పాఠశాల, కర్నూలు రోడ్డుతో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి చెరువును తలపించాయి. వెంకటేశ్వరకాలనీ, విలాల్ నగర్, బలరాంకాలనీ, మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గుర్రం జాషువా కాలనీ, మదర్‌థెరిసా కాలనీ, ప్రగతి కాలనీ, చిన్నమల్లేశ్వర కాలనీలతో పాటు నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం వసతి నీటితో నిండిపోయాయి. దీనంతటికి కారణం డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడితే మురుగునీరు అంతా రోడ్లపైనే ఉంటుంది. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్దంగా ఉండాలని అధికారులకు పిలుపునిచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామాన్ని సంద్శించి మత్స్యకారులతో మాట్లాడారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరు చేపల వేటకు సముద్రంలోకి వెళ్ళరాదని తెలిపారు. ఊళ్లపాలెం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి అత్యవసర వైద్య సేవలకు సంబంధించి మందులు ఉన్నాయా లేవా అని పరిశీలించి అవసరమైన మందులను సిద్దంగాఉంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక మండలాల్లో పంటలు నీటమునిగాయి. గింజలు ఉరకెత్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను వస్తే సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. అయితే గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్పపీడనం ఏర్పడకముందే చెరువులో నీరు సమృద్ధిగా ఉందని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ వర్షాలు రెండు రోజుల పాటు కురిస్తే రైతులు పండించే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.

**జిల్లాలో వర్షపాతం వివరాలుః**

21వ తేదీ నుంచి 22వ తేదీ 4గంటల వరకు జిల్లాలోని మండలాల్లో కురిసిన వర్షపాత వివరాలు అధికారులు తెలియజేశారు. కొత్తపట్నం 124.0 మి.మీ, ఒంగోలు అర్బన్ 107.8 మి.మీ, ఒంగోలు రూరల్ 107.3మి.మీ, సింగరాయకొండ 106.0 మి.మీ, సీఎస్‌పురం 95.3 మి.మీ, వెలిగండ్ల 92.0మి.మీ, పామూరు 86.4మి.మీ, రాచర్ల 69.1 మి.మీ, పొన్నలూరు 68.2 మి.మీ, తర్లుపాడు 67.6మి.మీ, పొదిలి 63.5మి.మీ, సంతనూతలపాడు 61.4మి.మీ, కొనకనమిట్ల 61.2మి.మీ, నాగులుప్పలపాడు 58.2 మి.మీ, పీసీపల్లి 57.2మి.మీ, జరుగుమల్లి 56.5మి.మీ, కంభం 54.5 మి.మీ, మద్రిపూడి 52.7 మి.మీ, కొండపి 51.2మి.మీ, కొమరోలు 49.4మి.మీ,అర్ధవీడు 49.0మి.మీ, టంగుటూరు 47.8 మి.మీ, గిద్దలూరు 43.5మి.మీ, త్రిపురాంతకం 42.8మి.మీ, బేస్తవారిపేట 40.7 మి.మీ, కనిగిరి 35.6 మి.మీ, మద్దిపాడు 35.4మి.మీ, హనుమంతునిపాడు 34.2 మి.మీ, పెద్దారవీడు 33.5మి.మీ, దొనకొండ 31.4మి.మీ, దర్శి 25.9మి.మీ, మార్కాపురం 24.7మి.మీ, కురిచేడు 24.5మి.మీ, దోర్నాల 23.4 మి.మీ, చీమకుర్తి 23.3 మి.మీ, తాళ్లూరు 19.0మి.మీ, యర్రగొండపాలెం 18.4మి.మీ, పుల్లలచెరువు 13.2మి.మీ, ముండ్లమూరు 13.0మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

# అనుక్షణం అప్రమత్తం

- భారీ వర్షాల దృష్ట్యా హోంమంత్రి అనిత వీడియో కాన్ఫరెన్స్
- ప్రభావిత మండలాలలో పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులను నియమించిన కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**






భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వి.అనిత ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించేలా యంత్రాంగం మొత్తం సిద్దంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. తీరం వెంట ఉన్న వర్ష ప్రభావిత మండలాలకు జిల్లా స్థాయిఅధికారులను ప్రత్యేకంగా కేటాయించి పర్యవేక్షణ బాధ్యతలను అప్పజెప్పారు. ఇబ్బందికర పరిస్థితిలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం, ఆ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, అవసరమైన రేషన్ సరుకులను సమకూర్చటంపై ఈ ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలకు కూలిపోయే అవకాశం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను గుర్తించి పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓ కిరణ్ కుమార్‌కు చెప్పారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటున్నందున పర్యాటకులకు అనుమతించకుండా గస్తీ పెంచాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సిబ్బందిని మొహరించి పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ చెప్పారు. రోడ్లపై అడ్డంగా చెట్లు కూలినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన త్వరగా పునరుద్దరించేలాగా అవసరమైన సామాగ్రిని సమకూర్చుకోవాలని అన్నారు.

# ఒంగోలు నగరం జలమయం



















## విప్పర్లవారి పాలెంలో కోటి సంతకాల కార్యక్రమం



**అద్దంకి, అక్టోబరు 22, ప్రభాతవార్త**
అద్దంకి నియోజక వర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అద్దంకి మండలం విప్పర్ల వారి పాలెం గ్రామంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి మండల జెసిఎస్ ఇంచార్జి ఎంపీటీసీ ఇస్తర్ల వెంకటరావు, సచివాలయ కన్వీనర్ విప్పర్ల కోటేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ అంగలకుర్తి సుబ్బారావు, వార్డ్ మెంబర్ అల్లడి నాగార్జున, విద్యాకమిటీ మాజీ చైర్మన్ టి నాగరాజు, మాజీ డీలర్ అక్కయ్య, బోనిగల సుధాకర్, యల్లమంద, వంద తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై ముగ్గురు సిఎండిలతో విద్యుత్‌శాఖ మంత్రి టెలికాన్ఫరెన్స్



**అద్దంకి, అక్టోబరు 22 ప్రభాతవార్త**
విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలపై ముగ్గురు సీఎండీలు, జిల్లాల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా ప్రభావిత ప్రాంత అధికారులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని, మంత్రి ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మరింత సన్నద్ధంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండి కూలిన కరెంటు స్తంభాల పునరుద్ధరణకు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

## మణికేశ్వర ఆలయం వద్ద కార్తీక మాస ముందస్తు చర్యలు



**అద్దంకి , అక్టోబరు 22, ప్రభాతవార్త**
మణికేశ్వరంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. భక్తుల నడక దారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జెసిబి యంత్ర సహాయంతో ఆలయ ముందు భాగాన్ని చదును చేశారు. అదే విధంగా ఆలయ పరిసరాలలో వాహనాల పార్కింగ్, చిల్లచెట్లు తొలగింపు, మెరక ప్రాంతాలను శుభ్ర పరచడం భక్తుల స్నాన ఘట్టాలవద్ద పనులను చేపట్టారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ వాసు, ఆధ్వర్యంలో టిడిపి నేత కరిముల్లా తదితరులు పర్యవేక్షించారు.

## ద్వారాకనగర్ వద్ద ద్విచక్ర వాహనదారునికి గాయాలు



**అద్దంకి అక్టోబరు 22 ,ప్రభాతవార్త**
పట్టణంలోని ద్వారాక నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో కొప్పెరపాడు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారునికి పి.రాంబాబుకు గాయాలు అయ్యాయి. 1088 సమాచారం ఇవ్వగా, క్షతగాత్రుని ఈఎంటి హరిబాబు ప్రథమ చికిత్స చేసి, వాహనంలో వైద్యశాలకు తరలించారు.

## స్వాములకు అన్నదానం నిర్వహించిన కర్నాటి కుటుంబికులు





**అద్దంకి అక్టోబరు 22 ప్రభాతవార్త**
హిందువులకు పరమ పవిత్రమైన కార్తీక మాసం ప్రారంభమైన బుధవారం మాల ధారణ స్వాములకు మేదరమెట్లకు చెందిన కర్నాటి కుటుంబీకులు అన్నదానం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి గ్రామంలోని పాత గుంటూరు రోడ్ లో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో గ్రామంలోని దాతలు రోజుకొకరు స్వాములు అన్నదానం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు కర్నాటి రామనాథం పెద్ద కుమారుడైన హనుమంతరావు దంపతులు స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప శివ భవాని గోవింద స్వాములే కాకుండా పరిసర గ్రామాలలోని మాలధారులు కూడా గురు స్వామి సుబ్రహ్మణ్యస్వామి నిర్వహించిన పూజలు భజనలలో పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 500 మందికి పైగా స్వాములు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు తో పాటు ఆయన సోదరులైన గ్రామ మాజీ సర్పంచ్ కర్నాటి పూర్ణచంద్రరావు, వాసు స్వామి, నాగేశ్వరరావు స్వామి, శ్రీనివాసులు స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోటప్పకొండ రెడ్ల అన్నదాన సత్రానికి
## రూ.5 లక్షలు విరాళం అందించిన వెన్నపూస జోషప్‌రెడ్డి

- జోసప్‌రెడ్డిని సత్కరించిన ట్రస్ట్ సభ్యులు





**సంతమాగులూరు ,అక్టోబరు 22,ప్రభాతవార్త**
పల్నాడు జిల్లా కోటప్పకొండ రెడ్ల అన్నదాన సత్ర మౌళిక వసతుల కల్పనకై సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామ శివారు రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వెన్నపూస జోషప్‌రెడ్డి రు.5 లక్షలు నగదు విరాళం నిర్వహణ కమిటీ సభ్యులకు అందజేశారు. సామాజిక స్ఫూర్తితో అన్నదాన సత్రానికి దాతృత్వం చాటిన వెన్నపూస జోషప్‌రెడ్డిని కమిటీ గౌరవ అధ్యక్షులు భవనం రాఘవరెడ్డి,కార్యదర్శి పాలెపోగు వెంకటరెడ్డి, కోశాధికారి మాగులూరి సుబ్బారెడ్డి,వర్కింగ్ ప్రసిడెంట్ మెట్టు పాపిరెడ్డి ఘనంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా దాత జోషప్‌రెడ్డి మాట్లాడుతూ తాను గత 15 సంవత్సరాల నుండి ఏల్చూరు పరిసర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభావంతులకు ప్రతిభకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. సత్రం కమిటీ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి,మాజీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక మాస పూజలు ఆరంభం



**బల్లికురవ, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
శివ కేశవుల ఆరాధనకు ప్రాముఖ్యమైన మాసంగా పేరొందిన పవిత్ర కార్తీక మాస పూజలు బుధవారం నుండి ఆరంభమయ్యాయి. దీపావళి తర్వాత పాడ్యమి నుండి కార్తీక మాసంమొదలవుతుంది. దీనికి కౌముది మాసం అని పేరు ఉంది. కార్తీకంలో తెల్లవారుతూనే స్నానం చేయడం వల్ల కాయక, వాచిక, మానసిక దోషాలు, తొలగిపోతాయని ప్రతీతి. పగటి కాలం తక్కువగా ఉంటుంది కాబట్టి పొద్దునంత ఉపవాసం చేసి, రాత్రి నక్షత్రాన్ని చూసి దీక్షను విరమించే శివ కేశవ భక్తులు భగవంతుని ఆరాధనలో లీనమైపోతుంటారు. కార్తీకం దీపాల మాసం కూడా ఈ నెలలో చేసే దీప దానం ప్రశస్తమైంది. దాని వల్ల లక్ష్మీ ప్రాప్తి కలుగుతుందని శాస్త్రోక్తి. కార్తీక పౌర్ణమిని త్రిపుర పౌర్ణమి అని అంటారు. ఆనాటి మునిమాపు వేళ ఈశ్వర ప్రీతి కోసం దీపాలను వెలిగిస్తారు. ఈ రోజు చేసే మరొక ప్రత్యేక ఉత్సవం జ్వాలాతోరణం. దీని గురించి పలు పురాణ గాధలు ఉన్నాయి. పౌర్ణమి వేళ శివాలయాల్లో ఎండు గడ్డితో తోరణాన్ని కట్టి వెలిగిస్తారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి, మండుతున్న ఆ జ్వాలాతోరణం కింద నుంచి మూడుసార్లు తిప్పుతారు. కార్తీక బహుళ ద్వితీయనాడే యమదీప దానం చేయాలని స్మృతికౌస్తువం అనే గ్రంథం చెబుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ మాసం మొత్తం వేకువ జామున స్నానాలు, ఉపవాస దీక్షలు, దీప దానాలు, ఎన్నో పుణ్య కార్యాలను ఆచరించే మంగళకరమాసంగా కార్తీకం పేరుపొందింది. వనభోజనాలతో అందరికి ఆనంద, ఉత్సాహాలను అందించే ఆహ్లాదకర సమయం కూడా ఈ మాసమే. మండలంలోని బల్లికురవ, కొనిదేన, చెన్నుపల్లి, గుంటుపల్లి, అంబటిపూడి, కేవీపాలెం గ్రామాలలోని శివాలయాలలో ప్రత్యేక పూజలతో కార్తీకమాసాన్ని ఆరంభించారు. ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో పల్లె సీమలు పులకరించి పోతున్నాయి.

# అర్హులందరికీ అక్రిడేషన్లు ఇస్తాం

## - సమాచార శాఖ సంచాలకులు విశ్వనాథన్

## - రాష్ట్ర సమాచార శాఖ సంచాలకులను కలిసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు



**అద్దంకి రూరల్ ,అక్టోబరు 22 ,ప్రభాతవార్త**
రాష్ట్రంలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ కొత్త అక్రిడేషన్లు ఇస్తామని సమాచార శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ హామీ ఇచ్చారు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం సమాచార శాఖ కమిషనర్ కేఎస్ విశ్వనాధాన్ని ప్రతినిధుల బృందం కలిసి జర్నలిస్టుల సమస్యలు కొత్త అక్రిడేషన్ల అంశాలను సుదీర్ఘంగా సంచాలకులతో చర్చించారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, ఉపాధ్యక్షులు చావా రవిల ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సమాచారశాఖ సంచాలకులను కలిసి వినతిపత్రం సమర్పించారు.రాష్ట్రంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని, దీనికి ఇటీవల జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేసి వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ కమిటీ, వెల్ఫేర్ ఫండ్ కమిటీ వంటి వివిధ జర్నలిస్ట్ ప్రొఫెషనల్ కమిటీలను తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు.వాటిల్లో గతంలో మాదిరిగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులను, ఆయా కమిటీల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో స్థాపించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయులు, యాజమాన్యాల భాగస్వామ్యంతో పత్రికలకు మీడియా సంస్థలకు ప్రభుత్వం జారీ చేసే ప్రకటన బిల్లుల నుండి ఐదు శాతం మినహాయించి జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండుకు జమచేసి బలోపేతం చేయాలని కోరారు. ఇబ్బందుల్లో ఉన్న పాత్రికేయులను ఆదుకునేందుకు వ్యవస్థను గతంలో మాదిరిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ను పటిష్టం చేసి అవసరమైన బడ్జెట్ లు కేటాయించాలని కోరారు .అకాడమీ నియమావళి ప్రకారం వివిధ కార్యకలాపాలు చేపట్టడానికి వీలుగా గవర్నింగ్ కౌన్సిల్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో నియమించాలని విన్నవించారు. వృత్తిలో ప్రతిభ కనబరిచిన పాత్రికేయులకు, ఫోటో జర్నలిస్టులను, ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందిని ప్రోత్సహించేందుకు వీలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేసి ఈమధ్య నిలిపివేసిన రాష్ట్రస్థాయి ఉత్తమ జర్నలిస్టు పురస్కార ప్రధాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు . సుదీర్ఘకాలం వృత్తిలో సేవలు అందించిన సీనియర్ పాత్రికేయులను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించే ఆనవాయితీని తిరిగి ప్రారంభించాలని కోరారు .పాత్రికే వృత్తిలో శిక్షణ నైపుణ్యం పెంపొందించుకోవడానికి వీలుగా ఉన్నత విద్యాభ్యాసానికి వృత్తి పరికరాలు కొనుగోలు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని సంచాలకులను విజ్ఞప్తి చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డుల పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి, పథకం అమలను పర్యవేక్షించడానికి వీలుగా సమాచార శాఖ ,ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షగా కమిటీని నియమించాలని సూచించారు. 2016లో ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేసి గత ప్రభుత్వం నిలిపివేసిన వర్కింగ్ జర్నలిస్ట్ ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు .వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్ట్ కేటగిరీల సిబ్బందికి వేజ్ బోర్డు సిఫారసుల ప్రకారం వేతనాలు అమలు చేయడానికి వీలుగా కార్మిక శాఖ ద్వారా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. వేజ్ బోర్డు సిఫార్సులు పర్యవేక్షించడానికి చట్ట ప్రకారం గతంలో మాదిరిగా త్రైపాక్షగా కమిటీలను ఏర్పాటు చేయాలని సంచాలకులను కోరారు .విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపైన, మీడియా సంస్థలపైన దాడులు అరికట్టడానికి మహారాష్ట్ర తరహాలో మన రాష్ట్రంలో కూడా ఒక ప్రత్యేక చట్టాన్ని తేవాలని విన్నవించారు. కరోనాకాలంలో రద్దయిన జర్నలిస్టుల రైల్వే రాయితీ ప్రయాణ సదుపాయాన్ని పునరుద్ధరించడానికి కేంద్రంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు .చిన్న, మధ్య తరహా పత్రికల మనుగడ కొనసాగటానికి వీలుగా ఆయా సంస్థలకు రొటేషన్ పద్ధతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రచార ప్రకటనలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు .దేశంలో పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా వయోభారంతో వృత్తి నుండి విరమించుకున్న వయోధిక పాత్రికేయులకు పింఛన్ సదుపాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడేషన్తో నిమిత్తం లేకుండా సీనియార్టీ ప్రాతిపదికన పనిచేస్తున్న పాత్రికేయులు అందరికీ అదే విధంగా ఇటీవల వృత్తి నుండి విరమణ చేసిన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ,అదే విధంగా కేటాయింపులు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనేతర పాత్రికేయులకు సమీప మైదాన ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని అందుకని జారీ చేసిన ఇళ్ల స్థలాల జీఓ లను సవరించాలని సమాచార శాఖ సంచాలకులకు విజ్ఞప్తి చేశారు.వీటిపై సమాచార శాఖ సంచాలకులు విశ్వనాథం సానుకూలంగా స్పందించారు. వీటిపై తక్షణమే సమావేశాలు నిర్వహించి అందరికీ అనుగుణమైన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సెక్రటరీ దాసరి నాగరాజు ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంబాబు స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం మనిషిని ఆధ్యాత్మికతలోకి నడిపే పవిత్ర కాలం







**పెద్దదోర్నాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
కార్తీక మాసం మనిషిని భౌతిక జీవితము నుంచి ఆధ్యాత్మిక దిశగా నడిపించే పవిత్ర కాలం. దీపారాధనతో చీకటిలో నుండి వెలుగునకు, పాపములో నుండి పుణ్యానికి తీసుకెళ్తుంది. కార్తీక మాసం హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన, పుణ్యమైన నెలగా భావించబడుతుంది. ఈ నెలలో భక్తులు దీపారాధన, స్నానము, దానము, ఉపవాసము, హరినామ స్మరణము మొదలైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రత్యేకంగా చేస్తారు. ఆశ్వయుజ పౌర్ణమి తర్వాతి రోజు నుండి మార్గశిర పౌర్ణమి వరకు ఈ మాసం కొనసాగుతుంది. అక్టోబర్ - నవంబర్ నెలలో వస్తుంది. ఈ నెలలో సూర్యుడు తుల రాశిలో ఉండగా చంద్రుడు కార్తీక నక్షత్రంలో ఉన్నందున దీనికి కార్తీక మాసం అనే పేరు వచ్చింది. కార్తీక మాసం శ్రీ మహా విష్ణువుకు, శివుడికి ఇద్దరికి ఈనెల ప్రత్యేకమైంది. శివారాధన ప్రతి సోమవారం వ్రతం చేస్తారు. విష్ణు వారాధన కార్తీక ఏకాదశి, కార్తీక ద్వాదశి, తులసి పూజలు ముఖ్యమైనవి. కార్తీక మాసంలో తులసీదేవుని పూజించటం అతి పవిత్రం. తులసి దళంతో చేసే పూజకు అపారమైన ఫలితం ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రతి సాయంత్రం ఇంటి ముందర లేదా దేవాలయంలో దీపం వెలిగించడం అత్యంత పుణ్యకార్యం. దీన్ని దీప దానము అంటారు. దీపారాధన ద్వారా పాపాలు నశించి, సకల సౌఖ్యాలు కలుగుతాయని విశ్వాసం. ప్రతి ఉదయం సూర్యోదయానికి ముందు బ్రహ్మ ముహూర్తంలో నది లేదా చెరువు, ఇంటి వద్ద గంగాజలముతో పుణ్యస్నానం చేయడం చాలా పుణ్యమయము. ఓం నమో నారాయణా లేదా ఓం నమః శ్శివాయ అని జపిస్తూ దేవర్చన చేయాలి. కార్తీక పౌర్ణమి దీపముల పండుగ. ఈ రోజున గంగా, గోదావరి స్నానం అత్యంత పుణ్యమయం. ఈ నెలలో చేసిన పుణ్యకార్యమే ఇతర మాసాల్లో చేసిన పెద్ద యజ్ఞానికి సమానమని గ్రంథాలు చెబుతున్నాయి. కార్తీక మాసమున దీపదానం చేసిన వాడు పాప రహితుడగును అని స్కంద పురాణం చెబుతుంది. అందుకే దీపములు వెలిగించు వాడికి కలుగు వెలుగులు ఎన్నో. ప్రతి రోజు సాయంత్రం సూర్యాస్తమయము తర్వాత దీపం వెలిగించడం అత్యంత ముఖ్యమైన పూజ. కార్తీక మాసం శివుని ప్రసన్నం చేసుకునే ఉత్తమ కాలం. ప్రతి సోమవారం శివలింగానికి అభిషేకం చేసి బిల్వ దళము సమర్పించాలి. కార్తీక మాసంలో శివుడు, విష్ణువు ఒకే తత్వంగా భావించబడతారు. కార్తీక పౌర్ణమి రోజు గోదావరి స్నానం, దీపోత్సవం, ఆలయ దర్శనం, దానము చేయడం అత్యంత శ్రేష్టమైనది. ఆ రోజు రుద్రాభిషేకం లేదా శ్రీ మహా విష్ణువు పూజ చేస్తే శతజన్మ పుణ్యమవుతుంది. ధాన్యాలు, వస్త్రాలు, నూనె, దీపాలు, పూజ సామాగ్రి, దానం చేయడం వలన అఖండ సౌభాగ్యం వస్తుంది.

## స్వాతి నక్షత్ర సందర్భంగా స్వామివారి కళ్యాణం



**అద్దంకి ,అక్టోబరు 22 ,ప్రభాతవార్త**
అద్దంకి మండలం, సింగరకొండ పై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానములో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రం అయిన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరిగినది. ఈ కల్యాణ మహోత్సవంలోపాల్గొన్న దంపతులకుస్వామి వారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యనిర్వహణాధికారి, చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# స్వాములకు అన్నదానం



**తాళ్లూరు, అక్టోబర్ 22,ప్రభాతవార్త**
మండలం లోనితూర్పుగంగవరంలో దర్శి రోడ్డులో అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి ప్రధాన పీఠాన్ని ఏర్పాటు చేసి అయ్యప్ప, శివ, భవాని, సర్వదీక్ష దారులకు ప్రతి నిత్యం సద్ది ఏర్పాటు చేస్తున్నారు. దేవ స్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి దీక్షదారులు, గ్రామస్తులు, వివిధ గ్రామాల గ్రామస్తులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం సద్ది ఏర్పాటు కొనసాగుతుందని దేవస్థాన ప్రధాన అర్చకులు స్వామి డాక్టర్, అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఎంతమంది దీక్షాదారులు వచ్చినా సద్ది ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

## తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



**పొన్నలూరు,అక్టోబర్ 22, ప్రభాతవార్త**
బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల ప్రకాశం జిల్లాలో రాబోయే రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు,ప్రజలు అప్రమత్తం ఉండాలని తహసీల్దార్ పుల్లారావు, ఎంపిడివో సుజాత అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలను, తుఫాను అనంతరం చేపట్టవలసినన చర్యలను అధికారులకు వారు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయంలోని అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు.. తుఫాను వచ్చిన తర్వాత ఉపశమన చర్యలు చేపట్టాలని, ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మండల, గ్రామ స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలలో నివసించేవారినీ, పాత ఇల్లు, పూరిళ్లలో నివసించేవారిని తక్షణం పునరావాస కేంద్రంల్లోకి తరలించడానికి వారిని సిద్ధంగా ఉంచాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి అవసరమయ్యే వస్తువులు,నిత్యావసరాలు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు..పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా తాగునీరు, పారిశుద్ధం, గ్రామీణ రహదారులు, కల్వర్టులు వంటి విషయాల్లో అతి జాగ్రత్తతో ఉండాలని కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు తుఫాన్ హెచ్చరికలు గురించి అవగాహన చేయాలని కోరారు..ఈ కార్యక్రమములో ఎస్ఐ.అనుక్, ఎంఈవో రవి చంద్రబాబు,వివిధ శాఖల మండలాధికారులు,పంచాయతీ కార్యదర్సులు,వీఆర్వో లు,వీఆర్ ఏ లు,సచివాలయం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.


## బోగనంపాడులో ఉపాధి హామీ గ్రామ సభ



**పొన్నలూరు,అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మండలంలోని బోగనంపాడు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026 27 ఆర్థిక సంవత్సరం ప్రణాళిక ప్రక్రియలో భాగంగా రెండవ గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఎన్ని రకాల పనులను చేపడుతున్నారు వాటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధి పథకంలో 97 రకాల పనులు ఉన్నాయని వాటిలో పండ్ల తోటలు , రైతు వారి కుంటలు, కందకాలు, కొత్త కుంటలు ఏర్పాటు, పశువుల షెడ్లు మరియు ఇంకుడు గుంతలు, కాలువలు, కుంటల అభివృద్ధి గురించి వివరిస్తూ వాటిని ఏవిధంగా ఉపయోగించుకోవాలో ఉపాధి కూలీలకు, రైతులకు , గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుబ్రమణ్యం ,ఏపీవో సుధాకర్ ,ఈసీ కోటేశ్వరరావు ,టిఎ రవి,టిఎ కుమార్, సచివాలయం సిబ్బంది, శ్రమ శక్తి సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

- నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ
- మిగిలిన నల్లబర్లీ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని వినతి
- నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కృషి పట్ల ఎమ్మెల్యేకి అభినందనలు
- సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు
- పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరికి హామీ



**మార్టూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో ప్రజలు, రైతుల అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో అభివృద్ధి పనులు చేస్తున్న తీరు పట్ల సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు తెలిపారు. ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి ప్రతిపాదనలను ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా బర్లీ పొగాకు రైతులను ఆదుకునే చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. దేశ చరిత్రలో ఎక్కడ ఎన్నడూ లేని విధంగా కష్టాల్లో ఉన్న నల్లబర్లీ పొగాకు రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. ఇంకా రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు ఆ మొత్తాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడును కోరారు.

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం :

రాష్ట్రంలో ప్రతి రైతు పంటకు గ్యారంటీ లభించేలా సీఎం కృషి చేస్తున్నారని ఏలూరి పేర్కొన్నారు. బర్లీ పొగాకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించడం రైతు కుటుంబాలకు ఊరట ఇచ్చింది. ఇది ప్రభుత్వం రైతు సంక్షేమానికి అంకితభావానికి నిదర్శనం అని అన్నారు. చీరాల నుంచి మోటుపల్లి వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ రహదారి పూర్తయితే తీర ప్రాంత పర్యాటకాభివృద్ధికి, మత్స్యకారుల రవాణాకు, వ్యాపారానికి ఊతమిస్తుందని తెలిపారు. మార్టూరు మండలంలోని కొలలపూడి, వలపర్ల బొల్లాపల్లి గ్రామాలు, చిన్న గంజాం మండలంలోని కడవకుదురు, రాజుబంగారుపాలెం, ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల్లో 33 కేవీ సబ్ స్టేషన్లు నిర్మించాలని అభ్యర్థించారు. ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు మండల కేంద్రాల్లో ఆటో నగర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మార్టూరు యద్దనపూడి మండలాలను మార్టూరు సర్కిల్ పరిధిలోకి, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలను ఇంకొల్లు సర్కిల్ పరిధిలోకి, పర్చూరు, కారంచేడు పోలీసు స్టేషన్లను కలిపి పర్చూరు సర్కిల్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో బకింగ్ హామ్ కాలువను అంతర్గత జలమార్గంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్టూరు మండలం నాగరాజుపల్లిలోని ఏపీఐఐసీ పార్కు సమీపంలో చెరువును అభివృద్ధి చేసి ఎంఎస్ఎంఈ పార్కుకు అనుసంధానించాలని కోరారు. మార్టూరు మండల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయన అభ్యర్థించారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని మూడు మండలాలు బాపట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో మరో మూడు మండలాలు చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నందున పరిపాలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 11 పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సీఎంను కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం కమ్యూనిటీ హాల్స్, అంబేద్కర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఆరు మండల కేంద్రాల్లో అంబేద్కర్ భవనాలు నిర్మిస్తే సామాజిక సమతా వేదికలుగా అవి ఉపయోగపడతాయని అన్నారు. పర్చూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు గుంటూరు ఛానల్ పొడిగింపుకు 51 ఎకరాల భూసేకరణ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రావెల్ రోడ్ల నిర్వహణ లేకపోవడంతో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రావెల్ రోడ్ల మరమ్మత్తులకు తక్షణ నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవ్గంలో సుమారు 5000 వేల ఎకరాల ఇనాం, ఎస్టేట్ ల్యాండ్స్ సమస్య అనేక దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయని, సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని అభ్యర్థించారు. పర్చూరు, మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను 100 పడకల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేయాలని, మార్టూరు మండలంలోని వలపర్ల, చిన్నగంజాం మండలంలోని పెద్దగంజాం, మోటుపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చేయాలని కోరారు. ముస్లిం మైనార్టీ వర్గాల కోసం షాదీ ఖానాలు, ఈద్గాలు, బరియల్ గ్రౌండ్స్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మార్టూరు మండల పరిధిలోని రాజుపాలెం డొంక నుంచి జయంతి నగర్ చర్చి వరకు సుమారు 3 కిలోమీటర్ల రహదారి, మార్టూరు– కొణిదేన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.పర్చూరు నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ ఆధారితమైందని, వరద కాలువలు సరిగా లేకపోవడం వల్ల తుఫానులు, వర్షాకాలంలో పంటలు నీటమునుగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. సుమారు 40 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి రైతాంగానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే ఏలూరి సూచించిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## కామేపల్లి బీసీ అంగన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాను బహుకరించిన ఉపసర్పంచ్ వెంకట్రావు

**సంతమాగులూరు, అక్టోబరు 22,ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం కామేపల్లి ఉప సర్పంచ్ గమిడి వెంకట్రావు బీసీ అంగన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాను బహుకరించారు.ఉపసర్పంచ్వెంకట్రావు గతంలో సందర్శించి నప్పుడు కేంద్రంలో జరుగుతున్న చిన్నారుల ఆటపాటలతో కలసి నేర్పుతున్న విద్యబుద్ధులను పరిశీలించి సంతృప్తి ని వ్యక్తం చేయడం తోపాటు కేంద్రంలో సీలింగ్ ఫ్యాను అవసరతను గుర్తించారు.ఈ నేపద్యంలో కేంద్రంలోని వసతులను చూసి, ఇప్పుడు ఉన్న ఫ్యాన్‌కు తోడు మరొక ఫ్యాన్ ఉంటే చిన్నారులకు బాగుంటుంది అని భావించి మంగళవారం సెంటర్ కు ఫ్యాన్ ను బహుకరించారు. అంన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాను బహుకరించిన వెంకట్రావును సీడీపీఓ సుధ, సూపర్వైజర్లు సుష్మారాణి, ప్రమీల, నాగూర్ బి అంగన్వాడీ లబ్ధిదారులు అభినందనలు తెలిపారు.



7_7.qxd 10/22/2025 10:38 PM Page 1



## పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి : ఎంఈఓ గిరిధర్ శర్మ



**రాచర్ల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మండల ఎంఈఓ వి గిరిధర్ శర్మ అన్నారు. రాచర్ల జడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ముఖ్యంగా వెనుకబడ్డ విద్యార్థులు ఏ విధంగా పది పరీక్షలకు సన్నద్ధం కావాలో అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇష్టంగా కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందికి రివ్యూ మీటింగ్ నిర్వహించి ఎఫ్ ఏ1, ఎఫ్ ఏ2, మార్కుల ఆధారంగా సి,డి గ్రేడ్లను విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన రిజిస్టర్లు, అసెస్మెంట్ బుక్స్ అప్డేట్‌గా ఉంచాలన్నారు. విద్యార్థులు పాఠశాలలోని భోజనం చేసేవిధంగా చూడాలని రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డ్రాప్ అవుట్ లేకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి ఎల్ రామానాయక్, చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

### - ఎంపీడీవో వెంకటరామిరెడ్డి ఎస్సై కోటేశ్వరరావు



**రాచర్ల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందు వలన ప్రజల అప్రమత్తంగా ఉండాలని మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని చోళవీడు ఆకవీడు చిన్నగానిపల్లి అచ్చంపేట జేపీ చెరువు గ్రామాలతో పాటు రంగస్వామి దేవస్థానాన్ని బుధవారం సందర్శించారు. ప్రస్తుతం రంగస్వామి గుండంలోకి నీరు ఉధృతంగా చేరుతుందని దీని ప్రభావం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా చోళ వీడు గుండ్లకమ్మ వాగు వచ్చే అవకాశం ఉందని గుండ్లకమ్మ వాగు పరిసర ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు ప్రవహించేటప్పుడు వాగు దాటేందుకు ప్రయత్నించవద్దని వారు ప్రజలకు తెలిపారు. ప్రస్తుతం వర్షాల వల్ల ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేదని వర్షం అధికమైతే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. తాము నిత్యం అందుబాటులో ఉంటామని సమస్యలు ఎదురైతే వెంటనే తమకు సమాచారం అందించాలని వారు కోరారు.

## పంటపొలాలను పరిశీలించిన ఏడిఏ బాలాజీ నాయక్



**కంభం, అక్టోబరు 22, ప్రభాతవార్త**
కంభం మండలంలోని తురిమెళ్ళ, ఎర్రబాలెం, నర్సిరెడ్డిపల్లి గ్రామాల్లో పంట పొలాలను బుధవారం మార్కాపురం ఏడిఏ బాలాజి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తుఫాను ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో ఎక్కడైనా నీరు ఎక్కువగా నిలబడితే వెంటనే బయటకు పంపేఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో వరి పంట వెయ్యి ఎకరాలో సాగులో ఉందని పంట అంతా దుబ్బుదశలో ఉందని ప్రస్తుత వర్షాలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. వర్షం తగ్గిన వెంటనే కార్బన్డిజం 250 మి.ల్లీ ఎకరానికి లేదా పుసి వన్ 400మి.ల్లీ ఎకరానికి కలిపి పిచికారి చేసుకున్నట్లయితే తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చని రైతులకు సూచించారు. అలాగే శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కంభం మండల వ్యవసాయ అధికారి షేక్. మహమ్మద్, వీఏఏ సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



**యర్రగొండపాలెం, అక్టోబరు 22, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండల పోలీసు స్టేషనులో నూతనంగా సీఐ కె అజయ్ కుమార్ ఇటీవల యర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలను తెలిపారు. యర్రగొండపాలెం మార్కెట్ యార్డు ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి వేగినాటి శ్రీనివాస్‌లతో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ అజయ్ కుమార్‌ను కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఆయనకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. సిఐ అజయ్ కుమార్ తనను అభినందించడానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులతో సరదాగా మాట్లాడుతూ వారి పేర్లను అడిగి కరచలనం చేశారు. ఇష్టాగోష్టిగా చర్చిస్తూ పట్టణ పంచాయతీలో ట్రాఫిక్ సమస్య చాలా ఎక్కువ ఉందని, దీని వలన ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వినుకొండ సెంటర్‌లో తరచూ జరిగే ట్రాఫిక్ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. యర్రగొండపాలెం నుంచి వినుకొండ తెనాలి వైపు నడిచే బస్సులు అక్కడి మలుపు వద్ద గంటల తరబడి రోడ్డుకు అడ్డంగా నిలిచి తుండటంతో అక్కడి సెంటర్ నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అల్లాడి పోతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని సిఐని కోరారు. అక్కడ ప్రవేట్ కార్పోరేట్ ఆసుపత్రి ఉండటం వలన తరచూ ఎమర్జెన్సీ కేసులు వస్తు ఉంటాయని, ఇక్కడ తరచూ జరిగే ట్రాఫిక్ సమస్యవలన రోగులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బంది పడుతున్నా విషయం ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి, కాపునాయకులు తోటామహేష్ నాయుడు, ఎస్టీనాయకులు మంత్రునాయక్, అంజయ్య, బీసీనాయకులు సత్యానారాయణ గౌడ్, సొసైటి అధ్యక్షులు యాపర్తి వీరయ్య, వెంకటాద్రిపాలెం సర్పంచ్ శ్రీశైలపతి నాయుడు, పట్టణ అధ్యక్షులు మల్లిఖార్జున, పంచాయితీ నెంబర్ చేదూరి కిశోర్‌లతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు సీజనల్ వ్యాధులు సోకకుండా జాగత్రలు తీసుకోవాలి



**రాచర్ల, అక్టోబరు 22, ప్రభాతవార్త**
ప్రస్తుతం ముమ్మరంగా వర్షాలు కురుస్తున్నాయని బాలికలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ డి.జయ సిబ్బందికి సూచించారు. రాచర్ల ఫారం సమీపంలోని డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని తరగతి గదులు వంటగది, స్టోర్ రూమ్ పాఠశాల ఆవరణలో గడ్డి తొలగింపు, మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి వినియోగంపై పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పనలో సిబ్బంది నిరక్ష్య వహించవద్దని అన్నారు బాలికలకు అందే విద్య భోజనం మౌలిక వసతులపై ప్రత్యక్షంగా పరిశీలించారు. నాణ్యమైన విద్య రుచికరమైన భోజనం మెరుగైన మౌలిక వసతుల కల్పనలో చిన్నపాటి లోటుపాట్లు కూడా ఉండకూడదని సిబ్బందికి సూచించారు. విద్యలో వెనుకబడ్డ బాలికలకు ప్రత్యేక శిక్షణతో విద్యను అందించి పాఠశాలలను ప్రతి ఒక్కరు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని సిబ్బందితో అన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ సిబ్బంది పని తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు ఆమె వెంట స్థానిక ప్రిన్సిపల్ మేరీ మంజుల సిబ్బంది తదితరులు ఉన్నారు.

### జంకే వెంకటరెడ్డిని కలిసిన విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు గుంటక వెంకట అంజిరెడ్డి



**మార్కాపురం, అక్టోబరు 22,ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్కాపురం మాజీ శాసనసభ్యులు మరియు నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు పెద్దలు జంకె వెంకటరెడ్డిని గురువారం జవహర్ నగర్ కాలనీ నందు గల వారి స్వగృహం నందు జిల్లా స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ గుంటక వెంకట అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు మార్కాపురం పట్టణ వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా ఇన్చార్జ్ షేక్ మహమ్మద్ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గుంటక అంజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన పదవికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంటక వెంకట అంజిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి లక్ష్యాలను ప్రజల వరకు తీసుకెళ్లడంలో విద్యార్థి విభాగం కీలక పాత్ర పోషించనుంది” అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా గోలమారి శివారెడ్డి, గుంటక చెన్నారెడ్డి, స్టేట్ యూత్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, రమణారెడ్డి, నూర్ అహ్మద్‌లతోపాటు పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## ఆత్మీయ నాయకులు అమిత్‌షాకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

### - గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్



**గిద్దలూరు రూరల్, అక్టోబరు 22, ప్రభాతవార్త**
సహృదయులు, మానవతావాది, మంచి మనిషి, మచ్చలేని నేత దేశాభివృద్ధికి, భద్రతకు దేశ సంక్షేమానికి, అకుంఠిత దీక్షతో పాటుపడుతున్న మా ప్రియతమ నాయకులు భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత కేంద్ర హోంశాఖ మంత్రి వర్యులు అమిత్ షాకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు తెలిపారు. బుధవారం అమిత్‌షా పుట్టిన రోజు సందర్భంగా ఆయన బిజేపి నాయకులతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, అందుకు కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు భారతీయ జనతాపార్టీ గిద్దలూరఉ పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ తెలిపారు.

## నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకుడు ఎరిక్షన్‌బాబు

### - టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్



**పుల్లలచెరువు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గం కేంద్రంగా ఏర్పడి దాదాపు రెండు దశాబ్దాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, గ్రామాల పురోగతిపై ఆలోచించిన నాయకులు చాలా అరుదుగా కనిపించారు. గతంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా ప్రజల సమస్యలపై సరైన దృష్టి సారించలేదని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ఈ పరిస్థితుల్లోనూ ప్రజల పట్ల కృతజ్ఞతతో, సేవాభావంతో ముందుకు సాగుతున్న నాయకుడు గూడూరి ఎరిక్షన్ బాబు అని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ ప్రశంసించారు. ఎరిక్షన్ బాబు రాజకీయ నాయకుడిగానే కాకుండా, ప్రజా సేవకుడిగా వ్యవహరిస్తూ ప్రతి గ్రామం, ప్రతి కార్యకర్త సమస్య తెలుసుకొని, వెంటనే స్పందిస్తున్నారని ఆయన తెలిపారు. పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలిచి, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా లేదా కుటుంబ సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించి సహాయం అందించడం ఎరిక్షన్ బాబు ప్రత్యేకత అని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటికే వందలాది మంది టిడిపి కార్యకర్తలకు లక్షల్లో ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ఇలాంటి నాయకులు ఈ రోజుల్లో చాలా అరుదు అని బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మన ఎరిక్షన్ బాబు కార్యకర్తల పట్ల చూపుతున్న ప్రేమ, బాధ్యత నిజంగా అభినందనీయమైనది. ప్రతి ఒక్కరినీ పేరుపెట్టి పిలిచి వారి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు. ఇలాంటి నాయకుడిని మనం గౌరవించడం, ఆయన వెనుక అండగా నిలవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. అంతేకాకుండా ఎరిక్షన్ బాబు యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడంలో ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో ప్రజలలో కొత్త ఆశలు, నమ్మకం ఏర్పడిందని తెలిపారు. బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ప్రజలతో మమేకమై పని చేసే నాయకుడు ఎరిక్షన్ బాబు లాంటి వారు చాలా అరుదు. రాజకీయాలు అంటే ప్రజాసేవ అని ఆయన చూపిస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అందరూ కలిసి ఆయనకు బలంగా అండగా నిలిస్తే యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభమవుతుంది అని అన్నారు.

# మార్కాపురంలో ఎడతెరపి లేకుండా వర్షాలు..

### - పంట పొలాల్లో నిలిచిన నీరు... రైతుల్లో ఆందోళన...



**మార్కాపురం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మార్కాపురంలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని పంటపొలాలు నీటితో నిండిపోయాయి. రైతులు ఇలాగే వర్షం కొనసాగితే మా పంటల పెట్టుబడులు పెరిగి నష్టాలు వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు.తీవ్ర వర్షపాతం కారణంగా ప్రజా జీవనానికి అంతరాయం కలిగింది. పట్టణంలోని కొండేపల్లి రోడ్డు, భగత్ సింగ్ కాలనీ, నాగులవరం రోడ్డు, జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ తదితర చాలా ప్రాంతాలలో రోడ్లన్నీ జలమయమై వాగులను, వంకలను తలపిస్తున్నాయి. 10వ వార్డులో సాగర్ పైపు లైన్ కోసం తీసిన గుంతలన్నీ నీటితో నిండి పలు రహదార్లు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. జిల్లా అధికారులు పరిస్థితిని సమీక్షించి గురువారం మధ్యాహ్నం స్థానిక స్కూళ్లకు సెలవు ప్రకటించారు. వర్షాల తీవ్రతతో పంట నష్టపోతుందనే ఆందోళన రైతులను వేధిస్తోంది. ముఖ్యంగా వరి, కంది, మిర్చి వంటి పంటలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని వారు తెలిపారు. రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తమయ్యాయి. అధికారులు ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత సూచించారు. స్థానిక అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, ఎటువంటి అపాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### 24 గంటలుగా నమోదైన వర్షపాతం వివరాలు :

పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో గత 24 గంటలుగా నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మార్కాపురం 13.8, పెద్దారవీడు 24.8, దోర్నాల 16.8, యర్రగొండపాలెం 14.4, త్రిపురాంతకం 29.6, పుల్లలచెరువు 11.8, కంభం 22.4, బేస్తవారిపేట 11.6, అర్ధవీడు 25.4, గిద్దలూరు 25.2, రాచర్ల 18.2, కొమరోలు 26.2, తర్లుపాడు 25.2 మార్కాపురం డివిజన్ మొత్తం 265.2 వర్షపాతం నమోదు అయినట్లుగా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా త్రిపురాంతకంలో నమోదు కాగా అతి స్వల్పంగా బేస్తవారిపేటలో నమోదు అయినట్లుగా అధికారులు వెల్లడించారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### - కాసు చారిటబుల్ ట్రస్టు వితరణ - కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు



**కొనకనమిట్ల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన కోటపాటి సుబ్బయ్య ఈ నెల 9న కిడ్నీలు దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో మరణించారు. ఆయన ఆరోగ్యం కోసం వారి సతీమణి లింగమ్మ రెండు లక్షలకు పైగా అప్పులు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించలేక, చేసిన అప్పుల ఒత్తిడితో భర్త చనిపోయిన దు:ఖంలో బాధపడుతూ తీవ్ర మానసిక వేదనతో కుమిలిపోతుంది. అయినా ఆమె సాంప్రదాయం ప్రకారం ఈనెల 23న భర్త కోటపాటి సుబ్బయ్య కర్మ కాండల కార్యక్రమం కోసం కనీసం భోజన వసతికి ఒక 15 వేల రూపాయలు ఖర్చు అవుతుంది అని విన్నవించుకున్నారు. దాతలు ఎవరైనా తమ కుటుంబానికి ఈ మొత్తం ఆర్థిక సహాయం అందించగలరని ఆమె కోరిన నేపథ్యంలో కొనకనమిట్ల మండలానికి చెందిన కాసు చారిటబుల్ ట్రస్టు అధినేత, ఎన్నారై కాసు వెంకటేశ్వరరెడ్డి స్పందించి రూ.15వేల ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం

### - ఎమ్మెల్యే డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి



**హనుమంతునిపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం శాసనసభ్యులు డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులు పంపిణీ చేశారు. హనుమంతునిపాడు మండలంలోని నందనవనం పంచాయతీకి సంబంధించిన మర్రి శ్రీనివాసులుకు రూ.25,424 రూపాయలు, కొదమల జాన్‌కి రూ.25,800, ఎస్‌కే నాసర్‌కి రూ.51,300ల చెక్కులను టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి సమక్షంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అండగా ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కావేటి నారాయణ, బూత్ ఇన్‌చార్జి పెంచికల రామకృష్ణ, ఆకుపాటి శ్రీనివాసులు, కొదమల కృపయ్య, సూరిశెట్టి శివ, గిద్ద గరటయ్య, చీకటి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ పక్రియను పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, అక్టోబర్ 22, ప్రభతవార్త**
సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం గ్రామంలో బుధవారం నాడు శానిటేషన్ పక్రియను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, డ్రింకింగ్ వాటర్ తదితర వాటిని ఆయన పరిశీలించారు. శానిటేషన్ పక్రియను ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో సురేష్‌బాబు పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద గొల్లపల్లిలో సంతకాల సేకరణ చేపట్టిన దద్దాల, చిట్యాల



**హనుమంతునిపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని పెద్దగొల్లపల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొని నాయకులతో కలిసి గడపగడపకు తిరుగుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులను తీసుకువచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూడటం సిగ్గు చేటన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదల కడుపుకొడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటు పరం చేసే దుర్మార్గపు ఆలోచనను చంద్రబాబు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, సర్పంచ్ నక్క నారాయణ, రాష్ట్ర ఐటీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కటికల వెంకటరత్నం, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, మండల వైస్ ఎంపీపీ శోభా సాల్మన్ రాజ్, నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణ స్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేసపోగు గురు ప్రసాదు, మండల బీసీ సెల్ మద్దితిరుపతి, వేములపాడు గ్రామ కన్వీనర్ గుంటక రమణారెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, మండల ఆర్‌టీఐ వింగ్ వెంకట కాశయ్య, కలికాయి నారాయణ, దొడ్డి చింతల కోటపాటి సందీప్, సానికొమ్ము వెంకటస్వామిరెడ్డి, నాలి వెంకటేశ్వర్లు, గొబ్బిళ్ళ శ్రీనివాస్ యాదవ్, మోర వెంకట నారాయణ, దేవిరెడ్డి తిరుపతిరెడ్డి, చిట్యాల సుధాకర్‌రెడ్డి, వేంపాటి వెలుగొండారెడ్డి, దేవిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, పెరుగు ముసలయ్య, సానికొమ్ము అంజిరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చిన్న కోటేశ్వరరావు, చెన్నయ్య, సుందరం, కాటినేని కృష్ణ, చింతం పిచ్చయ్య, వేసపోగు సుందరం, రాజా, కోలా మత్తయ్య, కిషోర్, యోహోషువ, మోజేష్, ప్రమోద్, బాలస్వామి, సురేష్, డ్రైవర్ రాముడు, జైపాల్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారిని దర్శించుకున్న స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి



**హనుమంతునిపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మండలంలోని చిన్న గొల్లపల్లి గ్రామం నాగులేటి ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి నాయకులతో కలిసి సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ పంచాయతీ వింగ్ అధ్యక్షుడు, హనుమంతాపురం సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేసపోగు గురు ప్రసాద్, నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణ స్వామి, నల్లగండ్ల గ్రామ కన్వీనర్ బత్తుల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపంటను పరిశీలించిన దర్శి ఏడీఏ, మండల ఏవోలు



**కొనకనమిట్ల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
మండలంలోని పెద్దారికట్లలో అధిక వర్షాల కారణంగా వర్షపు నీరు చేరిన పత్తి పంటను దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావులు బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా మండల వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కంది పంట నష్టపోకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పొలం నుండి నీరు తీసివేయాలి. 3 గ్రాములు కాపరాక్సి క్లోరైడ్ లీటరు నీటికి కలిపి తడిచేలా పిచికారి చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 200 లీటర్ల మందు ద్రావణంలో పిచికారి చేయాలన్నారు. ఎండు తెగులు ఎక్కువ రావడానికి అవకాశం ఉందని, నివారణకు 1 గ్రాము కార్బన్డిజం నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే తెలుగు కొంత వరకు నివారించవచ్చునని తెలిపారు. మొన్నటి వరకు వర్షాలు లేక పైర్లు బెట్టకు గురికావడం జరిగిందని, దీని వల్ల పెరుగుదల తక్కువగా ఉంది. కంది పైరు ఎదుగుదలకు ఉరకెత్తకుండా ఉండేందుకు ఎకరానికి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాషియం ఎరువులు వేయాలని సూచించారు.

### పత్తి పంటలో తీసుకోవాల్సిన చర్యలు :

ఈ వర్షాలకు ఆకు మచ్చ తెగులు రావడానికి అవకాశం ఉందని, నివారణకు ఎక్సాకొనాజోల్ 2 ఎంఎల్‌లు లేదా కార్బన్డిజం ఒక గ్రాము లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. పత్తిలో పూత కూడా రాలే అవకాశం ఉందని నివారణకు బోరాక్స్ లీటరు నీటికి 1.5 గ్రాములు పిచికారి చేయాలి. వారం రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. పత్తి అధిక తేమను తట్టుకొని పెరగడానికి 2 శాతం యూరియా లేదా 1 శాతం నీటిలో కరిగే ఎరువులైన 19:19:19లు లేదా 17:17:17 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలి. పత్తిలో కాయకుళ్ళు రావడానికి అవకాశం ఉందని, దీని నివారణకు కాప్రాక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, 2 గ్రాములు ప్లాంటోమైసిన్, 10 లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.అధిక వర్షాల నుంచి పంటల్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, గ్రామ వ్యవసాయ సహాయకులు గంగయ్య పాల్గొన్నారు.

## నల్లవాగు పొంగి ఒంగోలు, మంగమూరు రాకపోకలకు అంతరాయం







**సంతనూతలపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
భారీ వర్షాల వల్ల సంతనూతలపాడు మండలం మంగమూరు ఒంగోలుకు వెళ్లే రహదారిలో నల్లవాగు పొంగి రెండు కేంద్రాలకు వెళ్లేందుకు వీలు లేక అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా భారీ వర్షాల వల్ల రహదారిపై ఈ వాగు వద్ద ముమ్మరంగా నీరు చేరుకొని వాహనాలు రాకపోకలు వెళ్లేందుకు వీలే లేక నిలిచిపోయాయి. సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముమ్మర బందోబస్తును చేపట్టారు. ఒంగోలు మంగమూరుకు వెళ్లే రహదారిలో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. బుధవారం ఉదయం 11గంటల పై నుండి సాయంత్రం వరకు రాకపోకలు ఈ రూట్లో పూర్తిగా నిలిచిపోయాయి.

# ఘనంగా ప్రారంభమైన కార్తీక మాస వేడుకలు



**సంతనూతలపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలో పలు ఆలయాల్లో బుధవారం నాడు ఘనంగా కార్తీక మాస వేడుకలు ప్రారంభమైనవి. ప్రధానంగా సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో ఈ కార్తీక మాస వేడుకలు వైభవంగా ప్రారంభమైనవి. ఈనెల 22వ తేదీన ప్రారంభమైన ఈ కార్తీక మాస వేడుకలు నవంబర్ 21వ తేదీ వరకు ఆలయాల్లో జరగనున్నాయి. నవంబర్ 5న కార్తీక పౌర్ణమి, 18వ మాస శివరాత్రి, నాలుగు సోమవారాలు ఈ నెల 25న నాగులచవితి కార్తీక మాసంలో ప్రధాన పండుగ వేడుకలు. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి వారి ఆలయంలో బుధవారం నాడు ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవంబర్ 5న కార్తీక పౌర్ణమి పురష్కరించుకుని అదే రోజు సాయంత్రం వేళలో వైభవంగా వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా జ్వాలా తోరణ వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఎండోమెంట్ దాతలు ఆధ్వర్యంలో సంతనూతలపాడు శివాలయంలో ఘనంగా కార్తీక మాస వేడుకలను నిర్వహిస్తున్నారు. నవంబర్ 18న మాస శివరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామ సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎండోమెంట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎన్.నారాయణరెడ్డి, ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ, ఆలయ చైర్మన్ శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు, దాతలు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం నాడు కార్తీక మాస వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు ఆలయాల్లో ఈ వేడుకలు ఘనంగా ప్రారంభమైనవి.

8_8.qxd 10/22/2025 10:39 PM Page 1



# ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా

## - 100 మందికి రూ.55.92 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**కనిగిరి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

ప్రజల ఆరోగ్య భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆర్థికంగా బలహీన వర్గాల రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 100 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.55,92,693 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్సల ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం ప్రభుత్వానికి ప్రాధాన్యం, ఎవరూ ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్సకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ సాయం అందించినందుకు ప్రభుత్వం, సీఎం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ కనిగిరి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, కనిగిరి మండల రూరల్ అధ్యక్షుడు కొండ కృష్ణారెడ్డి, కనిగిరి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, సీనియర్ నాయకులు బజాజ్ ఓబుల్‌రెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, ఏడవ వార్డు అధ్యక్షుడు పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, 6 మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కేఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

# 11వ వార్డులో కేఎస్ఎస్ సభ్యుల సమావేశం



**కనిగిరి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని 11వ వార్డు కేఎస్ఎస్ సభ్యుల సమావేశం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించారు. సమావేశంలో టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టౌన్ కేఎస్ఎస్ ఇన్‌చార్జి షరీఫ్, తెలుగు యువత అధ్యక్షులు అచ్చాల రవి, బీసీ సెల్ అధ్యక్షులు పెన్నా వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ రహిమాన్, వార్డు అధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. సభలో వార్డు అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, ప్రజలతో నేరుగా అనుసంధానం వంటి అంశాలపై చర్చ జరిగింది. సభ్యులు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చురుకుగా పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని నాయకులు సూచించారు.

# జనంలోకి వాసుదేవరావు



**పామూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

పామూరు మండలంలోని నాలుగు రోజుల నుండి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాలు పలు ప్రాంతాలు పరిశీలించిన పామూరు మండల తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, పట్టణంలోని అంకాలమ్మ వీధి, ఎస్టీ పాలెం, గణేష్ నగర్ ప్రాంతంలో పర్యటించి అక్కడ జీవిస్తున్న ప్రజల పరిస్థితులను పరిశీలించి వర్షాల ప్రభావంతో ఇబ్బందులు ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని ముందస్తు తగిన సహాయక చర్యలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, వీఆర్వో మనోజ్ కుమార్, సరస్వతి, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



**పామూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలో కంబాలదిన్నె పంచాయతీలోని రెండు ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలోని 80 మంది విద్యార్థులకు చుంచు నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించి బాగా చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఎం.మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థుల వసతుల కల్పనకు చుంచు నరసింహారావు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ గీత, స్కూల్స్ చైర్మన్ రాయ మధు, తదితరులు పాల్గొన్నారు.


## మోపాడు రిజర్వాయర్‌ను, పలు చెరువులను సందర్శించిన ఎస్సై కిషోర్‌బాబు

**పామూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

గడిచిన నాలుగు రోజుల నుంచి పామూరు మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని పలు గ్రామాలలో రోడ్లపై నీరు ప్రవహిస్తూ ఉండడంతో రవాణా సౌకర్యానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. పామూరు ఎస్సై టి.కిషోర్‌బాబు మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను, బోడవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును కంబాలదిన్నె చెరువును పరిశీలించారు. మోపాడు చెరువులో ప్రస్తుత నీటిమట్టం 10 అడుగులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజలు ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా విద్యుత్, నీటి కుంటలు, పాత గోడలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్న తనకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. 24 గంటలు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు.

# విద్యుత్ అంతరాయాలు తగ్గించాలి

## - ఏపీసీపీడీసీఎల్ ఎండీ పుల్లారెడ్డి



**వేటపాలెం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

33కేవీ 11 కేవీ లైన్లో అంతరాయాలు భాగా తగ్గించాలని ఏపీసీపీడీసీఎల్ ఎండీ విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక సెంటెన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని భాగా తగ్గించాలని, అందుకోసం ముందుగానే నిర్వహణ పనులు చూసుకోవాలని సూచించారు. పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను అత్యంత త్వరగా మార్చాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ 9 గంటలకు తగ్గకుండా, వ్యవసాయ కనెక్షన్లు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని, అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి విద్యుత్ సిబ్బంది అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అదే విధంగా ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానల్స్ బిగించుకొని, సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చే సబ్సిడీని పొంది తద్వారా విద్యుత్ వినియోగం బిల్లు తగ్గించుకోవచ్చని అనే ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డైరక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్, డైరక్టర్ ప్రాజెక్ట్స్ కేవీఎస్ఎన్ మూర్తి, డైరక్టర్ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ గువ్వల ఆంజనేయులు, చీరాల ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కే.జాన్ థామస్, జిల్లా ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, ఏఓలు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డిని కలిసిన ఆమంచి



**చీరాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

వేటపాలెం, చిన్నగంజాం ఆక్వా రైతులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. కానీ కొత్తగా బ్యాక్ బిల్ చెల్లించాలని ఆక్వా రైతులకు బిల్లులు పంపించారు. ఆక్వా రైతుల తరుపున చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిని బుధవారం చల్లారెడ్డిపాలెంలోని సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీ నందు ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్యాక్ బిల్ లేకుండా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమంచితో పాటు భాస్కర్‌రెడ్డి, తెల్ల రామయ్య, కుంచాల గిరి, ముంగర వెంకట రామయ్య, పెరుగు భాస్కర్, జరుగుల రమేష్, ఆమంచి సుబ్బారావు, వడ్లమూడి సాంబలక్ష్మి, నారాయణ, కీర్తి శ్రీను, నాయుడు హనుమంతురావు, నున్న రోశయ్య, కరణం మురళి, వెంకటేశ్వరరావు(ప్రసాద్ మాస్టర్), తదితరులు పాల్గొన్నారు.

## ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

**సంతనూతలపాడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో గల మసీదు నందు జరిగిన 50వ గంధమహోత్సవ(ఉరుసు) వేడుకల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొల్లా మహేష్; రాష్ట్ర టీడీపీ మహిళా సంఘం నాయకురాలు ఆరికట్ల సుమతి, టీడీపీ నేతలుషేక్‌నన్నేసా,అమానుల్లా,కాలేశా, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



# తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - భారీ వర్షాలపై కలెక్టర్ రాజాబాబు పర్యటన

## - మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని సూచన



**సింగరాయకొండ, అక్టోబర్ 22, ప్రభాత వార్త:**

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు.భారీ వర్షాల పరిస్థితుల దృష్ట్యా బుధవారం కలెక్టర్ సింగరాయకొండ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, మండలంలో తీసుకుంటున్న ముందస్తు చర్యలను సమీక్షించారు. అధికారులకు తగిన దిశానిర్దేశాలు జారీ చేశారు.తదుపరి కలెక్టర్ ఊళ్ళపాలెం తీర గ్రామాన్ని సందర్శించి, మత్స్యకారులతో మాట్లాడారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆయన హెచ్చరించారు.మత్స్యకారులు వలలు,బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.కలెక్టర్ అనంతరం ఊళ్ళపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. అవసరమైన మందులు సరిపడా నిల్వ ఉంచి, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు.గ్రామ సచివాలయం పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సాయంత్రం నాటికి పరిసరాలను పూర్తిగా శుభ్రపరచాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అవసరమైతే ఆ పాఠశాలను పునరావాస కేంద్రంగా ఉపయోగించేందుకు ముందస్తు ఏర్పాట్లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ కళావతి, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిఆర్డీఏ పీడీ నారాయణ, డీపీఓ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈ బాలశంకరరావు, జిల్లా వైద్యాధికారుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, తహసిల్దార్ ఎన్వీబీ రాజేష్, ఎంపీడీవో జయమణి పాల్గొన్నారు.

# సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్



**వేటపాలెం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

సీజీఆర్ఎఫ్- కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 23వ తేదీన వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీలోని రావి జయలక్ష్మి సుబ్బారాయుడు కళ్యాణ మండపం నందు విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు జరుగుతుంది. ఈ కార్యక్రమంలోసీజీఆర్ఎఫ్ చైర్మన్‌విక్టర్ ఇమ్మానియేల్, సూపరింటెండెంట్ ఇంజనీర్ బాపట్ల, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొంటారు. చీరాల డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను సీజీఆర్ఎఫ్ ముందు విన్నవించుకున్నచో చట్ట పరిధిలోకి లోబడి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించబడును. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా చీరాల ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కే.జాన్ థామస్ తెలియజేశారు.

# కొత్తపేట సర్పంచ్ పదవి సాధారణ వర్గానికే

## - పంచాయతీకి రిజర్వేషన్ వివరాలు విడుదల చేసిన ఎంపీడీవో రాజేష్‌బాబు



**వేటపాలెం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

కొత్తపేట గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీకి సంబంధించి రిజర్వేషన్ వివరాలు జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఆ వివరాలను బుధవారం మండల ఎంపీడీవో మెడబలిమి రాజేష్‌బాబు విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. పంచాయతీ సర్పంచ్ పదవి సాధారణ వర్గంకు కేటాయించారు. మొత్తం 16 వార్డులు ఉన్న ఈ పంచాయతీలో వేర్వేరు వర్గాల వారీగా రిజర్వేషన్ కేటాయించారు. వార్డుల వారీగా రిజర్వేషన్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 1,2 వార్డులు సాధారణ మహిళ, 3,4 వార్డులు సాధారణ జనరల్, 5 వార్డు బీసీ జనరల్, 6వ వార్డు ఎస్సీ మహిళ, 7వ వార్డు ఎస్సీ జనరల్, 8వ వార్డు ఓపెన్ కేటగిరి, 9వ వార్డు జనరల్ మహిళ, 10వ వార్డు జనరల్ మహిళ, 11 బీసీ జనరల్, 12 జనరల్, 13వ వార్డు బీసీ మహిళ, 14వ వార్డు బీసీ మహిళ, 15వ వార్డు బీసీ జనరల్, 16వ వార్డు ఎస్టీ మహిళకు కేటాయించారు. గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధుల ఎంపికలో సామాజిక సమతౌల్యాన్ని కాపాడేందుకు ఈ రిజర్వేషన్ ఉన్నతాధికారులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్వోగా ఏవీ సుబ్బారావుని ఏఆర్ఓగా నారాయణను నియమించినట్లు చెప్పారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులు ఎవరు ఎన్నికల క్యాంపెయిన్లలో పాల్గొనకూడదని ఎలక్షన్ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాల యుడీసీ మస్తాన్, శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు టి.వెంకటేశ్వరరావు, మాల్యాద్రిరావు, చక్రవర్తి పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

## - ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మితికేల గురవయ్య



**సీఎస్‌పురం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని దర్శిగుంటపేట పంచాయతీ పరిధిలోని బబ్బిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మితికేల గురవయ్య, దర్శి గుంట పేట ఎంపీటీసీ మితికేలా ప్రభావతి ఆధ్వర్యంలో గ్రామ ప్రజల నుండి విస్తృతంగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మితికేల గురవయ్య మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండదని, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ వైద్య విద్యను ప్రైవేటు రంగానికి అప్పగించడం ప్రజలపై భారమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# విస్తారంగా వర్షాలు

**కురిచేడు, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో బుధవారం నాడు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం 8గంటల నుంచే దట్టమైన మేఘాలతో వర్షం కురిసింది. మధ్యమధ్యలో కొంత సేపు విరామం ఇచ్చినప్పటికి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. అంతే కాకుండా కలెక్టర్ ఆదేశానుసారం మధ్యాహ్నం నుండి మండలంలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించివేశారు. కురిచేడులో కెనరా బ్యాంకు ముందు వర్షం కురిసినప్పుడల్లా అడుగులోతు నీరు ప్రవహిస్తూ వీధి అంతా వాగును తలపిస్తూ వచ్చిపోయే వారికి ఇబ్బందులు కలిగిస్తుంది.




## ఆంధ్రరాష్ట్ర సమగ్ర అభివృద్ధికి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన విజయవంతం

## - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ




**దర్శి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గత నాలుగు రోజులుగా ఆస్ట్రేలియా దేశంలో ఆంధ్ర రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం వివిధ భాగస్వామ్య ఒప్పందాలను చేసుకొని విజయవంతంగా తన విదేశీ పర్యటనను పూర్తి చేసుకొని ఏపీకి పారిశ్రామిక పెట్టుబడులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, నగరాల అభివృద్ధికి భాగస్వామ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపినట్లు దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. ఆస్ట్రేలియాలో నైపుణ్యాభివృద్ధి ఉద్యోగ, శిక్షణ పారిశ్రామిక అకాడమిక్ సహకార వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విదేశాయన యాత్ర ఉపయోగపడిందన్నారు. నాలుగు రోజులు పాటు ఆంధ్రరాష్ట్ర పారిశ్రామిక సాంకేతిక అభివృద్ధికి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన చేసుకుని తిరిగి ఆంధ్రకు రావడం సాదరంగా స్వాగతం పలుకుదాం, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంగా మూడు రోజులు పాటు యుఏ పర్యటనకు బయలుదేరి వెళ్లడం, అభివృద్ధికి మరో మైలురాయిగా డాక్టర్ లక్ష్మీ అభివర్ణించారు. అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం చేపడుతున్న స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో మేము సైతం అంటూ ప్రతి ఒక్కరూ ముందుండాలని ఆమె పిలుపునిచ్చారు.

# తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో దర్శి నియోజకవర్గ ప్రజలకు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తాయన్న తుఫాన్ వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఆమె కోరారు. విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా పిల్లలను, పశువులు కాపులను, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ తీగల వద్ద ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు దర్శి ప్రాంతంలో అనేకం ఉన్నాయని వాటి ప్రాంతాలలో పశువులు, కాపరులు వెళ్ళవద్దని ఆమె సూచించారు. సరదాగా కూడా పిల్లలను చెరువులు వైపు పంపకూడదని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు.

# బెల్టు షాపులపై దాడులు

## - ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



**దర్శి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

నియోజకవర్గ పరిధిలోని దొనకొండ మండలంలోని పలు అనుమానిత ప్రదేశాలలో బెల్టు షాపులపై దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో దొనకొండ మండలంలోని తెల్లపాడు గ్రామంలో సుబ్బరాయుడు అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహణ కొరకు 13 మద్యం సీసాలు, ఆరవల్లిపాడు గ్రామంలో పాపయ్య అనే వ్యక్తి 15 మద్యం సీసాలు అక్రమంగా ఉంచగా, వారిద్దరిపైన కేసులు నమోదు చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఎస్‌కే యూసఫ్ షరీఫ్, దర్శి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సాయిబాబా, ఎస్.శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ సంతకాల సేకరణ



**పెద్దదోర్నాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు రద్దు చేయాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా పెద్దదోర్నాల మండలం కొత్తూరు, బోడే నాయక్ తండ, రామచంద్రకోట, చిన్న దోర్నాల గ్రామాలలో బుధవారం యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో వైకాపా శ్రేణులు ఆయా గ్రామాల్లో రచ్చబండ నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిప్పాయపాలెంలో మిరప తోటల పర్యవేక్షణ

## - రైతులకు జాగ్రత్తలు సూచించిన ఉద్యాన శాఖ అధికారి డి.రమేష్



**మార్కాపురం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో గురువారం కొన్ని ప్రాంతాలు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు లోనయ్యాయి. వర్ష ప్రభావానికి గురైన మిరప తోటలను ఈరోజు ఉద్యానశాఖ అధికారి డి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన అధిక వర్షాలలో ఉద్యాన పంటలైన మిరప మరియు కూరగాయల సాగులో తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలను వివరించారు. పొలాల్లో నిలిచిన నీటిని తక్షణమే బయటకు పంపించే విధంగా డ్రైనేజీ సదుపాయాలు కల్పించుకోవాలన్నారు. వర్షం కొంత తగ్గిన వెంటనే మొక్కలలో పోషక లోపాలను నివారించేందుకు మైక్రో న్యూట్రియంట్ మిక్చర్‌ను 5 గ్రాములు ప్రతి లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, తెగుళ్ల నియంత్రణ కోసం బ్లైట్ టాక్స్ లేదా బావెస్టిన్ అనే మందులను 3గ్రాములు లీటర్ నీటికి కలిపి వారానికి రెండుసార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ సూచనల ద్వారా రైతులు అధిక వర్షాల వల్ల కలిగే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని, మొక్కలకు అవసరమైన పోషకాలను సమకూర్చి, తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చని డి.రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఎంపిఈఓలు, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దావా సమను

అండర్ ఆర్డర్లు 5 రూల్ 1& 5 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 161/2019

గర్రె కృష్ణమూర్తి .....వాది
వర్సెస్
బోగిశెట్టి వెంకటేశ్వర్లు.....ప్రతివాది
టు
ప్రతివాది: బోగిశెట్టి తండ్రి చిన్నయ్య రిటైర్డ్ ఎంప్లాయి
సాకిన్: 2-4-82/01, కోటగడ్డ వారి వీధి,
గిద్దలూరు టౌన్, ప్రకాశం జిల్లా,

పై నెంబరున వాది దావా పైకముఓరి మీపైన దావా దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో తేది: 27-10-2025 ది పగలు 10గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారాగాని పైకోర్టు వారి ఎదుట హాజరై తెల్పుకొనేది. లేనిచో మిమ్ముమ్మలను ఎక్స్‌పార్టీగా తీర్మానించ బడునని తెలుసుకొనేది.

(By Order of the Court)
వాయిదా తేది: 27-10-2025

కనిగిరి
తేది: 18-10-2025

అబ్దుల్ గఫార్ షేక్..
వాది తరపు న్యాయవాది
కనిగిరి, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

## ఆపరేషన్ సిందూర్ వీరులకు

# 'శౌర్య' పురస్కారాలు!




**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** దేశ రక్షణలో అసాధారణ ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు అందించిన భారత సైనిక దళాల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పురస్కారాలను ప్రకటించింది. ఇటీవల విజయవంతంగా ముగిసిన 'ఆపరేషన్ సిందూర్' సహా పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్న ఆర్మీ, వైమానిక దళాలకు చెందిన పలువురు అధికారులను ప్రతిష్ఠాత్మక 'వీర చక్ర' పురస్కారంతో గౌరవించింది. ఈ మేరకు కేంద్రం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ ఆపరేషన్లలో భాగంగా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన 1988 (ఇండిపెండెంట్) మీడియం బ్యాటరీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిస్త్‌కు వీర చక్ర లభించింది. అలాగే, అత్యంత రహస్యంగా, తక్కువ సమయంలోనే ప్రత్యేక పరికరాలను విమానాల ద్వారా సమర్థంగా తరలించి, సైనిక సామర్థ్యాన్ని చాటిన 302 మీడియం రెజిమెంట్‌కు చెందిన కల్నల్ కోశాంక్ లాంబాను కూడా ఈ పురస్కారం వరించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నుంచి పలువురు అధికారులు వీర చక్రకు ఎంపికయ్యారు. శత్రువుల కట్టుదిట్టమైన గగనతలంలోకి చొచ్చుకెళ్లి, నిర్దేశిత లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించినందుకు ఫైటర్ పైలట్ గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిద్ధూకు ఈ గౌరవం దక్కింది.

ఫార్వర్డ్ ఎయిర్‌బేస్‌లో సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎస్ఏఎం) స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించి, మన వనరులకు ఎలాంటి నష్టం జరగకుండా శత్రువులకు భారీ నష్టం కలిగించిన గ్రూప్ కెప్టెన్ అనిమేశ్ పట్నీ కూడా వీర చక్ర అందుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన మిషన్‌లో భాగంగా, అర్ధరాత్రి వేళ శత్రు భూభాగంలోకి ప్రవేశించి కోటలాంటి లక్ష్యాలను ధ్వంసం చేసిన స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్, సంక్లిష్టమైన వైమానిక దాడిలో అద్భుతమైన సమన్వయం ప్రదర్శించిన స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్‌లకు కూడా వీర చక్ర పురస్కారాలు ప్రకటించారు. మొత్తంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 127 గ్యాలంట్రీ అవార్డులు, 40 విశిష్ట సేవా పురస్కారాలకు ఆమోదం తెలిపారు. వీటిలో 4 కీర్తి చక్రలు, 15 వీర చక్రలు, 16 శౌర్య చక్రలు ఉన్నాయి.



# ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

- ఆ దిశగా ప్రయత్నాలు సాగాలి
- ట్రంప్‌తో ప్రధాని మోడీ ఆకాంక్ష
- ఫోన్‌లో దీపావళి శుభాకాంక్షలు చెప్పిన ట్రంప్
- వైట్ హౌస్‌లోను దీపావళి వేడుకలు
- వాణిజ్య ఒప్పందం వేళ ఆసక్తికర పరిణామం
- సుంకాలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలని, ఈ దిశగా ఉమ్మడి ప్రయత్నాలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు చెప్పినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు అంటూ మోడీ ట్వీట్ చేశారు. "దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు. ఈ దీపావళి పండుగ నాడు రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచాన్ని ఆశతో ప్రకాశింపజేయడం కొనసాగించాలి. అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐకనయంగా నిలబడాలని కోరుకుంటున్నా" అని మోడీ ఆ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామంగా అందించడంలో పేరుగాంచిన పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు ప్రాముఖ్యత సంతరించుకుంది. మంగళవారంనాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోడీకి ఫోన్ చేసిన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. వైట్‌హౌస్‌లో ప్రత్యేక దీపావళి కార్యక్రమంలో ట్రంప్ దీపం వెలిగించి, ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం తాను భారత ప్రధానితో ఫోన్‌లో మాట్లాడానని చెబుతూ, మోడీ గొప్ప స్నేహితుడు అని ప్రశంసించారు. తమ ఇద్దరి మధ్య చాలా మంచి సంబంధం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇకపై ఆయన రష్యా నుంచి పెద్దగా ఆయిల్ కొనుగోలు చేయబోరని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలని నేను ఎంతగా కోరుకుంటున్నానో.. మోడీ కూడా అంతే కోరుకుంటున్నారని అన్నారు. వారు మరీ ఎక్కువగా చమురు కొనడం మానేస్తారు.. రష్యా కూడా యుద్ధం ఆపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే భారత్ భారీగా చమురు కొనుగోళ్లను తగ్గించిందని.. మున్ముందు మరింతగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో నిర్వహించిన దీపావళి వేడుకలలో అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఎఫ్‌బిఐ చీఫ్ కాష్ పటేల్, ఇంటెలిజెన్స్ హెడ్ తులసి గబ్బర్డ్, భారత్‌లో కొత్త అమెరికా రాయబారి సెర్గియో గోర్, భారతీయ అమెరికన్ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించనప్పటికీ.. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ట్రంప్‌కు ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో కూడా ట్రంప్ ఇలాంటి కామెంట్లే చేయగా.. న్యూఢిల్లీ ఆ వ్యాఖ్యలను గట్టిగా తిరస్కరించింది. "భారత్ ఆయిల్, గ్యాస్ ముఖ్యమైన దిగుమతిదారు. అస్థిరంగా ఉన్న ఇంధన పరిస్థితులలో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం మా స్థిరమైన ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ద్వారానే నిర్దేశించబడతాయి" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. తమ ఇంధన విధానాలు కేవలం దేశ అవసరాలు, వినియోగదారుల ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది.

సుంకాలు తగ్గే అవకాశం: దీపావళి శుభాకాంక్షలు చెప్పడానికే ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసినా, వారిద్దరి మధ్య ఎక్కువగా వాణిజ్యంపైనే చర్చ జరిగినట్లుగా సమాచారం. ఈ మేరకు రాయిటర్స్ పేరొనకంది.

తాజా ఫోన్ కాల్ సంభాషణ ప్రకారం రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం జరగవచ్చుని, దీంతో అమెరికా సుంకాలు 16శాతం వరకు తగ్గించవచ్చని రాయిటర్స్ ఆ కథనంలో పేర్కొంది. త్వరలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధాలు కొనసాగిస్తుననందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భారత్‌పై 50శాతం సుంకం అమలవుతోంది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ – అమెరికా బంధం బలపడుతున్నట్లుగా కథనాలు పేర్కొంటున్నాయి. ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం జరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.

# మానాన్న చివరి అంకంలో ఉన్నారు..

## సతీశ్‌జర్కిహోళి పెద్ద బాధ్యతలకు అన్ని విధాలా అర్హుడు

## సిఎం సిద్దరామయ్య తనయుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు



**బెంగళూరు, అక్టోబరు 22:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ భవిష్యత్తుపై ఆయన కుమారుడే చేసిన వ్యాఖ్యలు ఇపుడు కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. తనయుడు యతీంద్ర తన తండ్రిపై చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. తన తండ్రి రాజకీయ జీవితం చివరిదశలో ఉందని కర్ణాటకలో రాజకీయ నాయకత్వాం చేపట్టేందుక సతీశ్ జర్కిహోళి అన్నివిధాలా అర్హుడని ఆయన అన్నారు. యతీంద్ర వ్యాఖ్యలు కర్ణాటకలో నాయకత్వ మార్పు అనివార్యం అని స్పష్టంచేస్తున్నాయని కాంగ్రెస్ వర్గాల్లోనే వినిపిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి తనయుడే ఈ వ్యాఖ్యలుచేయడంతో వీటికి మరింత ప్రాధాన్యం పెరిగింది. బెళగావిజిల్లాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో యతీంద్ర ఈ వ్యాఖ్యలుచేసారు. రాజకీయాల్లో తన తండ్రి చివరిదశలో ఉన్నారని, ఈ సమయంలో బలమైన ప్రగతిశీల భావజాలం కలిగిన నాయకుడు ఆయనకు అవసరమని అన్నారు. అలాంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శకునిగా ఉంటారని అన్నా రు. సతీశ్‌జర్కిహోళికి ఆ లక్షణాలున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు ఆయనే సరైన వ్యక్తి అన్నారు. ఈ గురుతరబాధ్యతలు స్వీకరించేందుకు ఆయన సంసిద్ధులు కావాలని అన్నారు. పెద్ద బాధ్యతలు అంటే సీఎం మార్పునే సూచిస్తున్నా యని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సీఎం మార్పుఅంశంపై సిఎం సిద్ధరామయ్య, డికెశివకుమార్‌మధ్య ఇప్పటికే పరోక్షంగా వాగ్వాదాలు జరుగుతున్నాయి.

ఈ సమంలో సతీశ్‌పేరు తెరపైకి రావడం గమ నార్హం. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యంమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రచారంలో ఉంది. పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆవిధానంపైనే నమ్మకంతో ఉన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రినని ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య చెపుతున్నా తన చేతుల్లో ఏమీలేదని డికెశివకుమార్ చెపుతున్నా ఇప్పటికీ ఊహాగానాలు చెలరేగుతూనే ఉన్నాయి. అయితే సిద్ధరామయ్యను దించితే కర్ణాటకలో పార్టీ రెండుగా చీలిపోతుందని హైకమాండ్ భయపడుతోంది. ఇపుడు హైకమాండ్ నిర్ణయం ఏమిటన్నదే కర్ణాటక కాంగ్రెస్ మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

# శ్వేతసౌధంలో సువిశాలమైన 'బాల్‌రూమ్'

## 999 అడుగుల విస్తీర్ణంలో రూ. 2200 కోట్లతో నిర్మాణం

**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల స్వప్నంగా భావిస్తున్న ప్రాజెక్టును పట్టాలెక్కించారు. శ్వేతసౌధం ప్రాంగణంలో అత్యంత సువిశాలమైన, ఆధునికమైన బాల్‌రూమ్ (నృత్యశాల) నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. వైట్‌హౌస్ తూర్పు విభాగంలో ఈ నిర్మాణం కోసం సోమవారం కూల్చివేతలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగంలో అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నానని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. గత 150 ఏళ్లుగా ప్రతి అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం ఒక పెద్ద బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారని, ఎట్టకేలకు ఆ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభమైందని ఆయన వివరించారు. ఈ ఏడాది జూలైలో ఈ ప్రాజెక్టు గురించి ట్రంప్ మొదటిసారి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ నిర్మాణానికి సంబంధించిన ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుంచి కాకుండా పూర్తిగా దాతలు అందించే విరాళాలతో భరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల అమెరికా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ఆయన పేర్కొన్నారు.

# మసూద్ సోదరి నాయకత్వంలో మహిళా జైషే!



**ముజఫరాబాద్, అక్టోబరు 22:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ తుఫత్ అల్ ముమినాత్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాస్‌లు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు 40 నిమిషాల పాటు మసూద్ సోదరీమణులు, కమాండర్ల కుటుంబ సభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి విరాళాలు కూడా సేకరిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## రష్యా దాడుల్లో చిన్నారులు సహా ఏడుగురు మృతి : జెలెన్‌స్కీ



**కీవ్, అక్టోబర్ 22:** రష్యా తాజాగా చేపట్టిన డ్రోన్, మిస్సైల్ దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని రెండవ పెద్ద నగరమైన ఖార్కివ్‌లో ఉన్న కిండర్‌గార్డెన్‌పై అటాక్ జరిగింది. వరుస దాడుల వల్ల కీవ్‌లో కూడా నష్టం జరిగింది. చిన్నారులతో కలిపి సుమారు 26 మంది గాయపడినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే బుడాపెస్ట్‌లో పుతిన్‌తో జరగాల్సిన భేటీని డొనాల్డ్ ట్రంప్ రద్దు చేసుకున్నారు. ట్రంప్, యూరోప్ నేతలు పిలుపు ఇచ్చినా ఫ్రంట్‌లైన్ వద్ద కాల్పులు ఆగడం లేదని రష్యా పేర్కొన్నది. బ్రియాన్‌స్క్ బోర్డర్ ప్రాంతంలో ఉన్న రష్యా రసాయనిక ప్లాంట్‌పై ఉక్రెయిన్ మిలిటరీ అటాక్ చేసింది. బ్రిటన్ పంపిన స్టార్మ్ షాడో మిస్సైల్‌తో ఉక్రెయిన్ ఆ దాడిలో పాల్గొన్నది. రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఛేధించి ఆ స్టార్మ్ షాడో క్షిపణులు విజయవంతంగా దూసుకెళ్లినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

## వైట్‌హౌస్ భద్రతా గేటును ఢీకొట్టిన కారు



**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద మంగళవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. ఓ వ్యక్తి తన కారుతో నేరుగా వచ్చి భద్రతా గేటును ఢీకొట్టాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భవనం లోపలే ఉన్నారని, దీంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారని యూఎస్ సీక్రెట్ సర్వీస్ వెల్లడించింది. వాషింగ్టన్‌లోని 17వ ఈ స్ట్రీట్స్ కూడలి సమీపంలో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఓ కారు వేగంగా దూసుకొచ్చి వైట్‌హౌస్ ఆవరణలోని సెక్యూరిటీ గేటును ఢీకొట్టింది. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ యూనిఫాం విభాగం అధికారులు ఆ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో వైట్‌హౌస్‌కు ఎలాంటి లాక్‌డౌన్ విధించలేదని అధికారులు స్పష్టం చేశారు. కారును క్షుణ్ణంగా తనిఖీ చేసారు.

## శ్రీలంకలో కౌన్సిల్ ఛైర్మన్ కాల్చివేత!



**కొలంబో, అక్టోబర్ 22:** శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు.

తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని, దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

# శారీరకసంబంధం పదంతో లైంగికదాడిని నిర్ధారించలేం!

## పోక్సో కేసు కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన శారీరక సంబంధం అనే పదం చాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగిక దాడి జరిగిందని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ అలియాస్ భూపిందర్ వర్మ అనే వ్యక్తి తన 16 ఏళ్ల కజిన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిస్సందేహంగా నిరూపించడంలో విఫలమైందని అభిప్రాయపడింది. కేవలం శారీరక సంబంధం అనే పదాన్ని ఉపయోగించడం వల్ల, దానికి సరైన ఆధారాలు లేనప్పుడు, నేరం జరిగినట్లుగా భావించలేమని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లో గానీ, పోక్సో చట్టంలో గానీ ఈ పదానికి నిర్దిష్ట నిర్వచనం లేదని గుర్తుచేసింది. బాధితురాలు శారీరక సంబంధం అని చెప్పినప్పుడు, దాని అర్థం ఏమిటో, అది లైంగిక దాడి కిందకు వస్తుందో లేదో ప్రాసిక్యూషన్ గానీ, ట్రయల్ కోర్టు గానీ స్పష్టత కోరలేదని హైకోర్టు తప్పుబట్టింది. సాక్షుల నుంచి సరైన వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 165ను ఉటంకించింది. ఈ కేసులో ఘటన జరిగిన దాదాపు ఏడాదిన్నర తర్వాత మార్చి 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపైనా హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు విషం తాగిందని, ఆ తర్వాత ఆమెకు మాట పడిపోయిందని, తిరిగి మాట వచ్చిన తర్వాత ఫిర్యాదు చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, ఈ వాదనను బలపరిచే ఎలాంటి వైద్యపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఇంత సుదీర్ఘ జాప్యానికి సరైన కారణాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇది ఒక దురదృష్టకరమైన కేసుఅని వ్యాఖ్యానిస్తూ, ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసింది. నిందితుడిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



## ఎల్వోసి వెంబడి మళ్లీ చురుకుగా ఉగ్రశిబిరాలు!

### హోంశాఖకు నిఘా వేగుల నివేదిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తునాతునకలయిన ఉగ్రవాద స్థావరాలు మళ్లీ జీవంపోసుకుంటున్నాయి. వాస్తవాధీనరేఖ వెంబడి మళ్లీ ఉగ్ర లాంచ్‌ప్యాడ్‌లు, ఉగ్రశిక్షణ శిబిరాలు ప్రారంభం అయినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని భారత సరిహద్దుప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నట్లు తేలింది. చిన్నచిన్న క్లాసులు రూపంలో వీటినినిర్వహిస్తున్నారు. అయితే సాంకేతికతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. తద్వారా ఈ శిక్షణా శిబిరాలు డ్రోన్ నిఘాలను, వైమానిక దాడులను సైతం తప్పించుకునేదిశగా ఈ శిబిరాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖకు అందిన నిఘా నివేదికల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులకు సరిహద్దుల్లో శిక్షణ జరుగు తోందని, ఎంతమేర ఈశిబిరాలు విధ్వంసం చేసినా మళ్లీ పురుడు పోసుకుంటున్నాయని తెలిపింది. దీనితో ఇపుడు హోంశాఖ అన్ని దళాలను అప్రమత్తంచేసి వ్యూహాత్మక కసరత్తును సిద్ధంచేసుకోవాలని సూచించింది. సరిహద్దుల్లో ఇప్పటికీ ఉగ్రముప్పు దాగి ఉన్నందున మరింత నిఘాను పెంచుకోవాలనిసూచించింది. లూని, పుత్వాల్, టిపు పోస్ట్, జామిల్‌పోస్ట్, ఉమ్రాన్ వాలి, చాప్రార్ ఫార్వార్డ్, ఛోటా చక్, జంగ్లోరా ప్రాంతాల్లో ఉగ్రశిబిరాలు మళ్లీ చురుకుగా పనిచేస్తున్నాయని నిఘా వర్గాలు హోంశాఖకు నివేదిక ఇచ్చాయి. భద్రతా దళాలు వీటిని నిర్మూలించడానికిసైతం వీలులేని విధానంలో శిక్షణ ఇవ్వడం అక్కడి నుంచి కనుమరుగవడంచేస్తున్నాయని తేలింది.



## సెర్బియా పార్లమెంట్‌పై ఉగ్రదాడి

- కాల్పులు.. టెంట్ దగ్ధం
- ఓ అనుమానితుడు అరెస్టు

**బెల్‌గ్రేడ్ (సెర్బియా), అక్టోబరు 22:** సెర్బియా పార్లమెంట్ వద్ద కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఒకరు గాయపడ్డారు. అలాగే అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ మద్దతుదారులకు చెందిన టెంట్‌కు నిప్పు పెట్టారు. భద్రతా అధికారుల సమాచారం ప్రకారం, పార్లమెంట్ వెలుపల కాల్పులు చోటుచేసుకున్నాయని, అదే సమయంలో టెంట్ అగ్నికీలలో దగ్ధమైంది. కాల్పుల్లో 57ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన సాయుధ భద్రతా దళం ఘటనా స్థలంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. దాడికి ఎవరు పాల్పడ్డారన్నది తెలియడం లేదు. ఘటనను ఉగ్రవాదచర్యగా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ అభివర్ణించారు.

# తమిళనాడులో భారీ వర్షాలు

## లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు



**చెన్నై, అక్టోబరు 22:** తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# కన్నతల్లిని హత్యచేసిన కసాయి

**చండీగఢ్, అక్టోబరు 22:** దేశమంతా దీపావళి సంబరాల్లో మునిగివున్న వేళ చండీగఢ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తన తల్లిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం సెక్టార్ 40లో నివసిస్తున్న 60 ఏళ్ల సుశీల అనే మహిళను ఆమె కొడుకు రవీందర్ నేగి అలియాస్ రవి (40) కత్తితో పొడిచి చంపాడు. దీపావళి రోజు ఉదయం 7 గంటల సమయంలో సుశీల ఇంట్లో నుంచి గట్టిగా కేకలు వినిపించాయని పొరుగున ఉంటున్న ఆకాశ్ బెయిన్స్ పోలీసులకు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికి ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. వారు టెర్రస్ పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి చూడగా, రవి చేతిలో కత్తితో పారిపోవడం కనిపించింది. లోపల సుశీల రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

23-10pg6exHMNWJQE 10_23-10pg6exHMNWJQE.qxd 10/22/2025 10:52 PM Page 1





తడ మండలం చేనిగుంట వద్ద మునిగిన పంట పొలాలు

# తడలో కుండపోత

**మునిగిన పంటపొలాలు... రైతులకు తీవ్రనష్టం**

తడ, అక్టోబరు 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తడ మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. తీరప్రాంత గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి. మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. బుధవారం ఇక్కడ 97.8 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. తడ మండలంలో ప్రతిరోజు జల్లులుగా వర్షం కురుస్తుంది. ఈ వాన వలన ముందుగా వేసుకున్న ఎలిది పైర్లు మునిగిపోయాయి. వరినాట్లకు, పొలాల దుక్కులు వేసుకునేందుకు అంతరాయం కలిగింది. రైతులు నిన్నమొన్నటి దాకా పొలాల్లో నీటి కోసం అల్లాడితే, ప్రస్తుతం ఆ నీటిని వెలికి తీసేందుకు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు పులికాట్ సరస్సు నిండుకుండలా మారింది. జాలర్లు పడవలు ఎక్కడ రేవుల్లో అక్కడ భద్రపరుచుకున్నారు. చేపల వేటకు వెళ్లి వారం రోజులైంది. ఈ వర్షం మరో మూడురోజులు కొనసాగుతుందని వాతావరణ హెచ్చరికలు మరింత భయపెడుతున్నాయి. తిరుపతి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు అప్రమత్తమై కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని తెలుసు కుంటున్నారు. గ్రామాల్లో పనిచేసే విఆర్ఓలు, సెక్రటరీలు కూడా వరద పరిస్థితిని అధికారులకు తెలియజేస్తున్నారు. పలుచోట్ల పక్కాగృహాలు ఉరుస్తు న్నాయి. వాటంబేడు, గ్రద్దగుంటల మధ్య కాళంగి నది వద్ద విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది. జోరువానలోను సిబ్బంది వీటిని సరిదిద్ది మళ్లీ విద్యుత్ సరఫరా ఇస్తున్నప్పటికీ ఎప్పుడు వస్తుందో రాదో తెలియక ఆ మధ్యలోని కనీసం పది గ్రామాల ప్రజలు సతమతమవు తున్నారు. బుధవారం కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వతంగా పరిష్కరించాలని తడ మండల ప్రజలు కోరుతున్నారు.


# కుప్పంలో అలీప్, ఫ్రంటైయర్

**● కడతో ఒప్పందాలు... త్వరలో పరిశ్రమలు ● మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అడుగులు ● సిఎం చంద్రబాబునాయుడు చొరవతో చకచకా చర్యలు**

కుప్పం, అక్టోబరు 22 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నుంచే శ్రీకారం చుడతామని ప్రకటించిన సిఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందితే వారి కుటుంబాలు కూడా బలోపేతం అవుతాయని భావించి కుప్పంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలోనే కుప్పం నియోజకవర్గంలో హైదరాబాద్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్యూనర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సంస్థ, రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఫ్రంటైయర్ మార్కెట్ సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. ఈసంస్థలు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అలీప్ సంస్థ కుప్పంలో ఇదివరకే ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు వారు ఏర్పాటు చేయదలచుకున్న పరిశ్రమలకు సంబంధించి వారికి శిక్షణ కల్పించడంతో పాటు హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ విజిట్‌ను క్షేత్రస్థాయిలో నిర్వహించి కుప్పం ప్రాంత మహిళలకు పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కాగా అలీప్ సంస్థ కుప్పంలోనే రూ.26.7కోట్ల పెట్టుబడులతో ఇండస్ట్రియల్ పార్క్ (మహిళాశక్తి భవన్) నిర్మాణంకు ముందుకు వచ్చింది. ఈ సంస్థ కార్యకలాపాలు మొదలైతే 3500మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఇక దేశంలో ఇ-కామర్స్ రంగంలో పేరుపొందిన ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ కూడా కుప్పంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఈ సంస్థ గ్రామీణ ప్రా ంత మహిళలకు డిజిటల్ వ్యాపార నిర్వహణపై శిక్షణ ఇచ్చి వారి ద్వారానే ఆర్థిక కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ప్రజలకు అవసరమైన చిన్న వస్తువులు మొదలు ల్యాప్‌టాప్‌ల వరకు ఈ సంస్థ ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకే మేరీ సహేలీ యాప్ ద్వారా అందుబాటులో తెచ్చింది. తద్వారా ఈయాప్ నుంచి వివిధ రకాల వస్తువులు తక్కువ ధరలకే కొనుగోలు చేయడంతో పాటు వీటిని ఆర్డర్ చేస్తున్న మహిళలకు కూడా ఆర్థికంగా తోడ్పాటు లభిస్తోంది. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చిరువ్యాపారాలు నిర్వహించుకునే మహిళలకు కూడా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో ఇ-సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు. మార్కెట్లో 35-40వేలధర పలికే ఇ-సైకిల్‌ను రూ.9600లకే అందించడం జరుగుతోంది. తద్వారా గ్రామీణ మహిళలు ఈ సైకిళ్ల ద్వారా గ్రామాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా కుప్పం ప్రాంతంలో మహిళల ఆర్థికాభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారనే చెప్పాలి.

## తూపిలిపాలెం వద్ద ఎగసిపడుతున్న అలలు



వాకాడు, అక్టోబరు 22 ప్రభాతవార్త: తూపిలిపాలెం వద్ద ఎగసిపడుతున్న అలలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం తూపిలి పాలెం బంగాళాఖాతం సముద్ర తీరములో ఎగసిపడుతున్న అలలను పరిశీలించారు. తీర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ తెలిపారు. అవసరమైతే మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఆయా పంచాయతీలలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎడతెరిపి లేకుండా పలుచోట్ల జడివాన కురుస్తోంది. ముందస్తుగా లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధించిన అధికారులను తహసీల్దార్ కోరారు. అన్ని పంచాయతీలలో రోడ్లు, విద్యుత్తు, ఉండాలని ఆయా సంబంధించిన అధికారులను కోరారు. సముద్రం ముందుకు వచ్చిన వెంటనే సంబంధించిన అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కోటి బిల్వార్చనకు పూజాసామగ్రిని తీసుకు వస్తున్న డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి

## శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన

శ్రీకాళహస్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. సహస్రలింగేశ్వరుని సన్నిధి వద్ద కైలాసగిరి కొండకోనల్లోంచి తెచ్చిన బిల్వాలతో స్వామికి అర్చన చేయటం. అలాగే దాతలు, దేవస్థానం భాగస్వామ్యంతో అందుబాటులో ఉంచిన కుంకుమలతో పూజలు ప్రారంభించారు. ఉదయం ఆలయంలోని సహస్రలింగేశ్వరాలయం వద్ద డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి హాజరు కాగా ఆలయ ప్రధానార్చకులు నిరంజన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి పర్యవేక్షణలో కోటి బిల్వార్చన, కుంకుమార్చనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సహస్రలింగేశ్వరుని ఆలయం ఎదురుగా కలశ స్థాపన గావించారు. స్వామి అమ్మవార్లను ఆవాహన గావించుటకు వేదమంత్రాలను పఠించారు. దీక్షాధారణ గావించారు. తరువాత వేదపండితుల వేద మంత్రాలతో ఆలయం దద్దరిల్లింది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చనలకు సంబంధించి పౌరోహితులు అర్ధగిరి స్వామి వివరిస్తూ స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చనలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఈ పూజలు 27 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. బహుళ చతుర్థశి అమావాస్య సందర్భంగా ముగిస్తుందన్నారు. ఆ రోజు ఆలయంలో సహస్ర శంఖాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ పూజల్లో భక్తులు కూడా భాగస్వామి కావచ్చునని వివరించారు.



## శివయ్య సన్నిధిలో ఢిల్లీ హోం మంత్రి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం న్యూఢిల్లి హోం శాఖ మంత్రి ఆశిష్‌సూద్ కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. మంత్రి ఆశీష్ సూద్ కుటుంబసభ్యులతో ఆలయానికి రాగా రాగా దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి వేదపండితులచే స్వాగతం పలికారు. మంత్రి తాను ఇక్కడ నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ప్రత్యేక విఐపి టిక్కెట్టులో వేదపండితులచే పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజల అనంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను ఆలయ ఇఓ బాపిరెడ్డి అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.



జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని సమీక్ష

## విద్యార్థినుల బాత్‌రూమ్‌లో సిసికెమెరాలు దోషులకు శిక్షపడేలా చర్యలు

**జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని**

చిత్తూరు, అక్టోబరు 22 ప్రభాతవార్త: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో విద్యార్థినిల బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాల వ్యవహారంపై బుధవారం జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యురాలు భారతి సాయని అపోలో యూనివర్సిటీలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సాయని మాట్లాడుతూ ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసు విచారణ సాగుతోందని, దోషులను తొందరగా న్యాయస్థానం ముందు నిలిపి శిక్షపడేలా చేయాలని పోలీసులను కోరామన్నారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా మానవ హక్కుల ఉల్లంఘన కింద సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి ఇక్కడికి వాస్తవాలు తెలుసుకోవడం కోసం విచారణకు వచ్చామన్నారు. ఈ ఘటనకు సంబంధించి తాను విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడగా ఎలాంటి సమస్యలేవని చెప్పడం జరిగిందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అధికారులు ఎస్.జ్యోతి, హరినాథ్‌రెడ్డి, అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పోతురాజు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌కుమార్‌రెడ్డి, డిఎస్పీలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పండుగల వేళ రైలు ప్రయాణికుల రద్దీ

# సమన్వయంతో నియంత్రణ

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 22 ప్రభాతవార్త: దసరా, దీపావళి, ఛాట్ పండుగల సమయంలో రైలు ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు రైల్వే డివిజన్ వివిధ విభాగాల సమన్వయంతో సమర్థవంతంగా నియంత్రించిందని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిసిఎంఎస్ మనోజ్ తెలిపారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 22 నాటికి దసరా, దీపావళి, ఛాట్ పండుగల సందర్భంగా గుంతకల్లు డివిజన్ 66 ప్రత్యేక రైళ్లతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి డివిజన్‌కు వచ్చిన 12 రైళ్లతోపాటు, గుంతకల్లు డివిజన్ మీదుగా వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే మరో 54 రైలు సర్వీసులలో ప్రయాణీకులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గట్టిచర్యలు తీసుకున్నామని వివరించారు. ఛాట్ పూజాను పురస్కరించుకుని 54 ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి డివిజన్‌కు వచ్చే మరో తొమ్మిది రైలు సర్వీసులను, గుంతకల్లు డివిజన్ మీదుగా వివిధ ప్రాంతాలమధ్య రాకపోకలు సాగించే మరో 45 రైలు సర్వీసులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణీకులకు ప్రయాణ వసతిని కల్పించడానికై వివిధ రెగ్యులర్ రైళ్లకు అదనపు బోగీలను జోడించినట్లు తెలిపారు. ప్రధాన స్టేషన్లలో చేపట్టిన సమగ్ర రద్దీ నియంత్రణ, మౌలిక సదుపాయాలు కల్పన, సౌకర్యాల చర్యల గురించి వారు వివరించారు. తిరుపతి, రాయచూరు, గుంతకల్లు ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌లపైకి రద్దీ నియంత్రిణ చర్యలో భాగంగా హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ హోల్డింగ్ ప్రాంతాలలో తగినంత సీటింగ్, లైటింగ్, తాగునీరు, టాయిలెట్

డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని ప్రధాన స్టేషన్లలో సి.సి. కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బుకింగ్ కౌంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. రద్దీ రోజులలో స్టేషన్లలో రేయింబవళ్ళు పర్యవేక్షణ కోసం ఆపరేటింగ్, కమర్షియల్, ఆర్.పి.ఎఫ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ సిగ్నల్, టెలికాం వంటి విభాగాల నుండి అధికారులు, సూపర్‌వైజర్లతో కూడిన సంయుక్త బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఐఆర్‌సిటిసి సమన్వయంతో ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ సేవలను ఏర్పాటు చేయడమైనది. అధిక చార్జీలు, అనధికార విక్రయాలు మొదలైన కేసులను నివారించడానికి తనిఖీలు నిర్వహించామని ఆయన తెలిపారు. రద్దీ నియంత్రణ చర్యలు, ప్రయాణీకుల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు మొదలైన వాటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రయాణీకులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో పిఆర్ఐ హేమంత్‌కుమార్, సిసిఐలు హరిబాబు, కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## శివయ్య సేవలో సినీ నటులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో బుధవారం సినీనటులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైకాపా శ్రేణులు స్వాగతం పలికారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజా, రవళి కుటుంబసభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేదపండితుల తో ఆశీర్వదించారు. వారికి వైకాపా శ్రేణులు అంజూరు తారక శ్రీనివాసులు, లోకేష్ యాదవ్, శ్రీవారి సురేష్, తేజ రాయల్, ప్రసాద్, చందు స్వాగతం పలికారు.



## రికార్డ్ స్థాయిలో వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1,87 కోట్లు

ఉమ్మడి తూర్పగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22 ప్రభాతవార్త: ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధిచెందిన కోనసీమ తిరుమల, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ1,87,33,329ల ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, కార్య నిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి, డి.సురేష్ బాబు, తనిఖీ అధికారి జె. రామలింగేశ్వరరావు, గ్రూపు దేవాలయాలు కార్యనిర్వహణాధికారి పివివిఎస్ కామేశ్వరరావులు పర్యవేక్షణాధికారులుగా హుండీల లెక్కింపు చేపట్టడం జరిగిందని తెలిపారు. 35 రోజులకు ఆదాయం లెక్కించగా ఆలయ ప్రధాన హుండీల నుండి నగదు రూ.1,41,69,487లు. అన్నదానం రూ.45,63,842 కలిపి మొత్తం రూ.1,87,33,329 సమకూరిందని తెలిపారు. అలాగే బంగారం 47 గ్రాములు, వెండి కేజీ. 240 గ్రాములతో పాటు 6 దేశాల విదేశీ కరెన్సీ 25 నోట్లు వచ్చాయని ఆలయ డిప్యూటీ కమిష నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాం బాబు, వర్మ, మనోజ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వై శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, నారాయణ, కనకయ్య, ప్రసాద్, ఏపుగంటి వెంకటేష్, గ్రామస్తులు, దేవస్థానం సిబ్బంది, గోదావరి గ్రామీణ బ్యాంకు, కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో ప్రజల్లో సంతృప్తి

**● అభివృద్ధి, సంక్షేమంపై ఆనందోత్సాహాలు ● ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి: మంత్రి పార్థసారథి**

విజయవాడ, అక్టోబరు 22 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రాష్ట్ర ప్రజల్లో 75 శాతం మందికి పైగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైనట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నాడి, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించడం జరుగుచున్నదని తెలిపారు. మిగిలిన 25శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నా మని, నూటికి నూరు శాతం కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో ప్రజల సంతృప్త స్థాయి 75 శాతంకు పైగా ఉండటం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారన్నారు. అయితే నూటికి నూరు శాతం సంతృప్త స్థాయి చేరేవరకు కృషి చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రజల అసంతృప్తికి కారణాలు తెలుసుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మిగిలిన అసంతృప్తికి కారణాలు అధికారుల వైఫల్యమా, ప్రజాప్రతినిధుల వైపల్యమా తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పార్థసారథి తెలిపారు. విద్యుత్ వినియోగంలో లోఓల్టేజీ, విద్యుత్



కోతలు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. సబ్ స్టేషన్ ఒక యూనిట్‌గా తీసుకుని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.7.65 లక్షల కోట్ల పైబడి పెట్టుబడులు రాష్ట్రానికి రావడం జరిగిందని, తద్వారా 182 ప్రాజక్టుల్లో 7.21 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం రాకపోయినా త్యాగం చేసి మరీ ఉచిత ఇసుక అందిస్తున్నామన్నారు. అలాగే హౌసింగ్‌లో ఏ విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, హౌసింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా 741 సర్వీస్‌లు అందుబాటులోకి మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, కాని ప్రజలు ఆశించినంత స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని సీఎం చంద్రబాబు సమీక్షలో గుర్తించారన్నారు. ఈ సేవలను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షాకాలంలో పిడుగులు పడే ప్రాంతాలు, భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్‌లు ప్రజలకు చేరవేయడంలో ముందున్నామన్నారు. తుఫాన్ ప్రభావంకు గురయ్యే ప్రాంతాలను సైతం ఖచ్చితత్వంతో కూడిన సమాచారం అందిస్తున్నామన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఆ సేవలు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకు పైగా డ్రోన్లను వినియోగించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలకు 64,759 గంటలు, ప్రైవేట్ గా 1,45,288 గంటలు వినియోగించడం జరిగిందన్నారు. అలాగే పంట పోలాలకు పురుగు మందులు పిచికారి చేయడానికి లక్షన్నర కు పైగా గంటలు వినియోగించినట్లు వివరించారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేయడం వలన ఎంత మేర ప్రయోజనం చేకూరిందన్న అంశంపై గణన జరుగుతుందన్నారు. డ్రోన్ల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూల్‌లో తయారైన డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించామని, వాటి పనితీరు భేష్ అని సాక్షాత్తు ప్రధాని మోడీ మెచ్చుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తుచేశారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్బన్ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, మరిన్ని దరఖాస్తులు వస్తే ఇంకా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహాలు లేనివారు నవంబర్ 5 లోపు అర్బన్ హౌసింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పార్థసారథి కోరారు.



## కోనలో వైభవంగా లక్ష్మీనరసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

రాపూరు (నెల్లూరు), అక్టోబరు 22 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి బుధవారం స్వర్ణ గరుడోత్స వ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్ణ గరుడ వాహనం పై స్వామివారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్స వం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్స వంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులున్నారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

23-10Pg7exHMNWJQE 11_23-10Pg7exHMNWJQE.qxd 10/22/2025 11:33 PM Page 1





శ్రీమల్లేశ్వరస్వామికి సహస్ర లింగార్చన ప్రత్యేక పూజలు

## కార్తీకమాస పూజలు షురూ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 22 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. బుధవారం ప్రారంభమైన ఈ సేవలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు.

### దుర్గమ్మ గుడిలో మరిన్ని సౌకర్యాలు

శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పెరిగిన భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో వున్న అన్ని ప్రధాన పనులపై నివేదికను దేవదాయ శాఖ కమీషనర్‌కు అందించాలన్నారు. కాంట్రాక్టర్లను సంప్రదించి ఎప్పటికి పనులు పూర్తవుతాయనే నివేదికను సిద్ధం చేయాలని, త్వరలో జరగబోయే సమీక్షలో దేవదాయ శాఖ మంత్రికి వివరాలు తెలపాలన్నారు.



శృంగేరి పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతి స్వామిని ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

# నిరక్ష్యానికి చోటు లేదు

● వసతిగృహాలలో పిల్లల భద్రతపై జిల్లా కలెక్టర్ హెచ్చరిక ● విచారణలో నిరక్ష్యం.. హాస్టల్ సంక్షేమ అధికారి ఉమాదేవి సస్పెన్షన్

ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 22 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పిల్లల సంరక్షణ, భద్రత విషయంలో పూర్తి అప్రమత్తత పాటించాలంటూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నగరంలోని ఒక వసతి గృహంలో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర విచారణ చేపట్టగా, విచారణలో హాస్టల్ సంక్షేమ అధికారి ఉమా దేవి విధుల్లో నిరక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ కావడంతో, ఆమెను తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ వసతి గృహాల పిల్లల భద్రత, రక్షణ



అంశాల్లో ఎవరైనా నిరక్ష్యంగా వ్యవహరించినా, కఠినచర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రతి వసతి గృహ వార్డెన్ తమ పరిధిలోని పిల్లల సంరక్షణలో సంపూర్ణ బాధ్యత వహించాలని, అప్రమత్తతతో వ్యవహరించాలని, భద్రత పరమైన చర్యలు పాటించాలి," అని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వసతి గృహాల నుండి పిల్లలను పంపించే ముందు, వారి బంధువుల వివరాలు, గుర్తింపు ఆధారాలు పూర్తిగా నమోదు చేయడం తప్పనిసరి అని ఆమె స్పష్టం చేశారు. భద్రతా చర్యలు పాటించడంలో ఏ చిన్న లోపమూ చోటు చేసుకోరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత అధికారులు, సిబ్బంది ఈ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు సంబంధించి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు.

## హెచ్‌ఎంగా ఎస్జీటీ, వార్డెన్‌గా వాచ్‌మెన్

సిర్పూర్ ఆశ్రమ పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట




**సిర్పూర్(టీ),అక్టోబరు 22, ప్రభాతవార్త:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్ఎం మంజూరు ఉన్నచోట హైస్కూల్‌లో ఒక ఎస్జీటీకి ఇన్చార్జి హెడ్ మాస్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌గా బాధ్యతలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉంటే వార్డెన్ మంజూరు ఉన్న పోస్టులో వాచ్ మెన్‌ను ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పారు. గిరిజన విద్యార్థుల పట్ల, గిరిజన విద్యా పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నిబంధ నలకు విరుద్ధంగా వీరిని నియమించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 260 మంది గిరిజన విద్యార్థినులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉండగా ఒక ఎస్జీటీకి హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పజెప్పడం ఎంతవరకు సమంజమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై జిల్లా గిరిజన అధికారిని ప్రభాత వార్త వివరణ కోరగా ఇది మాకేం కొత్త కాదు, కొన్నిచోట్ల ఎస్జీటీని హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా నియమించిన దాఖలాలు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఎవరు ముందుకు రాకపోతే ఎస్జిటికీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. త్వరలోనే హెడ్ మాస్టర్‌ను నియమిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెడ్‌మాస్టర్ డిప్యుటేషన్‌పై తిర్యానికి పంపించడం జరిగిం దన్నారు. ఇకనైనా రెగ్యులర్ అర్హత కలిగిన హెడ్ మాస్టర్‌ను, వార్డెన్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ముక్త్యాల పంచాయితీ నిధుల దుర్వినియోగంపై మండలాభివృద్ధి కార్యాలయంలో ప్రశ్నిస్తున్న గ్రామ యువత

## నిధుల దుర్వినియోగంపై నివేదిక ఏదీ?

### ఎంపిడిఓని నిలదీసిన ముక్త్యాల యువత

జగ్గయ్యపేట, అక్టోబరు 22 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల (ముక్తేశ్వరపురం) గ్రామ పంచాయితీలో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని పలు ఆధారాలతో గ్రామ యువత, ప్రజానీకం ప్రభుత్వానికి ఫిర్యాదుచేసినా స్పందన లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధుల సద్వినియోగంలో గ్రామ కార్యదర్శి, సర్పంచ్ బాధ్యత వహించాల్సి ఉంది. అయితే దాదాపు రూ.1.50 కోట్లకు పైబడిన నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. దీంతో జులై 14న డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్‌కు గ్రామ యువకులు ఫిర్యాదుచేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆగస్టు 13న విచారణ జరిపారు. అనంతరం 30 రోజుల్లో ఫిర్యాదుదారులకు విచారణ నివేదిక వివరాలు అందజేస్తామని జగ్గయ్యపేట ఉప మండల పరిషత్ అధికారి పద్మావతి హామీ ఇచ్చినట్లు యువకులు మీడియాకు తెలిపారు. ఇప్పటికి 70 రోజులవుతున్నా తుది నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేస్తూ అవినీతి చేసిన వారికి సహకరిస్తున్నారంటూ యువకులు ధ్వజమెత్తారు. బుధవారంతో అధికారి ఇచ్చిన గడువు పూర్తికాగా నివేదిక ఇవ్వాలని తాము కోరగా ఉప మండల పరిషత్ అధికారిణి ఈనెల 30వ తేదీన ఇస్తానంటూ మరో వారం రోజుల గడువు పెంచారని ఫిర్యాదిదారు నాగుల్‌మీరా తెలిపారు. 30వ తేదీకైనా నివేదిక ఇవ్వకుంటే తాము గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అవినీతి చేసిన సొమ్ము అంతా పంచాయితీ ఖజానాలోకి చేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కాగా ఈ కార్యక్రమంలో నాగుల్‌మీరాతోపాటు షేక్ అక్బర్, షేక్ షకీల్, షేక్ అల్లాభక్షు, దస్తగిరి, గోపి, సిలార్, షఫీ, లాలు కూడా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరో సైబర్ మోసం
### 70 యేళ్ల వృద్ధుడికి రూ.93 లక్షలు టోకరా

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు పదే పదే చెబుతున్నా నిత్యం ఈ తరహా మోసాలు జరుగుతూనే వున్నాయి. ట్రేడింగ్ పేరిట 70 ఏళ్ల వృద్ధుడికి సైబర్ నేరగాళ్లు ఏకంగా 70లక్షల రూపాయల టోకరా వేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూసింది. గత జూలై 17న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టా క్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో వాట్సాప్‌లో వచ్చిన సమాచారంతో మేడ్చల్‌కు చెందిన ఓ వృద్ధుడు స్పందించాడు. మొదట రాజ్‌కుమార్ పేరిట ఒ క నేరగాడు ఆ తరువాత నిఖిత పేరిట ఇంకో నేరగత్తె తనతో మాట్లాడి పలుమార్లు 93 లక్షల ఏడువేల రూపాయలను కాజేశారని బాధితుడు పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17వ తేదీన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబ ట్టారు. ఈ కేసులో నగదు బదిలీపలు ఖాతాల నుంచి జరిగినట్లు పోలీసులు గుర్తించారు. అసలు నేరగాళ్లు విదేశాల్లో వుండి వుంటారని భావిస్తున్నారు.

## గంజాయి స్మగ్లర్లపై ఈగల్ దాడి
### 300 కిలోమీటర్లకు పైగా ఛేజింగ్

తెలంగాణ నుంచి ఝార్ఖండ్ వరకు వెంటాడి పట్టివేత



ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్లు. వారి వద్ద లభ్యమైన గంజాయి

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ (పూర్వపు టి.నాబ్) మరోసారి భారీ ఆపరేషన్ చేబట్టింది. ఈ సందర్భంగా 500 కిలోల గంజాయితో పాటు ముగ్గురు అంతరాష్ట్ర నేరగాళ్లను పట్టుబడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డిజి సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషా నుంచి తెలంగాణ మీదుగా యుపిలోని వారణాసికి 500 కిలోల గంజాయిని ట్రక్కులో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు మొదట ఖమ్మం సరిహద్దుల్లో నిఘా వుంచారు. ఈగల్ పోలీసులతో పాటు ఖ మ్మం పోలీసులు కూడా వున్నారు. పోలీసులు తమ ను గమనిస్తున్నారని అనుమానించిన గంజాయి స్మగ్లర్లు తమ వాహనాన్ని దారి మళ్లించి ఛత్తీస్ ఘడ్ నుంచి ఝూర్కండ్ వైపు మళ్లించారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు ఈ విషయాన్ని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఝూర్కండ్ పో లీసులకు సమాచారంఅందించి స్మగ్లర్లను పట్టుకోవాలని కోరారు. మంగళవారం రాత్రి ఖమ్మం సరిహద్దుల నుంచి ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఝూర్కండ్‌కు 300 కిలోమీటర్లకు పైగా స్మగ్లర్ల వాహనాన్ని వెంబ డించిన ఈగల్ పోలీసులు నేరగాళ్లను రాంచి సమీపంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా 500 కిలోలతో వెళుతున్న గంజాయివాహనంతోపాటు స్మగ్లర్‌గా వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరియాణాకు చెందిన నసీం ఖుద్ముద్దీన్‌ను, అతని వద్ద గంజాయి కొనేందుకు రాంచి వద్దకు వచ్చిన హరి యాణాకు చెందిన ముస్తాక్ ఖాన్, ఆరిఫ్‌లను అరెస్టు చేశారు. వీరిద్దరు కొంతకాలంగా వారణాసిలో వుంటున్నారు. కాగా గం జాయితోపాటు డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఈగల్ డిజి సందీప్ శాండిల్యా కోరారు.

# పండుగులకు 12వేల ప్రత్యేక రైళ్లు

### జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 22 ప్రభాతవార్త :** పండుగల వేళ స్పెషల్ ట్రైన్స్ దసరా, దీపావళి, ఛట్ పూజ పండగల సందర్భంగా రైల్వేల్లో రద్దీ సహజంగానే పెరుగుతోందని ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 12,011 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోందని దక్షిణ మధ్య రైల్వే సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లన్నీ 21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 వరకూ నడుస్తాయన్నారు. ఇందులో దక్షిణ మధ్య రైల్వే 973 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోందన్నారు. 21 సెప్టెంబర్ నుంచి 30 నవంబర్ మధ్యన వివిధ జోన్లకు సంబంధించిన స్పెషల్ ట్రైన్స్ తో కలిపి మొత్తం 2,285 రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణిస్తున్నాయన్నారు. గతేడాది ప్రయాణించిన 1,924 రైళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం 19 శాతం ఎక్కువగా ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని తెలిపారు. ఈ రైళ్లన్నీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే తెలం గాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని చెప్పారు. 21 సెప్టెంబర్, 20 అక్టోబర్ మధ్య నెల రోజుల సమయంలో దక్షిణ మధ్య రైల్వే పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన అదనపు రైళ్లతో కలిపి మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లను నడిపిందిని చెప్పారు. ఇందులో 399 రైళ్లను జోన్ పరిధిలో నడపగా, 611 రైళ్లను ఇతర జోన్లకు నడిపింది. ఇవి గతేడాది ఇదే సమయంలో నడిపిన 684ప్రత్యేక రైళ్లతో పోలిస్తే 47 శాతం ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం సాగించిన రోజువారీ రైళ్లతోపాటుగా ఈ స్పెషల్ ట్రైన్స్ సేవలను దాదాపు 5కోట్ల మంది సద్వినియోగం చేసుకున్నారు. గతేడాది ఈ పండుగల సమయంలో 1అక్టోబర్, 2024 నుంచి 31అక్టోబర్, 2024 వరకు దాదాపు 4.5 కోట్లమంది దక్షిణమధ్య రైల్వేస్పెషల్ ట్రైన్స్, రెగ్యులర్ ట్రైన్స్ సేవలను పొందారని వెల్లడించారు.

# నీరజ్‌చోప్రాకు 'లెఫ్టినెంట్ కల్నల్ హోదా'



**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భార తీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతం లో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న, అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టిం చారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకు న్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు. పట్టుదలకు, క్రమశిక్షణకు నీరజ్ ఆదర్శ ప్రాయుడన్నారు.


# జీవికా దీదీలకు 30 వేల జీతం



ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం

### కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తాం
### ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ హామీ
### కూటమిలో ఎలాంటి విభేదాల్లేవని స్పష్టీకరణ

**పాట్నా, అక్టోబరు 22:** బీహార్‌లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ జీవికా సీఎం దీదీలకు నెలకు రూ.30 వేలు జీతంతో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. బుధవారం పాట్నాలో తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తే జీవికా దీదీ (కమ్యూనిటీ మొబిలైజర్లు)లను పర్మినెంట్ చేస్తామని, జీతాలు పెంచుతూనే ప్రభుత్వ ఉద్యోగి హోదా ఇస్తామని హామీనిచ్చారు. ఈ ప్రభుత్వంలో జీవికా దీదీలకు అన్యాయం జరిగిందని అందరికీ తెలుసు. వారి జీతం నెలకు రూ.30 వేలకు పెంచాలని నిర్ణయించాం. ఇది సాధారణ ప్రకటన కాదు, ఇది జీవికా దీదీల డిమాండ్ అని పేర్కొన్నారు. ఇది ప్రజల దీర్ఘకాల డిమాండ్ అని తెలిపారు. జీవికా దీదీలకు అదనపు అలవెన్స్ రెండు వేలతో పాటు ఆ క్యాడర్‌కు రూ.5లక్షల బీమా కల్పించనున్నట్లు చెప్పారు. అంతేగాకుండా రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరికీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని తేజస్వి ప్రకటించారు. ఎన్నికల అజెండాను ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ వెల్లడించారు. సీట్ల పంపకం విషయంలో మహాఘట్‌బంధన్‌లో ఎటువంటి విభేధాలు లేవని, గురువారం అన్ని సమాధానాలు దొరుకుతాయని తేజస్వి యాదవ్ అన్నారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయిందని, అక్టోబర్ 24 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. "నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ప్రచారం కోసం సమయం ఆసన్న మైంది. ఈసారి, బీహార్ ప్రజలు మార్పు కోరు కుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బీహార్ ప్రజలు విసుగు చెందారు. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అవినీతి, నేరాలు పెరిగాయి. నిరుద్యోగం, వలసలతో బిహారీలు విసుగు చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మేం గతంలో ఇచ్చిన హామీలను కాపీ చేస్తోంది" అని తేజస్వి యాదవ్ విరుచుకుపడ్డారు.



# ఆర్థర్ రోడ్డు జైలు.. బ్యారక్ నంబరు 12

### మెహుల్ చోక్సీని ఉంచే సెల్, బెల్జియం కోర్టుకు సిబిఐ నివేదిక

**ముంబయి, అక్టోబరు 22:** పిఎన్‌బి కేసులో రెండో ప్రధాన నిందితుడుగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీని భారత్ రప్పించి ఆతడిని ముంబయిలోని ఆర్థర్‌రోడ్డు జైలులో ఉంచాలని భారత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసింది. ఇందుకు సంబంధించి ఆర్థర్‌రోడ్డులో చోక్సీని ఉంచే సెల్ మొత్తం వివరాలు, ఆతనికి కల్పించిన సదుపా యాలతోపాటు జైలులో ఉన్న మౌలికవసతులన్నింటిపైనీ విడియో, ఫోటో చిత్రాల నివేదికను బెల్జియం కోర్టుకు సిబిఐ ఈడీ అదికారులు అం దచేసారు. ఆర్థర్‌రోడ్డుజైలులోని బ్యారక్‌నంబరు 12ను చోక్సీకోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. 46 చదరపు మీటర్ల బ్యారక్‌లో రెండు సెల్స్ ఉన్నాయి. వాటిలో ప్రైవేటు టాయిలెట్ సౌకర్యం కూడా ఉంది. ప్రాథమిక వసతలున్నీ ఉన్నాయి. సెల్‌లో టివి సదుపాయం కూడా ఉంది. భారత జైళ్లు పరిమితికిమించిన ఖైదీలతో ఉన్నాయని, భద్రత లేదని చేసిన వాదనను ఖండిస్తూ భారత దర్యాప్తుసంస్థలు ఈ నివేదికను ఇచ్చాయి. అర్థర్‌రోడ్డు జైలులోని బ్యారక్ నంబరు 12 అంటే ముంబయి దాడుల కేసు నిందితుడు అజమ్మల్‌కసబ్ నిందితుడు ఉన్న బ్యారక్ అని కూడా చెప్పాలి. కోర్టు విచారణ, వైద్య సపర్యలకు మినహాయిస్తే చోక్సీ బయటకు వచ్చేందుకు అనుమతిలేదు. ఆయన కస్టడీ కూడా జ్యుడిషియల్ పర్యవేక్షణలోనే ఉంటుంది. భారత జైళ్లు అధ్వా న్నంగా ఉంటాయని, న్యాయవ్య వస్థలో స్వయంప్రతిపత్తి స్వతంత్రత లేదని అందువల్ల తమ క్లయింట్‌కు భద్రతలేదని చోక్సీ న్యాయవాదులు వాదించారు. అయితే కోర్టు వీటన్నింటినీ తిరస్కరించింది.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా

డ్రంకన్ డ్రైవ్ తరహాలో నిందితులను కోర్టులో హాజరు పరచాలని నిర్ణయం



**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** జంట నగరాలలో ఇకముందు సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయిం చారు. ఇప్పటి వరకు జరిమానాలతో సరిపుచ్చు తుండగా ఇక ముందు ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని మద్యం తాగి వాహనాలను నడిపే వారిని కోర్టు లో హాజరు పరుస్తున్నట్లు జరిమానాలతో వదలకుండా నేరుగా కోర్టులో హాజరు పరచాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు నిర్ణయించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు చెబు తున్నారు. వారంరోజులుగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేబట్టిన ట్రాఫిక్ పోలీసులు ఇందులో భాగంగా నాలుగు వేల వరకు కేసులు నమోదు చేశారు. జంట నగరాలలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ఘటనలు పదుల సంఖ్యలో వుండడం తెలిసిందే. దీనివల్ల అనేకసార్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ప్రమా దాల్లో పడుతున్నారు. ఇందులో కొందరు మరణి స్తుండగా మరికొందరు తీవ్రంగా లేదా స్వల్పంగా గాయపడుతున్నారు. ఇంకొన్నిసార్లు వీరి కారణం గా ఇతరులు ప్రమాదాలలో పడి మరణించడం లేదా గాయపడడం జరుగుతోంది. రవాణాచట్టాల ప్రకారం సెల్‌ఫోన్ డ్రైవింగ్ తీవ్రమైన నేరం. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మాత్రమే కాదు, సెల్‌ఫోన్‌లో సిని మాలు, లేదా వార్తలు చూస్తూ, చాటింగ్ చేస్తూ, పాటలు వింటూ వాహనాలు నడిపే వారి సంఖ్య కూడా ఇటీవల కాలంలో భాగా పెరిగింది. వీటివల్ల దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమా దాలు పెరుగుతున్నట్లు రవాణా శాఖ పేర్కొంది. ఈ విషయంలో కఠిన చట్టాలు వున్నా ఇంతకాలం పెద్దగా అమలుకు నోచుకోలేదు. అయితే ఈ చట్టాలను జంటనగరాలలో తొలిసారిగా కఠినంగా అమలు చేయనున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుబడ్డ వారిని ఇక ముందు డ్రంకన్ డ్రైవింగ్ కేసుల తరహాలో కోర్టులో హాజరు పరచనున్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితుల్లో కొందరికి జైలుశిక్ష పడుతున్న ఉదంతాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దవుతున్న ఘటనలు అనేకం వుండడం తెలిసిందే. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అనేక మంది నిందితులకు నెలనుంచి మూడునెలల జైలు శిక్షపడిన ఉదంతాలున్నాయి. ఇలా జైలు శిక్షలకు గురై జైలు జీవితం గడిపిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను పదేళ్లనుంచిశాశ్వతంగా రద్దు చేయబడ్డాయి. మూడు అంతకు ఎక్కువగా డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలుకూడా కోర్టులు విధించడం గమనార్హం. ఇప్పుడు సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో నిందితులకు ఈ తరహాశిక్షలు అమలు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. మొదట హైదరాబాద్‌లో అమలుచేశాక సైబరాబాద్, రాచకొండలో అమలు చేయాలని భావిస్తున్నారు.

23-10pg10exAKRP 12 ONG_23-10pg10exAKRP.qxd 10/23/2025 12:13 AM Page 1





## ముక్కోణపు మహిళల టోర్నమెంట్‌లో భారత్ ఓటమి

### 0-2తో ఇరాన్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ముక్కోణపు మహిళల అంతర్జాతీయ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో ఇరాన్ భారత్‌ను అధిగమించింది. భారత మహిళల జట్టు తొలి మ్యాచ్‌లో తడబడటంతో 0-2 తేడాతో ఇరాన్ గెలుపొందింది. మొదటి అర్ధభాగంలో గోల్ లేని తర్వాత సబ్‌స్టిట్యూట్ సారా దిదార్ రెండవ అర్ధభాగంలో రెండుసార్లు గోల్ చేసి విజయాన్ని అందించింది. బ్లూ టైగ్రెస్‌లు దూకుడుగా కనిపించినా ఇబ్బంది పడ్డాయి. ఇరాన్ ప్రారంభం నుండి వేగాన్ని నిర్దేశించుకుంటూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నాల్గవ నిమిషంలోనే పాంథోయ్ సాధారణ క్రాస్‌ను తప్పుదారి పట్టించడంతో ఇబ్బంది సంకేతాలు వెలువడ్డాయి. ఫంజౌబమ్ నిర్మలా దేవి చివరి డిచ్ క్లియరెన్స్ కారణంగా ఇరానియన్ గోల్‌ను తృటిలో తప్పించింది. 64వ నిమిషంలో ఇరాన్ పట్టుదల ఫలించింది. జహ్రా ఘన్‌బారి నుండి వచ్చిన హెడర్ క్రాస్‌బార్‌ను తాకిన తర్వాత, సారా దిదార్ రీబౌండ్‌ను సద్వినియోగం చేసుకుని స్కోరింగ్‌ను ప్రారంభించింది. 74వ నిమిషంలో నోంగ్మైథమ్ రతన్‌బాలా దేవి చేసిన డిఫెన్సివ్ తప్పుడు అంచనా తర్వాత ఫార్వర్డ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. పాంథోయ్‌ను దాటుకుని తక్కువ షాట్‌ను రైఫిల్ చేసి స్కోరును 2-0కి చేర్చింది. 89వ నిమిషంలో లిండా కోమ్ సెర్టో ఫ్రీకిక్ ద్వారా ఇరానియన్ గోల్ కీపర్ రహా యజ్దానీపై ప్రయత్నం చేసినా దాన్ని ఆమె సేవ్ చేయగలిగింది. అయినా ఫాతిమే షాబాన్ ఘోఫ్రూద్ పోస్ట్‌ను బద్దలు కొట్టడంతో ఇరాన్ 3-0తో గెలుపొందింది.



## జింబాబ్వే విజయం


### చిత్తుగా ఓడిన అఫ్ఘానిస్థాన్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తుగా ఓడించింది. 12 ఏళ్ల తర్వాత జింబాబ్వే గెలిచిన తొలి టెస్టు మ్యాచ్ ఇది. మూడు రోజుల్లోన ముగిసిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే అన్ని విభాగాల్లోనూ సత్తా చాటింది. బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసి సత్తా చాటారు. ఓపెనర్ బెన్ కర్రన్ కెరీర్‌లో తొలి సెంచరీతో కదం తొక్కగా, సికిందర్ రజా అర్ధ సెంచరీతో రాణించాడు. నిక్ వెల్చ్ 49 పరుగులు చేసి అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. పేసర్ బ్రాడ్ ఈవాన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. ముజరబానీ 3 వికెట్లు, ఈ ఇన్నింగ్స్‌లో మరో 3 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో రిచర్డ్ నగరవ 5 వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్‌కు ఒకే ఒక సానుకూల అంశం ఉంది. పేసర్ జియా ఉర్ రెహ్మాన్ 7 వికెట్లతో విజృంభించాడు. ఆఫ్ఘన్ స్టార్ బ్యాటర్లు గుర్బాజ్ (37, 9), ఇబ్రహీం జద్రాన్ (19, 42) పెద్దగా రాణించలేకపోయారు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో గుర్బాజ్, రెండో ఇన్నింగ్స్‌లో జద్రానే టాప్ స్కోరర్లు కావడం విశేషం. కెప్టెన్ హస్మతుల్లా షాహిది (7, 7) రెండు ఇన్నింగ్స్‌ల్లో నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో బషీర్ షా (32) ఒక మోస్తరు స్కోర్ చేశాడు. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఇన్నింగ్స్ పరాజయాన్ని మూటగట్టుకుంది.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో.. లక్ష్యసేన్ ఔట్

### దూసుకువెళ్తున్న రోహన్-రుత్విక



**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ 2025లో భారత్‌కు చెందిన లక్ష్య సేన్ ముందుగానే ఔటయ్యాడు. ఇక రోహన్-రుత్విక ముందున్నారు. లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన నాట్ న్గుయెన్ చేతిలో ఓడిపోగా, రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ ఉక్రెయిన్‌కు చెందిన టిటోవ్-కాంటెమిర్‌ను అధిగమించారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య ప్రారంభంలోనే ఓడిపోగా, మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం రోహన్-రుత్విక ద్వయం మొదటి రౌండ్‌లో అద్భుతమైన విజయాన్ని సాధించారు. పురుషుల సింగిల్స్‌లో, ఈ నెల



ప్రారంభంలో హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ 16వ ర్యాంకర్ లక్ష్య ఐర్లాండ్‌కు చెందిన ప్రపంచ 29వ ర్యాంకర్ నాట్ న్గుయెన్ చేతిలో 7-21, 16-21 తేడాతో ఓటమి పాలయ్యాడు. పారిస్ హాల్ డ్రిఫ్ట్ కింద భారత షట్లర్ లయ తప్పినట్లు కనిపించి షటిల్‌ను నియంత్రించడంలో ఇబ్బంది పడ్డాడు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నం. 32 జోడీ రోహన్-రుత్విక 32 నిమిషాల్లో 21-12, 21-19తో ఉక్రెయిన్‌కు చెందిన 58వ ర్యాంకర్ ఒలెక్సి టిటోవ్-యెవెనియా కాంటెమిర్‌ల జోడీపై విజయం సాధించారు. తొలి గేమ్‌లో త్వరిత ఆటతీరుతో, నిర్ణయాత్మకమైన కోర్ట్ ఆటతో భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. రెండో మ్యాచ్‌లో చివరి ఒత్తిడిని తట్టుకుని మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో, వారు రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు. అక్కడ వారు ఫ్రాన్స్‌కు చెందిన 5వ సీడ్ థామ్ గిక్వెల్ మరియు డెల్ఫిన్ డెల్రూలాలను ఎదుర్కొంటారు. లక్ష్య జట్టు ముందుగానే నిష్క్రమించడంతో, ఇప్పుడు అందరి దృష్టి సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి, అన్మోల్ ఖర్బ్ మరియు ఆయుష్ శెట్టి వంటి ఇతర భారతీయ ఆశావహులపైకి మళ్లింది,

## నేడు భారత్ కీలక పోరు



## ఆస్ట్రేలియాతో రెండో వన్డే

### ఇద్దరు స్టార్ ప్లేయర్స్‌పై వేటు



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగే రెండో వన్డే మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ రెండు జట్ల మధ్య ఈ నెల23న అడిలైట్ వేదికగా పోరు జరగనుంది. పెర్త్‌లో జరిగిన తొలివన్డేలో వర్షంకారణంగా అంతరాయం కలిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో అడిలైడ్‌లో టీమిండియా గెలవడం చాలా ముఖ్యం. ఇందులో ఓటమి చెందినట్లయితే భారత్ సిరీస్‌ను కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిసిసిఐ సెలక్టర్లు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్లేయింగ్ లెవన్‌లో పలు మార్పులు చేశారు. తొలి వన్డేలో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఓపెనింగ్ జోడీ శుభ్‌మాన్‌గిల్, రోహిత్ శర్మ కూడా మార్పులకు లోనయ్యే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ లేదా గిల్ ఇద్దరూ పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు, ఒత్తిడి రోహిత్‌పై ఉంది. రోహిత్‌ను జట్టు నుంచి తప్పించి అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేకు యశస్వి జైస్వాల్‌ను ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. యశస్వి ప్రస్తుతం తన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో రోహిత్‌ను తప్పించి, జైస్వాల్, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ద్వారా పెద్ద రిస్క్ తీసుకోనుంది. ఇక పెర్త్ వన్డేలో భారత్ ఓడిపోయినప్పుడు తలెత్తిన అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎందుకు చేర్చలేదు. టీమిండియా ఒక స్పెషలిస్ట్ బౌలర్‌కు బదులుగా ముగ్గురు ఆల్ రౌండర్లను ఎందుకు రంగంలోకి దించింది? కుల్దీప్‌ను ఎందుకు విశ్వసించలేదు? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే కుల్దీప్ గురువారం జరిగే మ్యాచ్‌లో కూడా ఆడటం లేదని తెలుస్తోంది. అడిలైడ్ ఓవల్‌లో ఫాస్ట్ బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. దీంతో కుల్దీప్ మైదానంలోకి దిగడం కష్టమైంది. కుల్దీప్ మాత్రమే కాదు, మహమ్మద్ సిరాజ్ కూడా అడిలైడ్‌లో ప్రాక్టీస్ చేయలేదు. అందువల్ల, రెండవ వన్డేకు అతనికి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. దీని వలన ప్రసిద్ధ్ కృష్ణకు అవకాశం లభిస్తుంది. ఈ విధమైన మార్పులతో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టులో భారత్ సిరీస్‌ను నిలుపుకోవచ్చని సెలక్టర్ల కమిటీ భావిస్తోంది.

ఆట



## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నం.1 బుమ్రా

### 17వ స్థానంలోకి సిరాజ్

**న్యూఢిల్లీ:** ఐసిసి పురుషుల టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో ఉన్న ఆధిక్యాన్ని పాకిస్తాన్‌కు చెందిన నోమన్ అలీ కేవలం 29 పాయింట్లకు తగ్గించాడు. దక్షిణాఫ్రికాపై పాకిస్తాన్ 93 రన్స్ తేడాతో విజయం సాధించిన మ్యాచ్‌లో నోమన్ 10 వికెట్లు తీయడంతో అతను 4 స్థానాలు ఎగబాకి మొత్తం 853 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానానికి చేరుకున్నాడు. ఈ మేరకు బుధవారం పురుషుల ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. అలాగే భారత జట్టుకు చెందిన మరో ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లో బలమైన పునరాగమనం చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడంతో ఏడాది తర్వాత తొలిసారిగా ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో తిరిగి అడుగుపెట్టాడు. దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన తర్వాత అతని సహచరుడు షాహీన్ అఫ్రిది కూడా 3 మెట్లు ఎగబాకి 19వ స్థానానికి చేరుకున్నాడు. పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్లలో, మహ్మద్ రిజ్వాన్ 4 స్థానాలు ఎగబాకి 16కు, బాబర్ ఆజం 2 స్థానాలు ఎగబాకి 22కు, సల్మాన్ ఆఘా 8 స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆదిల్ రషీద్ మూడు స్థానాలు ఎగబాకి మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. వన్డే బౌలర్లలో పేసర్లు జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్ కూడా మంచి ఫలితాలను సాధించారు. వరుసగా 10వ, 21వ స్థానాలకు ఎగబాకారు. వెస్టిండీస్‌పై స్థిరమైన ప్రదర్శన తర్వాత బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహిదీ హసన్ మీరాజ్ ఆరు స్థానాలు ఎగబాకి 18వ స్థానానికి చేరుకున్నారు.

వాణిజ్యం

## ఐటి రంగానికి కొత్త ఊపు

### పెరుగుతున్న నియామకాలు!

### తొలి ఆరునెలల్లోనే 27 శాతం వృద్ధి



**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** భారత ఐటీ రంగానికి క్రమేపీ కొత్త ఊపు వచ్చింది. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్లకు ఇది నిజంగా మంచి పరిణామమే. ప్రాజెక్టులు పుంజుకోవడంతో కంపెనీలు మళ్లీ నియామకాల బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఏకంగా 27 శాతం పెరిగాయని మానవ వనరుల సేవల సంస్థ 'అడెకో ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి నియామకాలు గణనీయంగా పెరిగాయి.

ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీలు దృష్టి సారించడం సానుకూల పరిణామం. ఫ్రెషర్ల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయి. అయితే, కంపెనీలు తమ నియామక వ్యూహాన్ని మార్చుకున్నాయి. కేవలం పేరున్న ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశాలు కల్పిస్తున్నాయి.

గతంలో మాదిరిగా ఆఫర్ లెటర్ ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా, అవసరమైన నైపుణ్యాలపై కాలేజీల్లోనే శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప వివరించారు. నియామకాలతో పాటు ఉద్యోగుల జీతాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 5 శాతం పెరిగాయి.

మరోవైపు, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది.


ఈ రంగాల్లో 45 నుంచి 50 శాతం వరకు నైపుణ్యం ఉన్నవారి కొరత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి పెద్ద నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ఇప్పుడు విశాఖపట్నం, ఇండోర్, కోయంబత్తూర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి సారిస్తున్నాయి.

ఈ నగరాల్లో నియామకాలు 7 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ఇప్పటికీ ప్రధాన నియామకాలు పెద్ద నగరాల్లోనే జరుగుతున్నాయి. సుమారు 50 ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు అడెకో ఇండియా తెలిపింది.

## చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఎలాంటి అడ్డంకుల్లేవ్!

### స్పష్టంచేసిన బెల్జియం కోర్టు

**బ్రస్సెల్స్, అక్టోబరు 22:** పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీని భారత్‌ను తీసుకువచ్చేందుకు మార్గం సుగమమైంది. చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం కోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, బెల్జియన్ చట్టాల ప్రకారం చోక్సీని భారత్‌కు అప్పగించడంలో ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని ఒక కోర్టు తన తీర్పులో చోక్సీ నేరాలు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 120బి, 201, 409, 420, 477ఏ కింద చట్టం ప్రకారం శిక్షార్హమైనవని తెలిపింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ అభియోగాలు బెల్జియన్ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవని కోర్టు స్పష్టం చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. నేరాలు 2016 డిసెంబర్ 31 ఒకటి జనవరి 2019 మధ్య భారత్‌లో జరిగాయని, బెల్జియన్ చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్ కాలపరిమితికి లోబడి ఉండదని తీర్పు స్పష్టం చేసింది.



అయితే, భారత్ ఆదేశాలకు తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ చోక్సీ చేసిన వాదలను కోర్టు తోసిపుచ్చింది. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టిపడేసింది. చోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. అంట్వర్ప్‌లోని కోర్టు చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భారత్‌కు చోక్సీని అప్పగిస్తే ఆయనను ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నెంబర్ 12లో ఉంచుతామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. బ్యారక్ దాదాపు 46 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని రెండు సెల్‌లు, ప్రైవేట్ టాయిలెట్ సౌకర్యాలు ఉన్నాయని, వైద్య సహాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, తాను అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నానని.. సరైన చికిత్స అందదని చోక్సీ చేసిన వాదనలు కోర్టు తోసిపుచ్చింది.



## రూపాయి క్షీణత కట్టడికి ఆర్బీఐ డాలర్ విక్రయాలు!

**ముంబయి, అక్టోబరు 22:** అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా కఠిన నిర్ణయాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారు రూ. 67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయిన సంగతి తెలిసిందే. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మార్కెట్లో డాలర్లకు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అటువంటి సమయంలో ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దీనివల్ల మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జులై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. దీని విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ఈ ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.




## సత్యనాదెళ్లకు రూ.800 కోట్ల ప్యాకేజి

**రెడ్మండ్(యుఎస్ఎ), అక్టోబరు 22:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం రికార్డుస్థాయిలో పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఏకంగా 96.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.800 కోట్లకుపైగా) వేతన ప్యాకేజీని అందుకున్నారు. గత దశాబ్ద కాలంలో ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే అత్యధిక వేతనం కావడం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కంపెనీ సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగానే ఆయన జీతాన్ని భారీగా పెంచినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, నాదెళ్ల వేతనంలో అధిక భాగం షేర్ల రూపంలోనే ఉంది. ఆయన ప్రాథమిక వేతనం 2.5 మిలియన్ డాలర్లు కాగా, మిగిలిన 90 శాతం కంపెనీ షేర్ల రూపంలో అందుకోనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచంలో ఏఐ ఒక పెను మార్పునకు కారణమవుతోందని, ఈ కీలక సమయంలో సత్య నాదెళ్ల, ఆయన నాయకత్వ బృందం మైక్రోసాఫ్ట్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారని కంపెనీ బోర్డు వాటాదారులకు తెలియజేసింది. సత్య నాదెళ్ల నాయకత్వంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ ఈ ఏడాదిలోనే దాదాపు 23 శాతం పెరిగింది. ముఖ్యంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి పోటీదారులను అధిగమిస్తూ కంపెనీకి చెందిన అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యాపారం నిలకడగా వృద్ధి చెందుతోంది.

ఒకప్పుడు చిన్న స్టార్టప్‌గా ఉన్న ఓపెన్‌ఏఐలో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం నాదెళ్లకు బాగా కలిసొచ్చింది. చాట్‌జీపీటీ సంచలనం సృష్టించడంతో మైక్రోసాఫ్ట్ ఆ సంస్థలో తన పెట్టుబడులను 10 బిలియన్ డాలర్లకు పైగా పెంచింది. సత్య నాదెళ్ల వ్యూహాత్మక నిర్ణయాల వల్లే మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ రంగాల్లో అగ్రస్థానానికి చేరింది. లింక్డ్ఇన్, గిట్‌హబ్, యాక్టివిజన్ బ్లిజార్డ్ వంటి కీలక సంస్థలను కొనుగోలు చేసి సాఫ్ట్‌వేర్, గేమింగ్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ రంగాల్లోనూ కంపెనీని విస్తరించారు.

## పండగ సీజన్‌లో రికార్డు గరిష్టానికి యుపిఐ పేమెంట్స్



**ముంబయి, అక్టోబరు 22:** పండగ సీజన్‌లో డిజిటల్ చెల్లింపులు సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డులను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94,000 కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం కావడం గమనార్హం. గత కొన్నేళ్లుగా నెలవారీగా చూస్తే ఇదే అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే, యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదు చేసే దిశగా దూసుకెళ్తోంది. దీనికి దీపావళి పండగతో పాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు కూడా కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇది అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ, ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే, రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే, ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ. 25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps